అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400



నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

బిజెపి 'ఎన్నికల చోరీ శాఖ'గా ఇసి

19న ఢిల్లీలో ఇండియా కూటమి భేటీ

రాబర్ట్ వాద్రాపై ఇడి చార్జిషీట్

క్లీన్ సిటీగా 8వ సారి ఇండోర్

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 228 | శుక్రవారం | 18-07-2025 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## కేంద్రం పిలిస్తే వెళ్లకుండా

# కెసిఆర్ ఫాంహౌస్‌కు వెళ్లాలా?

### అర్ధరాత్రి లోకేశ్‌తో మూడుసార్లు కెటిఆర్ ఎందుకు కలిశారు?



• కెసిఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకొని మాట్లాడుతోంది • తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్రకు వెళ్తా • రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు ఇచ్చితీరుతాం • కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖలు రాయడం కాదు.. ప్రణాళికతో ముందుకు రావాలి • బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేసిన తరువాతే ఆయన మాట్లాడాలి • కెటిఆర్ నాయకత్వాన్ని ఆయన సోదరే ఒప్పుకోవడం లేదు • సొంత వివాదాల్లో ఆ కుటుంబం కూరుకుపోయింది • ఢిల్లీలో మీడియా 'చిట్‌చాట్'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్రలో పర్యటిస్తానని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు ఇచ్చితీరుతామన్నారు. బతుకమ్మ చీరలు, కెసిఆర్ కిట్ తప్ప పాత పథకాలన్నీ అమల్లోనే ఉన్నాయని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖలు రాయడం కాదని, ప్రణాళికతో ముందుకు రావాలని, ఆయనతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్‌రెడ్డి గురువారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'నదుల అనుసంధానం కోసం కేంద్రం ప్రయత్నిస్తోంది. ఇచ్చంపల్లి నుంచి కావేరికి అనుసంధానించాలనే ప్రతిపాదన ఉంది. కేంద్రం పిలిచినప్పుడు వెళ్లకుండా కెసిఆర్ ఫాంహౌస్‌కు వెళ్లాలా? అక్కడికి వెళితే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి? ప్రతిపక్ష నేతగా కెసిఆర్ ఢిల్లీకి వెళ్లవచ్చు. రాష్ట్రం కోసం ఆయన పనిచేస్తానంటే ఎవరూ అడ్డుకోరు' అని సిఎం అన్నారు. ప్రతిపక్ష నేత కెసిఆర్ చర్చకు వస్తే సిద్ధంగా ఉన్నానని, కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వాలని, వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణకు తరువాయి 2లో



## కొత్త రైలు మార్గాలు మంజూరు చేయండి

• కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి • సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి • కేంద్ర ఐటి, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

తెలంగాణలో రైల్వే అనుసంధానత పెంపు కోసం నూతన రైల్వే ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల అనుసంధానత, పారిశ్రామిక, వ్యవసాయక ఎగుమతులు, దిగుమతుల తరువాయి 2లో



హెచ్‌సిఎలో పదేళ్లలో

## రూ.600 కోట్లు అవినీతి

కెటిఆర్, కవిత ప్రధాన కుట్రదారులు

సిఐడి చీఫ్‌తో పాటు ఇడికి ఫిర్యాదు చేసిన టిసిఎ నేతలు

హెచ్‌సిఎపై ఇడి కేసు నమోదు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో చోటుచేసుకున్న ఆర్థిక నేరాలు, అక్రమాలకు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, ఎంఎల్‌సి కె.కవిత, హెచ్‌సిఎ అధ్యక్షులు ఎ.జగన్‌మోహన్‌రావులే ప్రధాన కుట్రదారులని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు వై.లక్ష్మి నారాయణ, ప్రధాన కార్యదర్శి ధర్మ గురువారెడ్డి ఆరోపించారు. పదేళ్లలో హెచ్‌సిఎలో సుమారు రూ.500 నుంచి రూ.600 కోట్లు అవినీతికి పాల్పడ్డారని వారు ఆరోపిస్తూ ఈ మేరకు కెటిఆర్, కవిత అక్రమాలపై సిఐడి చీఫ్ చారుసిన్హాతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఇడి) జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్‌లకు గురువారం ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ..హెచ్‌సిఎ మాజీ డైరెక్టర్ వంకా ప్రతాప్ వ్యవహారంపై కూడా లోతుగా దర్యాప్తు చేయాలని కోరారు.హెచ్‌సిఎలో జరుగుతున్న తరువాయి 12లో



సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో

## ఎసిబి దాడులు

• రూ.96 వేల నగదు, 152 రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం • 32 మంది అనధికార వ్యక్తుల గుర్తింపు • వివరాలు వెల్లడించిన ఎసిబి అదనపు డిజిపి విజయ్‌కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని పలు రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 32 మంది అనధికార వ్యక్తులను గుర్తించడంతో పాటు రూ.96 వేల నగదు, 152 రిజిస్ట్రేషన్ పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎసిబి అదనపు డిజి విజయ్‌కుమార్ తెలిపారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా బీబీ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సదాశివపేట మెదక్ జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, జడ్చర్ల, మహబూబ్ నగర్ జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.బీబీ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం తనిఖీల్లో లెక్కలు చూపని రూ. 61,430 నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయ తరువాయి 2లో

ఫోన్ ట్యాపింగ్ కేసులో

## కేంద్రమంత్రి బండికి 'సిట్' పిలుపు

24న విచారణకు హాజరు కావాలని నోటీసులు

కెసిఆర్ పాపాల వల్లే .. : బండి సంజయ్

ప్రజాపక్షం/హైదరాబాద్



ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెల 24న విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై బండి సంజయ్ స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేసిన పాపాల కారణంగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) నుంచి తనకు నోటీసులు వచ్చాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ నెల 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇవ్వాలంటూ జూబ్లీహిల్స్ ఏసీపీ ఆయనకు లేఖ రాశారు. స్టేట్‌మెంట్ ఇవ్వడానికి హైదరాబాద్‌లోని లేక్ వ్యూ అతిథి తరువాయి 2లో

# నాలుగు రోజులు భారీ వర్షాలు

• ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక • గురువారం రాత్రి హైదరాబాద్ మహానగరంలో దంచికొట్టిన వర్షం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాగల నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. శుక్రవారం నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, తరువాయి 2లో



## ఇరాక్ షాపింగ్ మాల్‌లో మంటలు

02



# 12 గంటల బంద్

• బిహార్‌లో కాలేజీ విద్యార్థి ఆత్మహత్యకు నిరసనగా వీధుల్లోకి వచ్చిన ప్రతిపక్ష పార్టీలు
• స్తంభించిన జనజీవనం, రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం

**భువనేశ్వర్ :** లైంగిక వేధింపుల కేసులో న్యాయం జరగకపోవడంతో ఒడిశాలో గురువారం ప్రతిపక్ష కాంగ్రెస్, మరో ఏడు రాజకీయ పార్టీలు 12 గంటల బంద్ పాటు బంద్ చేపట్టాయి. దీంతో సాధారణ జీవితం స్తంభించింది. బంద్ కారణంగా రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుండి హింస లేదా అవాంఛనీయ ఘటనలు జరిగినట్లు నివేదికలు రాలేదని హోం శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బంద్ ఎక్కువగా రవాణా, వ్యాపార రంగాలను ప్రభావితం చేసిందన్నారు. గనుల నుండి బొగ్గు, ఖనిజ రవాణాపై బంద్ ప్రభావం తీవ్రంగా పడగా, అంగుల్‌లోని నాల్కో, రూర్కెలాలోని రూర్కెలా స్టీల్ ప్లాంట్, ఇతర ప్రదేశాల్లోని ప్రధాన పరిశ్రమలలో కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగాయన్నారు. భువనేశ్వర్, కటక్, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. అయితే కొన్ని చోట్ల రైల్వే ట్రాక్‌లపై పికెటింగ్ కారణంగా రైలు సేవలు ప్రభావితమయ్యాయి. పోలీసులు నిరసనకారులను ట్రాక్‌ల నుండి తొలగించిన తర్వాత తెల్లవారుజామున నిలిపివేసిన కొన్ని రైళ్లు తిరిగి కార్యకలాపాలు ప్రారంభించినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. నిరసన ప్రదర్శనల కారణంగా ఉదయం 6 గంటల నుండి అనేక రైళ్లు ఆలస్యంగా నడిచాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రదేశాలలో మార్కెట్లు, పాఠశాలలు, వ్యాపార సంస్థలు మూసివేశారు. అయితే, అంబులెన్స్‌లు, ఆసుపత్రులు, మిల్క్ పార్లర్లు వంటి ముఖ్యమైన సేవల కార్యకలాపాలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం లేదు. బాలాసోర్‌లో మరణించిన కళాశాల బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాష్ట్ర రాజధానిలోని అనేక ప్రధాన రహదారులపై నిరసనకారులు దిగ్బంధనాలు నిర్వహించారు. కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐఎం (ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్, ఆర్‌జెడి, ఎస్‌పి, ఎన్‌సిపి నాయకులు బంద్‌ను విజయ వంతం చేయడానికి తమ పార్టీ జెండాలను తరువాయి 12లో

మహిళలు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే

# లింగవివక్షకు తెర




• రాజ్యాంగం వల్లే మహిళలకు ఆత్మగౌరవం, లింగసమానత్వం, వరకట్న నిషేధ హక్కులు • వారికి ఆర్థిక స్వాతంత్ర్యమే ప్రజాప్రభుత్వ లక్ష్యం • లింగసమానత్వ సదస్సులో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో మహిళలకు ఆత్మగౌరవం, లింగ సమానత్వం, వరకట్న నిషేధం వంటి హక్కులు కలిగాయంటే అది బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లేనని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అదే స్ఫూర్తితో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే లింగ వివక్ష సమస్య నివారించే అవకాశం ఉంటుందని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. శుక్రవారం నిజాం కళాశాలలో మహిళా కమిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లింగ సమానత్వం సదస్సులో డిప్యూటీ సీఎం ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం మహిళా సంఘాలకు రూ.20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని ప్రకటించగానే ప్రతిపక్షాలు అపహాస్యం చేశాయన్నారు. కానీ తమ ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, మొదటి ఏడాదిలో రూ. 21,632 కోట్లు వడ్డీ లేని రుణాలు రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలకు పంపిణీ చేశామని తరువాయి 2లో

# డెడ్ స్టోరేజీకి గణప సముద్రం..

• 14 ఫీట్లకు పడిపోయిన నీటి నిలువలు
• నీటి సామర్థ్యం 30 అడుగులు
• 25 వేల ఎకరాల్లో సాగు, 5 మండలాల్లో తాగు నీటికి కటకట • ఆందోళనలో ఆయకట్టు రైతులు • ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి వేడుకోలు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలంలోని కాకతీయ కాలం నాటి గణప సముద్రం వర్షాలు లేక డెడ్ స్టోరేజ్‌కి చేరింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే రామప్ప చెరువు తర్వాత అతిపెద్ద చెరువు గణప సముద్రం. ఈ ప్రాంత పంటలకు జీవనదిగా విలసిల్లుతుంది. రైతులకు బతుకుదెరువుగా మారింది. చెరువులో నీటి సామర్థం 30 ఫీట్లు కాగా ప్రస్తుతం 14 ఫీట్ల లోతుకు నీటి నిలువలు పడిపోయాయి. ఇప్పటికే పచ్చని పొలాలతో చెరువు నిండి మత్తడి పోసి కళకళలాడి పసిడి పంటలతో విరజిల్లే గణపురం చెరువు నీళ్లు లేక వెల వెల బోతుంది. ఈ గణప సముదం చెరువును క్రీస్తు శకం 750 నుండి 1323 నాటి వరకు కాకతీయులు పరిపాలించారు. అప్పుడు గనప సముద్రంతో పాటు కోటగుళ్లను నిర్మించారు. ప్రస్తుతం చెరువు నుండి సుమారు 25 ఎకరాలకు అట్లాగే ఐదు మండలాలకు, సాగు త్రాగునీరు అందిస్తున్నారు. ఈ చెరువు ఇప్పటి వరకు నీటి నిల్వలు తరువాయి 12లో

# ముందస్తు అనుమతి లేనందువల్లే

పక్షపాతంగా ఆర్‌సిబి విజయోత్సవ పరేడ్

ఫలితంగా తొక్కిసలాట ఘటన

హైకోర్టుకు కర్ణాటక ప్రభుత్వం నివేదిక

ఆర్‌సిబి, కెఎస్‌సిఎదే బాధ్యత అని నివేదికలో వెల్లడి



**న్యూఢిల్లీ :** బెంగళూర్‌లోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతిచెందిన విషాద ఘటనపై కర్ణాటక హైకోర్టుకు ఇచ్చిన నివేదికలో కర్నాటక ప్రభుత్వం ది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ఫ్రాంచైజీ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి)ను, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కెఎస్‌సిఏ)ను నిందించింది. ముందస్తు అనుమతి లేకుండా, అధికారులకు తప్పనిసరి వివరాలు అందించకుండా జట్టు భారీ విజయోత్సవ పరేడ్‌ను, వేడుకలను పక్షపాతంగా నిర్వహించిన ఫలితంగానే తొక్కిసలాట విషాదఘటన చోటుచేసుకుందని హైకోర్టుకు నివేదించింది. కర్ణాటక ప్రభుత్వం నివేదికను హైకోర్టుకు అందజేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గురువారం అందజేసిన ఈ నివేదిక ప్రకారం...సాయంత్రం 630గంటలకు అహ్మదాబాద్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ (పిబికెఎస్) మధ్య ఐపిఎల్ ఫైనల్ జరగడానికి కొన్ని గంటల ముందు, ఆర్‌సిబి నిర్వహణ భాగస్వామి అయిన డిఎన్‌ఏ నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా అమెరికాలో ప్రదర్శనలు

**చికాగో:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల పట్ల ప్రపంచ దేశాలు మాత్రమేకాదు... అత్యధిక శాతం మంది అమెరికన్లు కూడా మండిపడుతున్నారు. వలసదారుల నుంచి వైద్య ఆరోగ్య రంగం వరకూ అన్ని అంశాల్లోనూ ట్రంప్ చేపడుతున్న వివాదాస్పద నిర్ణయాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు మొదలయ్యాయి. గురువారం పలు ప్రాంతాల్లో నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ప్లకార్డులతో ప్రదర్శనలు నిర్వహించారు. అట్లాంటా, సెయింట్ లూయిస్, ఓక్లాండ్, కాలిఫోర్నియా, అన్నాపొలిస్, మేరీలాండ్‌సహ దేశ వ్యాప్తంగా 1,600కు మించి ప్రాంతాల్లో నిరసనలు జరగడం ట్రంప్‌పై ఉన్న వ్యతిరేకతకు అద్దం పడుతున్నది. ప్రజావ్యతిరేక చర్యలకు ట్రంప్ స్వస్తి పలకాలని, వైద్య, ఆరోగ్య రంగానికి నిధుల కోత, ఉద్యోగులపై ఉద్వాసన వేటు వంటి చర్యలను ఉపసంహరించుకోవాలని ప్రదర్శనకారులు డిమాండ్ చేశారు.

## ఇరాక్ షాపింగ్ మాల్‌లో మంటలు

### కనీసం 60 మంది మృతి





**బాగ్దాద్:** ఇరాక్‌లోని కుట్ నగరంలో చోటు చేసుకున్న ఓ భారీ అగ్నిప్రమాదం కనీసం 60 మంది ప్రాణాలను బలిగొంది. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు వెల్లడించిన సమాచారాన్ని అనుసరించి, ఒక ఐదు అంతస్తుల భవనంలో ఇటీవల కొత్తగా ఓ షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. బుధవారం రాత్రి ఈ భవనంలో మంటలు చెలరేగాయి. దీనితో చాలా మంది ఊపిరి ఆడక మరణించారు. చాలా వరకు మృత దేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. ఘటనకుగల కారణాలు ఇంకా తెలియరాలేదు. దర్యాప్తు ప్రారంభమైందని, 48 గంటల్లో ప్రాథమిక వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ఈ షాపింగ్ మాల్ యజమానులతో పాటు, భవన యజమానులపైన కూడా కేసులు నమోదు చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాచారం అందిన వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు 45 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనపై ఇరాక్ ప్రధాని మహమ్మద్ షియా అల్‌సుదానీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాద ఘటనా స్థలికి వెళ్లి, దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, కుట్ ప్రావీన్స్‌లో మూడు రోజుల సంతాప దినాలను అధికారులు ప్రకటించారు. రెస్టారెంట్, సూపర్ మార్కెట్లు కూడా ఉన్న ఈ షాపింగ్ మాల్‌ను వారం రోజుల క్రితమే ప్రారంభమైంది. ఇంతలో అగ్ని ప్రమాదం సంభవించడం పట్ల విచారం వ్యక్తమవుతున్నది. ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మాల్‌లో చాలా భాగం మంటల్లో చిక్కుకున్నట్లు ఈ వీడియో దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి. భవనం నిర్మాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణంగా అనుమానిస్తున్నారు. గతంలోనూ ఇలాంటి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా, ఎలాంటి భద్రతా ప్రమాణాలు లేకుండానే భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## ఆర్ఐసి పునరుద్ధరణపై రష్యా చొరవకు చైనా మద్దతు

**బీజింగ్:** నిద్రాణంగా ఉన్న రష్యా-భారత్-చైనా (ఆర్ఐసి) త్రైపాక్షిక సంబంధాల కూటమి పునరుద్ధరణ కోసం రష్యా చూపుతున్న చొరవకు చైనా గురువారం మద్దతు ప్రకటించింది. ఈ త్రైపాక్షిక సహకారం మూడు దేశాల ప్రయోజనాలకు మాత్రమే కాకుండా ఈ ప్రాంతంతోపాటు, యావత్ ప్రపంచ భద్రత, స్థిరత్వానికి కూడా ఉపయోగపడుతుందని చైనా ఒక ప్రకటనలో పేర్కొంది. ఆర్ఐసి ఫార్మాట్ పునఃప్రారంభాన్ని ఆశిస్తున్నట్లు రష్యా విదేశాంగ సహాయమంత్రి ఆండ్రీ రుడెంకో చెప్పినట్లు రష్యన్ న్యూస్ పోర్టల్ ఇజ్వెస్తియా పేర్కొంది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ, ఈ ప్రయత్నంలో భాగంగా చైనా, భారత్‌తో సంప్రదింపులు, చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది. ఈ రెండు దేశాలతో జరుగుతున్న చర్చల్లో పురోగతి ఉందని, ఈ మూడు దేశాలు 'బ్రిక్స్' వ్యవస్థాపకులతోపాటు ముఖ్యమైన భాగస్వాములని ఇజ్వెస్తియా తెలిపింది. కాబట్టి, ఈ ఫార్మాట్ తిరిగి క్రియాశీలకం కావడాన్ని కోరుకుంటున్నామని రష్యా తెలిపింది. ఆర్ఐసి చట్రంలో పనిని తిరిగి ప్రారంభించడానికి చైనా, భారత్ కూడా అంగీకరిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేసింది. ఇలావుంటే, రష్యా మంత్రి రుడెంకో వ్యాఖ్యలపై స్పందించాల్సిందిగా కోరినప్పుడు, చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ మాట్లాడుతూ, చైనా-రష్యా-భారతదేశ సహకారం మూడు దేశాల ప్రయోజనాలకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో, ప్రపంచంలో శాంతి, భద్రత, స్థిరత్వం, పురోగతిని నిలబెట్టడానికి కూడా సహాయపడుతుందని అన్నారు. త్రైపాక్షిక సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడంపై రష్యా, భారతదేశంతో చర్చించడానికి చైనా సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఇటీవల ఎస్‌సిఒ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనడానికి చైనాకు వెళ్లిన తర్వాత, విదేశాంగ మంత్రి వాంగ్ యి, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ



లావ్‌రోవ్‌తో సహా పలువురితో చర్చలు జరిపారు. మొదట కరోనావైరస్ కారణంగా, తరువాత 2020లో తూర్పు లడఖ్‌లో భారత్-చైనా సైనిక ప్రతిష్టంభన కారణంగా ఆర్ఐసి ఫార్మాట్‌లో ఉమ్మడి సహకారం నిలిచిపోయిందని లావ్‌రోవ్ గత సంవత్సరం చెప్పారు. దాని పునరుద్ధరణ అవకాశాలను తోసిపుచ్చడానికి వీల్లేదని ఆయన అప్పట్లో వ్యాఖ్యానించారు. ఇలావుంటే, లడఖ్ ప్రతిష్టంభన ఫలితంగా నాలుగు సంవత్సరాలకు పైగా భారతదేశంతో చైనా సంబంధాలు స్తంభించిపోయాయి. గత సంవత్సరం బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా కజాన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలు పునరుద్ధరణకు మార్గం సుగమమైంది. అప్పటి నుండి, సంబంధాలను సాధారణీకరించడానికి రెండు దేశాల మధ్య స్థిరమైన సంభాషణ ప్రక్రియ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆర్ఐసి ప్రస్తావన తెరపైకి రావడం ఆహ్వానించతగిన పరిణామం.

## గాజాలో చర్చిపై దాడులు
### ఇద్దరు మృతి..పలువురికి గాయాలు



**డెర్ ఎల్‌బలా (గాజాస్ట్రిప్):** గాజాలోని ఒక చర్చిపై జరిగిన దాడిలో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. అంతర్జాతీయ మీడియాను ఉటంకిస్తూ పిటిఐ కథనం ప్రకారం, ఇటీవల మరణించిన పోప్ ఫ్రాన్సిస్‌కు అత్యంత సన్నిహితుడు, మతాధికారి ఫ్రాన్సిస్ గాబ్రియల్ రొమనెల్లీ, అక్కడ మానసిక రుగ్మతలకు చికిత్స పొందుతున్న 84 వృద్ధురాలు ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డారని చర్చి అధికారులు తెలిపారు. గాజా స్ట్రిప్‌లోని ఏకైక చర్చి ఇదే. ఇందులో క్రిస్టియన్లతోపాటు, పలువురు ముస్లింలు కూడా ఉన్నారు. వీరి లో ఎక్కువ మంది దివ్యాంగులు కావడం విశేషం. పలువురు మహిళలు, పిల్లలకు ఆశ్రయం ఇస్తున్న చర్చిపై జరిగిన దాడిని అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఖండించింది. కాగా, ఈ దాడి ఇజ్రాయెల్ చేసిందేనని ఇటాలీ ప్రధాని జియోర్జియా మెలోనీ ఆరోపించారు. ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగానే చర్చిని లక్ష్యంగా చేసుకొని దాడికి తెగబడిందని విమర్శించారు. ప్రార్థనా మందిరాలు, జనావాసాలపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులు గర్హనీయమని వ్యాఖ్యానించారు. అల్ అహ్లీ ఆసుపత్రికి అత్యంత సమీపంలో ఉన్న చర్చి దాడికి గురికావడంతో, ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. ఇదిలావుంటే, ఈ దాడిని ఇజ్రాయెల్ సైన్యంగానీ, అధికారులుగానీ ధ్రువీకరించలేదు.

## అలాస్కా తీరంలో భారీ భూకంపం

**జునెవు (అలాస్కా/ అమెరికా):** అమెరికాలోని అలాస్కా ద్వీపకల్పం భారీ భూకంపంతో వణికిపోయింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 7.3 మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. 1997లో 7.2 మాగ్నిట్యూడ్ తీవ్రతతో భూమి కంపించింది. ఆ తర్వాత అంతటి భారీ భూకంపం నమోదుకావడం ఇదే మొదటిసారి. భూ ప్రకంపనలను గుర్తించిన యుఎస్ జియోలాజికల్ సర్వే సునామీ హెచ్చరికలు జారీ చేసింది. కానీ, భూ ప్రకంపనలను తీరానికి చేరిన నేపథ్యంలో, ఆ హెచ్చరిలను ఉపసంహరించుకుంది. కాగా, భూకంపం వల్ల చాలా చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. గుంటలు పడి, భూమి కుంగిపోయింది. అయితే, ఆస్తి, ప్రాణ నష్టాలపై ఇలాంటి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అమెరికన్ జిలాజికల్ సర్వే అధికారుల ప్రకటనను అనుసరించి, అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.37 గంటలకు భూప్రకంపనలు వచ్చాయి.



తీరానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఏర్పడింది. దక్షిణ అలాస్కా, అలాస్కా ద్వీపకల్పంలోని పలు ప్రాంతాల్లో లోతు లేని భూకంపం ఏర్పడినట్టు గుర్తించారు. భూమి పొరల్లో ఏర్పడే ప్రకంపనల వల్ల సంభవించే భూకంపాలతో పోలిస్తే, లోతులేని భూకంపాలు అత్యంత ప్రమాదకరమైనవి. భూమిలోపల వచ్చే భూకంప తరంగాలు ఉపరితలం వరకూ రావాలంటే ఎంతో దూరం ప్రయాణించాలి. ఫలితంగా తీవ్రత తగ్గుతుంది. కానీ లోతు తక్కువగా ఉన్నప్పుడు, ప్రకంపనలు అత్యంత వేగంగా ఉపరితలంవైపు ప్రయాణిస్తాయి. దీనితో భారీ భూకంపాలు ఏర్పడతాయి. ఆస్తి, ప్రాణ నష్టాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇలావుంటే, అమెరికాలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో మాత్రమే సునామీ హెచ్చరికలు చేస్తారు. ఈ హెచ్చరిక వెలువడిన వెంటనే ప్రజలు ఎత్తయిన ప్రాంతాలకు లేదా పూర్తిగా లోతట్టు ప్రాంతాలకు వెళ్లాలి. బీచ్ వంటి తీర ప్రాంతాలకు, జల మార్గాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. అలాస్కా ప్రాంతం తరచు భూకంపాలు వచ్చే 'పసిఫిక్ రంగ్ ఆఫ్ ఫైర్' పరిధిలో ఉంది కాబట్టి, ఇక్కడ సునామీ హెచ్చరికలు వెలువడిన వెంటనే ప్రజలు అప్రమత్తమవుతారు. ఈసారి అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, సుమారు రెండు గంటల తర్వాత వాటిని ఉపసంహరించుకున్నారు.

## ముగిసిన అల్బనేస్ చైనా పర్యటన



**బీజింగ్ :** ఆస్ట్రేలియా ప్రధాని ఆంట్నీ అల్బనేస్ చైనా పర్యటన గురువారం ముగిసింది. ఆరు రోజుల పాటు జరిగిన ఈ పర్యటనలో భాగంగా ఆయన బీజింగ్, షాంఘై, చెంగ్‌దూ నగరాలను సందర్శించారు. బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, ప్రధాని లీ క్వియాంగ్‌తోపాటు, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి) ప్రముఖులతోనూ అల్బనేస్ సమావేశమయ్యారు. వివాదాలను పెంచుకోకుండా, మిత్రత్వాన్ని పెంపొందించుకుంటూ, పరస్పరం సహకరించుకున్నామని అల్బనేస్ పేర్కొన్నారు. కాగా, ఆస్ట్రేలియాకు చెందిన వ్యాపార ప్రముఖులతో కూడిన బృందం అల్బనేస్ వెంట చైనా పర్యటకు వెళ్లింది. ఈ పర్యటనలో వ్యాపారాంశాలకే ప్రాధాన్యం లభించింది. ప్రకృతి వనరులు, హరిత రంగాలు, మౌలిక సదుపాయాలు వంటి పలు రంగాలపై ఆస్ట్రేలియా, చైనా దేశాల మధ్య చర్చలు జరిగాయి. కాగా, చెంగ్‌దూ లోని పండా సంరక్షణ కేంద్రం సందర్శించి, ఫూని అనే పేరుగల నలుపు పండాను అల్బనేస్ చూసారు. ఈ సందర్శనను పండా డిప్లమసీగా, మృదువైన ప్రచార గమనంగా అభివర్ణించారు. చైనాకు గౌరవ సూచనగా గ్రేట్ వాల్ సందర్శించారు.

## లింగవివక్షకు తెర (మొదటి పేజీ తరువాయి)

వివరించారు. 5ఏళ్ల కాలంలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఈ రాష్ట్రంలోని మహిళల చేతిలో తిరిగితే ఆర్థిక స్వాతంత్రం, లింగ సమానత్వం సాధ్యమవుతుందని చెప్పారు. మూలం నుంచి సమస్యను పరిష్కరించాలని నిర్ణయించి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యార్థినిలు బాగా చదువుకొని ఉద్యోగాలు సాధించాలి, సాధించలేని వారు ప్రభుత్వం అందించే వడ్డీ లేని రుణాలతో వ్యాపారాలకు నాంది పలకాలని డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్రంలోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాల ద్వారా 650 బస్సులు కొనుగోలు చేయించి ఆ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇప్పించి ఆదాయం వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అమ్మ క్యాంటీన్లు, గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ ఇల్లు అన్నీ మహిళల పేరుటే మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. మహిళలు ఆర్థికంగా పరిపుష్టిగా ఉంటే రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టిగా ఉంటుందని అన్నారు. స్వాతంత్రం అనంతరం రాజ్యాంగం ద్వారా మహిళలు, కులం, మతం అనే తేడా లేకుండా అందరికీ హక్కులు దక్కాయి అని డిప్యూటీ సీఎం వివరించారు రాజ్యాంగాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని తెలిపారు.

### నిజాం కళాశాల గొప్పది..
### పూర్వ విద్యార్థిగా గర్వపడుతున్నాను: డిప్యూటీ సిఎం

1880లో ప్రారంభించిన నిజాం కళాశాల చాలా గొప్పదని, ఈ రాష్ట్రం, దేశానికి మాత్రమే కాకుండా ప్రపంచానికి గొప్ప సైంటిస్టులను, రాజకీయ నాయకులను, పరిపాలికలను అందించిందని వివరించారు.2010–14 మధ్య ఉమ్మడి రాష్ట్రంలో సిఎం గా వ్యవహరించిన కిరణ్ కుమార్ రెడ్డి, స్పీకర్‌గా వ్యవహరించిన నాదెండ్ల మనోహర్, డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగిన తాను అంతా నిజాం కళాశాల విద్యార్థులు కావడం మరువలేని జ్ఞాపకం అని అన్నారు. 1980 కాలంలో గ్రామీణ ప్రాంతం నుంచి తక్కువ మంది విద్యార్థులు నిజాం కళాశాలకు వచ్చేవారని, తాను రూమ్ నెంబర్ 36 లో ఉండి చదువుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 1982 –84 మధ్యకాలంలో నిజాం కళాశాలలో చదివిన నా సహచరులు గొప్పగా చదువుకొని అమెరికాలో సైంటిస్టులుగా స్థిరపడ్డారని వారంతా నిత్యం కలుస్తుంటారని తెలిపారు.నిజాం కళాశాలలో ఉన్న సమస్యలను సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని, పూర్వ విద్యార్థిగా ఒక రోజు నిజాం కళాశాలలో గడపాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు.

## భారీ వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఆదివారం మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట,హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపే ట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

### హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లోని వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. దీంతో ఏకధాటిగా వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, ప్రగతినగర్, కాప్రా, ఈసీఐఎల్, సైనిక్‌పురి, చందానగర్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, తిరుమలగిరి, బొల్లారం, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, చిలకలగూడ, బేగంపేట, ఆల్వాల్, తార్నాక, ఓయూ క్యాంపస్, లాలాపేట్, హబ్సిగూడ, ప్యాట్నీ, నాచారం, మల్లాపూర్, నాగారం ప్రాంతాల్లో వర్షం పడింది. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వర్షం పడటంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల నుంచి వచ్చే ఉద్యోగులు అసౌకర్యానికి గురయ్యారు. పలుచోట్ల వర్షం ఎక్కువ మోతాదులో పడడంతో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలవడంతో పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. రెజిమెంటల్ బజార్‌లోని మనోహర్ థియేటర్ సమీపంలో రహదారిపై మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## మార్గాలు మంజూరు చేయండి
(మొదటి పేజీ తరువాయి)

కోసం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నూతన రైలు మార్గాలు మంజూరు చేయాలని కోరారు. ఇందులో భాగంగా రూ.2,677 కోట్ల అంచనా వ్యయంతో 122 కి.మీల వికారాబాద్–కృష్ణా మార్గం, రూ.2 వేల కోట్ల అంచనా వ్యయంతో 100 కి.మీల కల్వకుర్తి–మాచర్ల మార్గం, రూ.6,512 కోట్ల అంచనా వ్యయంతో 296 కి.మీల డోర్నకల్–గద్వాల మార్గం, రూ.2,184 కోట్ల అంచనా వ్యయంతో 97 కి.మీల డోర్నకల్–మిర్యాలగూడ మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. కేంద్ర ఐటి, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి రైల్ భవన్‌లో గురువారం భేటీ అయ్యారు. హైదరాబాద్ డ్రైపోర్ట్ నుంచి బందరు ఓడ రేవుకు అనుసంధానంగా రైలు మార్గం మంజూరు చేయాలని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. ఔషధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తుల ఎగుమతులకు ఈ మార్గం దోహదపడుతుందని సిఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ఆపరేషన్స్‌ను మరింత సమర్థంగా నిర్వహించేందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రయాణికులకు భద్రత, వేగవంతమైన సేవలు అందించేందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రతిపాదించామని, ఇందుకు రైల్వే బోర్డు ఇప్పటికే ఫైనల్ లొకేషన్ సర్వేకు అనుమతి ఇచ్చిందని సిఎం తెలిపారు. రూ.8 వేల కోట్ల విలువైన ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్‌కు త్వరగా అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్‌లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుతో గ్రామీణ పేదరికం తగ్గడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని సిఎం తెలిపారు.

### సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

తెలంగాణలో సెమీకండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర ఐటి శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం, ప్రపంచ స్థాయి పరిశోధన, అభివృద్ధి కేంద్రాల తెలంగాణలో ఉన్నందున ప్రతిపాదిత అడ్వాన్స్డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ (ఎఎస్‌ఐపి) ప్రాజెక్ట్, మైక్రో ఎల్ఇడి డిస్‌ప్లే ఫ్యాబ్ ప్రాజెక్ట్ క్రిస్టల్ మ్యాట్రిక్స్‌కు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు ఇఎంసి 2.0 పథకం కింద తెలంగాణ వినతిని కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు సమీపంలో నూతన ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ఎంపిలు పోరిక బలరామ్ నాయక్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## దాడులు (మొదటి పేజీ తరువాయి)

ప్రాంగణంలో 12 మంది అనధికార ప్రైవేట్ ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు గుర్తించారు. పంపాల్సిన 93 రిజిస్టర్డ్ పత్రాలు సిబ్బంది కస్టడీలో ఉన్నాయి. కెమెరాలు పనిచేయడం లేదనే విషయాన్ని కూడా ఎసిబి అధికారులు గుర్తించారు. జెడ్చర్లలోని సబ్‌రిజిస్ట్రార్ వద్ద తనిఖీ సమయంలో లెక్కల్లో చూపని రూ.30,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయ ప్రాంగణంలో 11 మంది అనధికార ప్రైవేట్ ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు దొరికారు. పంపాల్సిన 20 రిజిస్టర్డ్ పత్రాలు సిబ్బంది అదుపులో దొరికాయి. సదాశివపేటలోని సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం తనిఖీలో లెక్కల్లో లేని రూ. 5,550 నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయ ప్రాంగణంలో 9 మంది అనధికార ప్రైవేట్ ఏజెంట్లు ,డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు గుర్తించారు, పంపాల్సిన 39 రిజిస్టర్డ్ పత్రాలను సిబ్బంది కస్టడీలో కనుగొనబడ్డాయి. ఇక్కడ కూడా సిసికెమెరాలు పనిచేయడం లేదు. అంతేకాకుండా అనేక ప్రభుత్వ రికార్డులను నిర్వహించడంలేదని తేలింది. అనేక ఇతర అవకతవకలు కూడా గమనించబడ్డాయి. అవసరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఎసిబి డిజి తెలిపారు.

## బండికి సిట్ పిలుపు
(మొదటి పేజీ తరువాయి)

గృహానికి రావాలని సూచించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసుల నుంచి తనకు నోటీసులు వచ్చినట్లు తెలిపారు. తనతో పాటు తన కుటుంబం, సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. పడకగదిలో దంపతుల మాటలను కూడా ట్యాప్ చేసి జీవితాలను నాశనం చేశారని మండిపడ్డారు. తనకు తెలిసిన, తన వద్ద ఉన్న సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తానని ఆయన అన్నారు.

## అనుమతి లేనందువల్లే
(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడి కబ్బన్ పార్క్ పోలీస్‌స్టేషన్‌లో సమాచార లేఖను అందజేసింది.'ఈ టోర్నమెంట్‌లో ఆర్‌సిబి విజయం సాధిస్తే ఆర్‌సిబి/ డిఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఎం.చిన్నస్వామి స్టేడియం చుట్టూ విజయోత్సవ పెరేడ్‌లను ప్లాన్‌చేయాలని భావిస్తోంది. దీంతో స్టేడియంలో వేడుకలు ముగుస్తాయి. ఇది వాస్తవానికి ఒక సమాచారం. నివేదిక ప్రకారం అవసరమైన అనుమతి కోసం అభ్యర్థన కాదని సమాచార లేఖలో పేర్కొనడం జరిగింది' అని నివేదిక వివరించింది. అయితే అంచనావేసిన జన సమూహం, పరిమాణం, ఈవెంట్ లాజిస్టిక్స్, జన సమూహం నియంత్రణ చర్యలు వంటి కీలక సమాచారం అందులో లేకపోవడంతో పోలీసులు వారికి అనుమతిని నిరాకరించారు. అయితే ఈ ప్రతిపాదనను చాలా తక్కువ సమయంలో చేశారు. అయితే తగిన ప్రక్రియకు నిరోధించబడింది. కాగా, జూన్ 4న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఏకపక్షంగా ముందుకుసాగింది. ఉదయం 7.01 గంటలకు ప్రారంభమైన అనేక సోషల్ మీడియా పోస్టుల్లో విధానసౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకూ విక్టరీ పరేడ్‌ను ప్రకటించింది. మధ్యాహ్నం 3.14గంటలకు పరేడ్ స్టేడియం వద్ద 5గంటలకు ప్రారంభం అవుతుందని , ఆ తర్వాత స్టేడియం వేడుకలు జరుగుతాయని ప్రకటించింది. మొదటి పోస్ట్‌లో ఆన్‌లైన్‌లో ఉచిత పాస్‌లు లభ్యమవుతాయని ప్రస్తావించింది. అయితే భారీ సంఖ్యలో జనంగుమిగుడటం ప్రారంభమైంది. మొదటి నాలుగు అప్‌డేట్‌లతో ఈ పోస్టులు విస్తృతంగా ప్రజల దృష్టిని ఆకర్షించాయి. వరుసగా 16లక్షలు, 4.26లక్షలు, 7.6లక్షలు, 17లక్షల వీక్షకుల సంఖ్యను సేకరించింది.ఈ జనసమూహం అంచనాకు జూన్ 4న బిఎంఆర్‌సిఎల్ ప్రయాణికు ల సంఖ్య మద్దతు ఇచ్చింది. ఇది రోజువారీ సగటు 6లక్షల మంది ప్రయాణికులతో పోలిస్తే 9.66లక్షల మంది ప్రయాణికులను చూసింది. కాబట్టి జూన్ 4న కాలినడకన ప్రయాణించేవారు,ప్రజారవాణా, ప్రైవేట్ మార్గాలను ఉపయోగించిన వారితో సహా అంచనావేసిన జనసమూహం 3లక్షల మందికి మించి ఉంటుందని ప్రకటన తెలిపింది. లైసెన్సింగ్ అండ్ కంట్రోలింగ్ ఆఫ్ అసెంబ్లీస్ అండ్ ప్రొసీషన్స్ (బెంగళూరు సిటీ) ఆర్డర్ ప్రకారం నిర్ణీత ఫార్మాట్‌లో నిర్వాహకులు అధికారికంగా ఎప్పుడూ అనుమతి కోరలేదని నివేదిక నొక్కిచెప్పింది. బెంగళూరు మధ్యలో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడే కార్యక్రమాలకు కేవలం సమాచారం సమర్పించడం అనుమతితో సమానం కాదని స్పష్టం చేసింది. పాల్గొనేవారి సంఖ్య, అసెంబ్లీ పాయింట్, సమయం, బాధ్యతాయుతమైన నిర్వాహకుల పేర్లు, సంప్రదించే వారి వివరాలు, ట్రాఫిక్ , జనసమూహ నియంత్రణకు సంబంధించిన ప్రణాళికలు వంటి ముఖ్యమైన వివరాలు మాకు పూర్తి లేవని అధికారులు పేర్కొన్నారు. ఈ సమాచారం లేకపోవడం వల్ల పోలీసులు తగిన భద్రతా చర్యలను అంచనా వేయలేకపోయారు లేదా ప్రణాళిక వేయలేకపోయారు. ఇంకా ప్రజలకు సూచనలు చేసేందుకు ఎలాంటి సైనేజ్ లేదా లౌడ్ స్పీకర్లు లేవని, గేట్లలోకి ప్రవేశించే సమయంలో, కూర్చున్న ప్రాంతాలలో రద్దీని నియంత్రించేందుకు శిక్షణ పొందిన సిబ్బంది లేదని, లౌడ్‌స్పీకర్ల వాడకం, పోలీస్ బందోబస్తు కోసం ముందస్తు అభ్యర్థన లేదని, 2019, మే 19నాటి ఎంఎఎస్‌సి ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం నిర్వాహకులు పోలీసుల మోహరింపుకు చెల్లించడంలో కూడా విఫలమయ్యారని కర్ణాటక ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన నివేదికలో తెలియజేసింది. సమన్వయం లేదా ఆమోదాలు లేకపోయినా సెంట్రల్ బెంగళూరులో పెద్ద యెత్తున ఈ ప్రత్యేక కార్యక్రమాలకు హాజరైన ప్రజల కోసం బహుళ చర్యలను అమలుచేసిన పోలీస్ శాఖ జూన్ 4న ఉదయం 10గంటలకు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఒక సమావేశం ఏర్పాటుచేసి, ట్రాఫిక్, శాంతిభద్రతల అమలు ప్రణాళికను ఖరారుచేసింది. ఇందుకోసం నలుగురు డిసిపిలు సహా ఆరుగురు ఏసిపిలు, 23మంది పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, 57మంది పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, 104మంది ఏఎస్ఐలు, 462మంది కానిస్టేబుళ్లు, 654మంది ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని మోహరించినట్లు నివేదిక తెలిపింది.

### 'ఆర్‌సిబి సేవకుల్లా' పోలీస్ అధికారులు : కర్ణాటక ప్రభుత్వ నివేదిక

ఐపిఎస్ అధికారి వికాస్ కుమార్ వికాస్ సస్పెన్షన్‌ను కర్నాటక ప్రభుత్వం హైకోర్టు ముందు సమర్థించుకుంది. పోలీస్‌అధికారితోపాటు ఆయన కొలీగ్స్ ఐపిఎల్ విజయోత్సవాల సన్నాహాలలో 'రాయల్ చాలెంజర్స్ బెంగళూరు'కు సేవకులుగా వ్యవహరించారని, ఫలితంగా తొక్కిసలాటకు దారితీసి 11మంది ప్రాణాలు కోల్పోగా, 33మంది ఇతరులు గాయపడ్డారని హైకోర్టుకు నివేదించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది పిఎస్.రాజగోపాల్ హాజరై వాదనలు వినిపించారు. చివరి ఐపిఎల్ మ్యాచ్ జరగడానికి ముందే ఆర్‌సిబి తమ విజయోత్సవాల గురించి పోలస్ అధికారులకు ఒక ప్రతిపాదనను సమర్పించిందని హైకోర్టుకు తెలిపారు. ఇంత పెద్ద సమావేశానికి అనుమతి కోరే బదులు అధికారులు త మ ఉన్నతాధికారులను సంప్రదించకుండా లేదా అసరమైన అనుమతులను నిర్ధారించకుండానే భద్రతా ఏర్పాట్లు చేయడం ప్రారంభించారని హైకోర్టుకు నివేదించారు.

## ఫాంహౌస్‌కు వెళ్లాలా? (మొదటి పేజీ తరువాయి)

చేయాల్సిన నష్టమంత మాజీ సిఎం కెసిఆర్ చేశారు. 2004 నుంచి 2014 వరకు 700 టీఎంసీలు రాయలసీమకు పోతే... 1200 టిఎంసిలు కెసిఆర్ హయాంలో రాయలసీమకు తరలించారన్నారు. అర్ధరాత్రి సమయంలో మూడుసార్లు కెటిఆర్ లోకేష్‌తో ఎందుకు కలిశారని ప్రశ్నించారు. కెసిఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతోందన్నారు. అధికారం, డబ్బు వైరుధ్యాన్ని తెచ్చిపెడుతుందని, తనకు ఎవరితో శత్రుత్వం లేదని, వైరుధ్యమూ లేదని, కెసిఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

### ఆ రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేశాక కిషన్‌రెడ్డి మాట్లాడాలి

బిజెపి పాలిత రాష్ట్రాలలోనూ ముస్లిలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని, బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేసిన తర్వాతే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడాలని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై తమకు వ్యూహం ఉంది. 50 శాతం రిజర్వేషన్లు వద్దని 2018లో పంచాయతీరాజ్ చట్టంలో అప్పటి సిఎం కెసిఆర్ మార్పులు చేశారు. 2014కు ముందు 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 23 శాతానికి కుదించారు. రిజర్వేషన్ల కుదింపును సవరిస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చాం. దీనిపై అవగాహన లేకుండా చాలా మంది మాట్లాడుతున్నారు. ముస్లిం రిజర్వేషన్లు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచే ఉన్నాయి' అని రేవంత్‌రెడ్డి వివరించారు.

### కెటిఆర్ నాయకత్వాన్ని కవితనే ఒప్పుకోవడంలేదు

'ప్రతిపక్షనేత పదవి ఇవ్వాలని కెసిఆర్‌ను కెటిఆర్ అడుగుతున్నారు. దానికి కెసిఆర్ అంగీకరించడం లేదు. సొంత వివాదాలతోనే ఆ కుటుంబానికి సరిపోతోంది. కెటిఆర్ నాయకత్వాన్ని కవితనే ఒప్పుకోవడంలేదు. కవితకు ఆమె ఇంట్లోనే విలువలేదు. ముందు కెటిఆర్ కుటుంబం ఒక తాటి మీదకు రావాలి. కెటిఆర్ వర్కింగ్ ప్రెసిడెంటో స్లీపింగ్ ప్రెసిడెంటో నాకేం తెలుసు' అని సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సూసైడల్ టెండెన్స్‌తో కొంతమంది బాధపడుతున్నారన్నారు. బాత్రూమ్‌లు కడిగే వారితో చర్చకు తాను వెళ్లలేనని కెటిఆర్‌ను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైకోర్టు పర్యవేక్షణలో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ జరుగుతోంది. ఈ కేసును సిబిఐకి ఇవ్వాలని కొందరు అడుగుతున్నారని, ప్రభాకర్‌రావును రప్పించడంలో కేంద్రం ఏడాదిన్నర ఆలస్యం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తులో ఏమి తప్పులున్నాయో ఎత్తి చూపాలని, రాష్ట్రంలో దర్యాప్తు జరుగుతున్న పలు కేసులను ఈడి తీసుకుందని, ఈ కేసుల విచారణలో పురోగతి ఎందుకు లేదో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలన్నారు. గతంలో డ్రగ్స్ కేసులో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నది తాను కాద ని, ఛాలెంజ్ చేయడం, కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడం కెటిఆర్‌కు అలవాటేనన్నారు. డ్రగ్ టెస్ట్‌కు రమ్మంటే పారిపోయింది ఎవరు అని ప్రశ్నించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పారదర్శకంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ : ఎస్‌టియుటియస్ చీఫ్ పర్వత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఎస్‌టియు టియస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. సదానందం గౌడ్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్‌కు వారు గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లా విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియను సరైన విధంగా, పారదర్శకంగా, ఎటువంటి ఒత్తిళ్లకూ తలొగ్గకుండా నిర్వహించాలని కోరారు. కొన్ని జిల్లాల్లో, ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా సీనియర్ ఉపాధ్యాయుల ఆప్షన్ తీసుకోకుండా, సర్దుబాటు ప్రక్రియ జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. విద్యార్థుల సంఖ్యకు సంబంధించి యూడైస్ కటాఫ్ తేదీని జూలై 15, 2025 గా నిర్ణయించాలని, దీని ప్రకారమే సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఆయిల్ పామ్‌తోనే లాభాలు

### మంత్రి పొన్నం ప్రభాకర్




**ప్రజాపక్షం/కొహెడ:** ఆయిల్ ఫామ్‌తో రైతులకు అధిక లాభాలు అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కొహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో రైతు రామారావు వ్యవసాయ క్షేత్రంలో మెగా ఆయిల్ ఫాం ప్లాంటేషన్ కార్యక్రమాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఆయిల్ ఫాం కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంటతో రైతులకు అధిక లాభాలు ఉంటాయని, కోతుల బెడద, అకాల వర్షాల ఇబ్బందులు ఉండవు అన్నారు. రైతుకు పది ఎకరాలు ఉంటే ఐదు ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు చేయాలని, రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా మంచి ధరతో ఆయిల్ ఫామ్ కొనుగోలు చేస్తామన్నారు. మన దేశంలో ఆయిల్ ఫాం సాగు తక్కువగా ఉండడం వల్ల లక్షల కోట్ల విలువైనవి దిగుమతి చేసుకుంటున్నామన్నారు.హుస్నాబాద్ నియోజక వర్గంలో ఒక్క గుంట భూమి కూడా వృధాగా ఉండకూడదు అన్నారు. హార్టికల్చర్ అధికారుల సహకారంతో ఆయిల్ ఫామ్ సాగు మంచి దిగుబడి వచ్చేలా చూసుకోవాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా ఇక్కడి ప్రాంతాలను నీరు అందిస్తామని,ఆయిల్ ఫాం సాగులో రాష్ట్రానికి ఆదర్శంగా ఉండేలా హుస్నాబాద్‌ను తీసుకోవాలన్నారు.

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ...** ఆగస్టు 15 తేదీలోపు నర్మేటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తుందని, రైతులు ఆయిల్ ఫాం సాగువైపు మొగ్గు చూపాలన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో 12 లక్షల ఎకరాల ఆయిల్ ఫాం సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆయిల్ ఫాం సాగు చేస్తు న్న వారికి మీ తోటకి ఫ్యాక్టరీకి ఎంత దూరం ఉందో కిలోమీటర్ ప్రాతి పదికన కిరాయి కూడా ప్రభుత్వమే ఇస్తుంది అన్నారు. సన్న వడ్లకి 500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. వరి పంటకు రాళ్ళ వర్షం పడగానే పంట మొత్తం దెబ్బ తింటుందని, ఆయిల్ ఫామ్ సాగుతో అలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఒక ఎకరం వరి పొలానికి ఇచ్చే నీటితో 5 ఎకరాల ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయవచ్చని అన్నారు. ఆయిల్ ఫామ్ పంటలతో తెలంగాణ పచ్చబడాలని అన్నారు. ఖమ్మం తరువాత అత్యధిక ఆయిల్ ఫాం సాగు సిద్దిపేట జిల్లాలోనే జరగాలన్నారు. బయట దేశాల నుంచి వచ్చే ఆయిల్ మీద సుంకం తగ్గించడం వల్ల రాష్ట్ర రైతాంగానికి రూ.2వేల ఆదాయం తగ్గిందని, ఈ విషయంపై దక్షిణ భారత మంత్రులను తీసుకొని ప్రధాని మోదీ దగ్గరకు వెళ్తున్నట్లు తెలిపారు. క్వింటాలుకు రూ.25వేలు ఇవ్వాలని దేశానికి సరిపడా ఫామ్ ఆయిల్ ఇస్తామని ప్రధానికి చెబుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, జిల్లా కలెక్టర్ హైమవతి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వ్యవసాయశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### క్లీన్, గ్రీన్ ఎనర్జీ పాలసీపై
# కేంద్ర,రాష్ట్రాల పరస్పర సహకారం అవసరం

### 'ఉర్జా మంథన్-2025' సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్లీన్ ఎనర్జీ భవిష్యత్తును నడిపించడంలో కేంద్రరాష్ట్రాల పరస్పర సహకారం అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి అధ్యక్షతన న్యూఢిల్లీలో గురువారం జరిగిన 'ఉర్జా మంథన్ 2025' సమావేశంలో శ్రీధర్‌బాబు తెలంగాణ రాష్ట్ర క్లీన్, గ్రీన్ ఎనర్జీ పాలసీ2025 కిందతీసుకున్న కీలకమైన చర్యలను వివరించారు.

సమావేశంలో భారతదేశ ఇంధన భద్రత, సహకార విధానాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..బయో ఇంధనాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి), సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సిజిడి) నెట్‌వర్క్‌లపై దృష్టి సారించి.. ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్ నగరమే కాకుండా.. ద్వితీయ శ్రేణి పట్టణాలలో సిజిడి నెట్‌వర్క్‌లను వేగవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా సమానమైన ఇంధన లభ్యతను పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. సిఎన్‌జి స్టేషన్ల సంఖ్యను పెంచాలని, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్‌లో పెట్టుబడులను కూడా పెంచి తద్వారా తెలంగాణలో పట్టణ, సెమీ అర్బన్ పైప్డ్ గ్యాస్ మౌలిక సదుపాయాల విస్తరణకు వీలు కల్పించాలని శ్రీధర్ బాబు కేంద్రాన్ని కోరారు. పెరుగుతున్న పారిశ్రామిక, దేశీయ అవసరాలను తీర్చడానికి తెలంగాణలో సిఎన్‌జి, ఎల్ ఎన్‌జి టెర్మినల్స్‌ను స్థాపించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహనిధుల వినియోగాన్ని మంత్రి ప్రతిపాదించారు.

**తెలంగాణ వ్యవసాయ వ్యర్థాల సామర్థ్యాన్ని పెంచుకోవడం**

తెలంగాణలో గణనీయమైన వ్యవసాయ వ్యర్థాల ఉత్పత్తిని ఉదహరిస్తూ.. రాష్ట్రంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ఉత్పత్తి ఉపయోగించని సామర్థ్యాన్ని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వం వీటిలో పెట్టుబడి పెట్టాలని శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. సిజిబి వ్యర్థాల నుంచి శక్తి సాంకేతికతలు, వ్యవసాయ సంపన్న ప్రాంతాలలో కొత్త సిజిబి యూనిట్లను ఏర్పాటు చేయాలని కోరారు. సాటాట్, నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ వంటి పథకాల కింద.. క్లీన్ ఇంధన సాంకేతిక పరిజ్ఞానాలను పెంపొందించడానికి ఎంఎస్ఎంఇలు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలను అందించాలని మంత్రి వ్యాఖ్యానించారు. తూర్పుపశ్చిమ గ్యాస్ పైప్‌లైన్ వెంబడి తెలంగాణ వ్యూహాత్మక స్థానాన్ని మంత్రి శ్రీధర్ బాబు హైలైట్ చేశారు. తక్కువ ఖర్చుతో గ్యాస్ ఆధారిత ఇంధన పారిశ్రామిక వినియోగాన్ని పెంచడానికి మౌలిక సదుపాయాలను విస్తరించడంలో కేంద్రం నేతృత్వంలోని మరిన్ని పెట్టుబడులను ప్రతిపాదించారు.

ఇంధన రంగంలో దేశంలో కీలక భాగస్వామిగా తెలంగాణ స్థిరమైన, సమగ్ర ఇంధన అభివృద్ధికి జాతీయ నమూనాగా మారడానికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. దేశంలోని 22 రాష్ట్రాల నుంచి మంత్రులు హాజరై తమతమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నా రు. గురువారం సింగూరు ప్రాజెక్ట్ ఎడమ కాలువ ద్వారా అందోల్ నియోజకవర్గంలోని పుల్కల్, చౌటకూర్, అందోల్ మండలాలలో ఖరీఫ్ పంటల సాగు కోసం 100 క్యూసెక్కుల్ల నీటిని గురువారం మంత్రి దామోదర్ రాజనర్సింహ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం ఆశించిన స్థాయిలో వర్షాలు లేకున్నప్పటికి సింగూరు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా నియోజకవర్గంలోని ఆయకట్టు కు సాగు నీరు. అందించడం కోసం ప్రభుత్వం మొదటి విడతలో 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటితో ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలు నింపడంతో పాటు పంటలు సాగు రైతులకు కొరకు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. సింగూరు నుండి ఆయకట్టుకు నీరు విడుదల కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**పుల్కల్‌లోని విద్యాసంస్థలను తనిఖీ చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ:** మండల కేంద్రమైన పుల్కల్‌లోని కెజిబివిపీ పాఠశాల, జూనియర్ కళాశాల మోడల్ పాఠశాలలను మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం ఆకస్మిక తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థల నుండి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా మార్చనున్నట్లు తెలిపారు. ఆయా విద్యాసంస్థలోని సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యాసంస్థలో శానిటేషన్‌పై దృష్టి పెట్టడంతో పాటు సి.ఎస్. ఆర్ నిధులతో ఆయా విద్యాసంస్థల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాఠశాల, కళాశాలల్లో మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ పాండు ఈఈ ఇరిగేషన్ భీమ్ సింగూరు డామ్ డిఈ నాగరాజు ఏఈ మహిపాల్ రెడ్డి, శంకుతల సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# 175 మంది హెచ్‌ఇఒ ల నియామకం హర్షణీయం

### సిఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఉద్యాన అధికారుల సంఘం ధన్యవాదాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యాన శాఖలో పనిచేస్తున్న 175 మంది ఉద్యాన విస్తరణ అధికారులను (హెచ్‌ఇఓ)గత ప్రభుత్వం అకారణంగా తొలగించగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ ప్రాముఖ్యత దృష్ట్యా ఉద్యాన శాఖలో తిరిగి వారిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో అవకాశం కల్పించడం పట్ల తెలంగాణ ఉద్యాన అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యాన శాఖ డైరెక్ట ర్ యాస్మిన్ భాషలకు తెలంగాణ ఉద్యాన అధికారుల సంఘం తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఉద్యాన విస్తరణ అధికాలను తిరిగి నియమించడం వలన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచడానికి అదేవిధంగా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా శాఖ పనితీరు మెరుగుపర్చాడానికి ఎంతో దోహదపడుతుదని తెలిపారు.

రైతులకు క్షేత్ర స్థాయిలో సాంకేతిక సలహాలు అందించడానికి, రైతులు ఆర్థికంగా పురోగతి పొందడనికి, వీరి సేవలు ఉపయోగ పడతాయి. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా శాఖ నూతనోత్సాహంతో ముందుకెళ్లే అవకాశం కలుగుతుందని తెలంగాణ ఉద్యాన అధికారుల సంఘం పేర్కొంది.

# సిపిఐ పోరాటాలతోనే దేశంలో కార్మిక చట్టాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధిః** పేద ల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్య లు కూనమనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డిలు అన్నారు. గురువారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్ భవన్ లో సిపిఐ 4వ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు ముందు పతాకావిష్కరణ సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గౌతమ్ గోవర్ధన్ చేయగా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి అమరు ల స్తూపానికి నివాళులు అర్పించారు. ఈ మహాసభలకు అధ్యక్ష వర్గం గా ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిలో మార్కపురి సూర్య, రేణిగుంట్ల ప్రీతం వ్యవహరించారు. ఈ మహాసభలలో సంతాప తీర్మానం తో పాటు సిపిఐ జిల్లా రాజకీయ రిపోర్టును జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి లు మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాలు కలిగిన పార్టీ అని, పార్టీని కార్యకర్తలు రక్షిస్తే పార్టీ ప్రజాస్వామ్యన్ని రక్షిస్తుందని, సిపిఐలో ఉన్న అనుబంధ సంఘాలు, సిపిఐ కార్యకర్తలు, నాయకులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. భారతదేశంలో కార్మిక చట్టాలు సిపిఐ పోరాటాల ద్వారానే ఏర్పడ్డాయని, ఆ చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని పేర్కొన్నారు.సిపిఐ పార్టీ ఆవిర్భావం నుండి ఇప్పటివరకు తెలంగాణలో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసిందని, ఈ ఉద్యమంలో అనేకమంది సిపిఐ నాయకులు అమరులయ్యారని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తెలంగాణలోని భూములను సిపిఐ పార్టీ ద్వారానే పంచిపెట్టడం జరిగిందని తెలిపారు.ఎర్రజెండా కింద ఉన్న అన్ని పార్టీలు ఏకమై ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సిపిఐ పార్టీ పెద్దపల్లి జిల్లాలో బలోపేతం చేయాలని, దానికి పెద్దపెల్లి జిల్లాలోని సిపిఐ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవైన శంకర్ మాట్లాడుతూ పోరాటాల ద్వారానే తమ హక్కులను సాధించుకోవచ్చు అని, పెద్దపెల్లి జిల్లాలో సిపిఐ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త తమవంతుగా పరిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా మరోసారి తాండ్ర సదానందం



పెద్దపల్లి జిల్లా సిపిఐ కార్యదర్శిగా మూడవ సారి తాండ్ర సదానందం ఎన్నిక కాగా సహాయ కార్యదర్శిగా గోశిక మోహన్ ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ అధినాయకత్వం, జిల్లా కార్యవర్గ సభ్యులు మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతను స్వీకరించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతనంగా ఎన్నికైన తాండ్ర సదానందం శుభాకాంక్షలు తెలియజేశారు.

## సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శిగా మళ్లీ మంద పవన్



సిపిఐ సిద్ధిపేట జిల్లా 4వ మహాసభలు బుధవారం హుస్నాబాద్ పట్టణంలో జరిగాయి. గురువారం సిపి ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు ల సమావేశంలో మహాసభ వివరాలను వెల్లడించారు. అనంతరం సిపిఐ సిద్దిపేట జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శిగా మంద పవన్, సహాయకార్యదర్శిగా గడిపె మల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా జాగీరు సత్యనారాయణ, బట్టు దయానందరెడ్డి, పోతుగంటి వెంకటరెడ్డి, కనకుట్ల శంకర్, కిష్టపురం లక్ష్మ ణ్, అంద అశోక్, జేరిపోతుల జనార్ధన్, కొమ్ము భాస్కర్, పిల్లి రజనితోపాటు 29 మంది కౌన్సిల్ సభ్యులు, 5గురు ప్రత్యేక ఆహ్వానితులతో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

# నిజాయితీగా అసెంబ్లీలో చర్చకు సిద్ధం

### బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభలో తమకు మైక్ కట్ చేయకుండా, నిజాయితీగా అన్ని అంశాలపై చర్చకు బిఆర్ఎస్ సిద్ధమేనని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. చంద్రబాబు కుమారుడు, ఎపి మంత్రి లోకేష్‌తో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అర్ధరాత్రి కలిశారని సిఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అర్ధరాత్రి కలిసే అలవాటు కెటిఆర్‌కు లేదన్నారు. కెటిఆర్‌పైన సిఎం చేసిన ఆరోపణలకు సంబంధించిన ఏమైన రుజువులు ఉంటే చూపించాలని, లేదంటే కెటిఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు సిఎంను డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం జర్నలిస్టులతో ఇష్టగోష్టిగా మాట్లాడారు. ఎవరో దుబాయ్‌లో చనిపోతే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కెటిఆర్‌కు ఏం సంబంధం అని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్, కమాండ్ కంట్రోల్ బిల్డింగ్‌లోనే పాలన చేస్తున్నారని, ఆయన సచివాలయానికి ఎందుకు పోవడం లేదని ప్రశ్నించారు.

## ఆర్డినెన్స్‌ను బిఆర్ఎస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు: కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంచాయతీ రాజ్ చట్టం 2018ను సవారిస్తూ ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసిందని, అసెంబ్లీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పి స్తూ రెండు బిల్లులను ఆమోదించిందని, ఈ రెండు వేర్వేరు అంశాలను ప్రస్తావించకుండా ఆర్డినెన్స్‌ను బిఆర్ఎస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కవిత అన్నారు. పంచాయతీ రాజ్ చట్ట సవరణపై రాష్ట్ర మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని తాను సమర్థిస్తున్నానని, మరో నాలుగు రోజుల తర్వాత బిఆర్ఎస్ నాయకులు కూడా తన దారిలోకి రావాల్సిందేనని అన్నారు. ఆర్డినెన్స్ విషయంలో తా ను న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతనే మద్దతు ప్రకటించానని తెలిపారు. ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై కవిత స్పందిస్తూ బిఆర్ఎస్ నాయకులు స్పందిచక పోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు.

**ఆ నాలుగూ కొత్తవి కావు:** ఢిల్లీలో జరిగిన సమావేశంలో నాలుగు విజయాలను సాధించానని సిఎం రేవంత్ చెప్పుకుంటున్న వాటిలో ఏ ఒక్క అంశం కూడా కొత్తది కాదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కవిత అన్నారు. టెలిమెట్రీ స్టేషన్లు ఇదివరకే ఉన్నాయని, కెఆర్ఎంబి ఎపిలో ఉండాలన్నది విభజన చట్టంలోనే ఉన్నదన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

(కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 19 (1) మరియు తెలంగాణ రాష్ట్ర రూల్ 25 (1) అనుసరించి కలెక్టర్ /అధనపు కలెక్టర్ /రాజస్వ మండలాధి కారి కోదాడ (భూసేకరణ)

**ఫారం- 7 (రూఢీ ప్రకటన)**

జిల్లా కలెక్టర్ సూర్యాపేట ఫైల్ నం. జి/371/2025 తేది: 10.07.2025
రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నం. ఇ/212/2025 కోదాడ తేది: 08.07.2025
గెజిట్ నెంబర్: 34/2025 తేది: 10.07.2025

తెలంగాణ ప్రభుత్వం, సూర్యాపేటజిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు ఉత్తమ్ పద్మావతి లిఫ్ట్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ&సి.ఏడి ఇరిగేషన్ డివిజన్ నెం.4, కోదాడ గారు అనంతగిరి మండలం తిరుఅన్నారం గ్రామములో ఇచ్చిన రిక్విజేషన్లేటర్ నెం. ఇఇ/ఐడి4/కోదాడ/ఏఇఇ(టి)/2024-25/77యం తేదీ: 27.03.2025 ప్రకారం ఈ దిగువ షెడ్యూల్ లో నిర్దిష్ట పరచిన సూర్యాపేట జిల్లా, అనంతగిరి మండలం, తిరుఅన్నారం గ్రామ శివారు లోని సర్వే నెంబర్ 49, 50, 51, 52, 53, 54, 55 & 85 లలో విస్తీర్ణం **య. 4.34 గుంటలు** భూములు ప్రజా ప్రయోజన నిమిత్తము అనగా అనంతగిరి మండలము తిరుఅన్నారం గ్రామము నందు పాలేరు వాగునుండి ఉత్తమ్ పద్మావతి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయుటలో భాగముగా అవసరమైనదని భావించినందున, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 19(1)అనుసరించి భూసేకరణ నిమిత్తము రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణా సవరణ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ (2017)ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 చాప్టర్ (2)లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్ 3-ప్రకారం సెక్షన్ 10-Aఆహారభద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.

కావున సూర్యాపేట జిల్లా, అనంతగిరి మండలం, తిరు అన్నారం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 49, 50, 51, 52,53, 54,55 & 85 లలో విస్తీర్ణం **య. 4.34 గుంటలు** భూమి ఉత్తమ్ పద్మావతి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు అవసరమైనదని ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

గ్రామం: తిరుఅన్నారం మండలం : అనంతగిరి జిల్లా: సూర్యాపేట

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | భూమి స్వభావం | భూమి రకము | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం | పట్టాదారు పేరు / ఆసక్తిగల వ్యక్తుల పేరు / చిరునామా | అనుభవదారు | సరిహద్దులు: తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | | | | 9 |
| 1 | 49 | పట్టా | ఖుష్కి | 0.08 | - | రోడ్డు (0-00.50) పుట్టం రాజు, తండ్రి: కాటంరాజు (0-04) పోసిషు వెంకట [illegible] | 50 | అనంతగిరి | 49 /1 | 49 /3 | |
| 2 | 50 | పట్టా | ఖుష్కి | 0.09 | [illegible] | [illegible] | 52 | 51 | 50 | 50 | |
| 3 | 50 | పట్టా | ఖుష్కి | 0.08 | రోడ్డు | [illegible] | 51 | 49 | 50 | 50 | |
| 4 | 51 | పట్టా | ఖుష్కి | 0.05 | [illegible] | [illegible] | 50 | 50 | 50 | 51 | |
| 5 | 52 | పట్టా | ఖుష్కి | 0.16 | [illegible] | [illegible] | 53 | 50 | 52 | 52 | |
| 6 | 53 | పట్టా | ఖుష్కి | 0-12.50 | [illegible] | [illegible] | 54 | 52 | 53 | 53 | |
| 7 | 54 | పట్టా | ఖుష్కి | 0-19.50 | [illegible] | [illegible] | 55 | 53 | 54 | 54 | |
| 8 | 55 | పట్టా | ఖుష్కి | 2.08 | [illegible] | [illegible] | 55 | 54 | 55 | 55 | |
| 9 | 85 | పట్టా | ఖుష్కి | 0.28 | కొత్త కళింగ రెడ్డి తండ్రి: జాన్ రెడ్డి కొత్త కళింగ రెడ్డి తండ్రి: జాన్ రెడ్డి కొత్త శ్రీనివాస్ రెడ్డి తండ్రి: జాన్‌రెడ్డి కొత్త శ్రీనివాస్ రెడ్డి తండ్రి: జాన్‌రెడ్డి మట్టా రేణుకా భర్త నాగి రెడ్డి | కొత్త కళింగ రెడ్డి తండ్రి: జాన్ రెడ్డి (0-03) కొత్త కళింగ రెడ్డి తండ్రి: జాన్ రెడ్డి (0-10) కొత్త శ్రీనివాస్ రెడ్డి తండ్రి: జాన్ రెడ్డి (0-05) కొత్త శ్రీనివాస్ రెడ్డి తండ్రి: జాన్ రెడ్డి(0-00.50) మట్టా రేణుకా భర్త నాగి రెడ్డి (0-09) | వాగు | 55 /2 | 85 /3 | 85 /1 | |
| మొత్తం : 4.34 | | | | | | | | | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూ సేకరణ పై వచ్చిన అభ్యంతరాలు పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించుట లేదు.

భూ సేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, ప్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూ సేకరణ చేయు భూములు యొక్క నమూనా భూ సేకరణ అధికారి మరియు రాజస్వమండలాధికారి కోదాడ మరియు కలెక్టర్ కార్యాలయం, సూర్యాపేట నందు కార్యాలయపు పనివేళల నందు చూసుకొనవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి కోదాడ | సం/- అదనపు కలెక్టర్ సూర్యాపేట | సం/- జిల్లా కలెక్టర్, సూర్యాపేట

DIPR RO NO.388/LA/PP/Advt/Pub/2025-26

## శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం,
వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా

లేఖ.నెం.యస్.యస్.టి/2025 **టెండరు-కం-బహిరంగ వేలముల ప్రకటన** తేది: 17-07-2025.

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:22.07.2025 మంగళవారము రోజున ఉ.11 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి/నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 23.07.2025 నుండి 22.07.2026 వరకు (1 సం.) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667ను సంప్రదించగలరు.

ఇట్లు,
సిరికొండ నవీన్, కార్యనిర్వహణాధికారి

DIPR R.O.No: 5116-PP/CL/ADVT/1/2025-26 Date: 17-07-2025

## కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్.

Nit No: Tender Notice No. 01/CE/QQSU/DA/2025-26, 16.07/2025, **పని పేరు:** నయాపుల్ నుండి చార్మినార్ వరకు ఆర్కిటెక్చర్ లైటింగ్‌తో కూడిన ఇల్యూమినేషన్ ప్రాజెక్ట్. లాడ్ బజార్, నాలుగు తోరణాలు మరియు ఐకానిక్ ప్లేసెస్ చుట్టూ హైదరాబాద్ స్వచ్ఛ ఐకానిక్ ప్లేసెస్ ప్రాజెక్ట్ కింద. NTPC యొక్క CSR కింద స్వచ్ఛ భారత్ మిషన్ కింద భారత ప్రభుత్వం. **మొత్తం:** రూ. 6.95 కోట్లు; **బిడ్ల ప్రారంభ తేదీ/చివరి తేదీ మరియు బిడ్ల రసీదుల సమయం: 1.** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభసమయం: 28.07.2025 @ మధ్యాహ్నం 3 వరకు, **2.** ధర బిడ్ ప్రశ్నలు: 01.08.2025 @ మధ్యాహ్నం 4 వరకు (QQSUDA1234@ gmail.com), **3.** డౌన్‌లోడ్ ముగింపు తేదీ 18.08.2025 @ మధ్యాహ్నం 3.30 వరకు, **4.** బిడ్ల రసీదుకు చివరి తేదీ మరియు సమయం 18.08.2025 @ మధ్యాహ్నం 4 వరకు, **5.** టెక్నికల్ బిడ్ ఓపెనింగ్: 25.08.2025 @ మధ్యాహ్నం 4.30 వరకు, **6.** ధర బిడ్ ఓపెనింగ్ 05.09.2025 @ మధ్యాహ్నం 4 వరకు; **పేరు మరియు చిరునామా ఆఫీసర్ సెల్ నం.** శ్రీ. జి. గురువీర చీఫ్ ఇంజనీర్, QQSUDA. దారుల్షిఫా, హైదరాబాద్. 9989488572 (మరిన్ని వివరాల కోసం, దయచేసి మొబైల్ నంబర్ 9100910862 ను సంప్రదించండి). మరిన్ని వివరాలను eprocurement@https://eprocurement.telangana.gov.in మరియు https://www.ghmc.gov.in మరియు GHMC లలో చూడవచ్చు.

Sd/- చీఫ్ ఇంజనీర్,
QQSUDA, హైదరాబాద్

DIPR R.O.No: 5127-PP/CL/ADVT/1/2025-26 Date: 17-07-2025

ప్రజాపక్షం
శుక్రవారం, 18 జులై

## చిత్తశుద్ధే జలచర్చలకు దిక్సూచి!

ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన జలవివాదాలపై బుధవారం కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ సమక్షంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇరిగేషన్ మంత్రుల భేటీ విభేదాల పరిష్కారంలో ఒక ముందడుగుగా భావించవచ్చు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల మధ్య గంటన్నర పాటు సాగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఉభయకుశలోపరిగానే ఉన్నాయి. కృష్ణా, గోదావరి జలాల వినియోగ, వివాదాలపై ఇరు రాష్ట్రాల నిపుణల కమిటీని వేసి నెల రోజుల్లో నివేదిక అందించాలనేది కీలక నిర్ణయం. కమిటీ ఇచ్చే భవిష్యత్ చర్చలకు, తదుపరి అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి రోడ్ మ్యాప్‌గా నిలవనుంది. ఉభయ రాష్ట్రాలు ఉపయోగించుకుంటున్న నీటి కచ్చిత గణనకు ప్రాజెక్టుల డిశ్చార్జి పాయింట్ల వద్ద టెలీమెట్రీ పరికరాలు బిగించాలనే నిర్ణయం గత అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే తీసుకున్నప్పటికీ, అమలు పూర్తి స్థాయిలో నోచుకోలేదు. సిఎంల సమావేశంలో వాటిని బిగించేందుకు, శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులపై ఏకాభిప్రాయం కుదిరింది. పునర్విభజన చట్టంలో నిర్దేశించినట్లు కృష్ణా నదీ యాజమాన్య బోర్డును ఏపిలోని అమరావతికి తరలించేందుకు, గోదావరి నదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని హైదరాబాద్‌లోనే నిర్వహించేందుకు అంగీకారించారు. ఈ సమావేశం ఏర్పాటుకు ప్రేరేపించిన అంశాలలో ఒకటైన పోలవరం – బనకచర్ల లింకేజీ ప్రాజెక్టుపై చర్చించేందుకు తెలంగాణ ససేమీరా అన్నప్పటికీ, సిఎంల సమావేశంలో ఎపి చూచాయిగా ప్రస్తావన తీసుకువచ్చినట్లు తెలిసింది. దీనిపై కేంద్రం అనుమతి లభించనందువల్ల చర్చించాల్సిన అవసరం లేదని తెలంగాణ తన వైఖరిని బలంగానే వినిపించింది. అసలు పోలవరం – బనకచర్ల లింకేజీ ప్రాజెక్టుపై తెలంగాణలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో అధికార టిడిపి మినహా దాదాపు అన్ని పక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. ఢిల్లీలో ముఖ్యమంత్రుల సమావేశం జరుగుతున్న రోజే ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మొదటిసారిగా తన వైఖరిని వ్యక్తం చేస్తూ ''మిగులు జలాలు లేకుండా బనకచర్ల నిర్మాణం సరికాదని'' కీలక వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు రోజు కేంద్ర జలశక్తి మంత్రితత్వ శాఖ మాజీ సలహాదారుడు, నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్ మాజీ చైర్మన్ వెదిరె శ్రీరామ్ సైతం గోదావరి నదిలో వరద జాలాలే లేవని, బనకచర్ల వృథా అని కుండబద్ధలు కొట్టారు. అవసరమైతే పోలవరం ప్రాజెక్టు నుంచి తెలంగాణ ప్రయోజనాలకు నీళ్లు మళ్ళించగలిగితే ఇవ్వడానికి అభ్యంతరం లేదనే కొత్త ప్రతిపాదనను సమావేశంలో ఎపి సిఎం చంద్రబాబు చేసినట్లు సమాచారం. నీటిపారుదల అంశాలలో వికటించిన గత ప్రభుత్వ ఇష్టారాజ్యంగా నిర్ణయాలను సరి చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సరైన మార్గంలోనే సాగుతోంది. అందుకు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, డిండి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, ప్రాణహిత–చేవెళ్ళ సృజల స్రవంతికి ఎఐబిపి కింద నిధులు, శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు నీటి తరలింపునకు అడ్డుకట్ట, రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేత వంటి 13 అంశాలు కేంద్ర జలశక్తి మంత్రి ముందుంచడమే ఇందుకు నిదర్శనం. రెండు రాష్ట్రాల జలవివాదాల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం కింద ఏర్పాటైన అపెక్స్ కౌన్సిల్ సమావేశాలు మొదటి సారిగా 2016లో నాటి తెలంగాణ సిఎం చంద్రశేఖర్‌రావు, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు, రెండవసారి 2020లో నాటి తెలంగాణ సిఎం కెసిఆర్, ఎపి సిఎంగా జగన్ మోహన్‌రెడ్డి ఉండగా జరిగాయి. ఇప్పుడు మూడవ అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి తాజాగా ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశం పూర్వగామి కానుంది. ఏదేమైనప్పటికీ ఉభయ రాష్ట్రాల మధ్య జలవాటాలు, వివాదాలు, అనుమతులకు సంబంధించి కాలయాపనకు దారి తీసే న్యాయపోరాటాలకు దిగే ముందు ఉత్తమ అవకాశంగా చర్చలకు దిగడమే సత్పరిణామం. భవిష్యత్తులో ఏర్పాటయ్యే సమావేశాలు నిష్పాక్షికంగా సాగి, సహేతుక, ఆమోదయోగ్య నిర్ణయాలు తీసుకునేందుకు నిజాయితీగా వ్యవహరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉంది. రెండు రాష్ట్రాలూ పంతాలు, పట్టింపులకు పోకుండా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ముఖ్యమంత్రులయ్యాక తొలిసారి గత ఏడాది జూలైలో రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లో సమావేశమై, ఇరు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి రెండు వైపుల సీనియర్ అధికారులతో, మంత్రులతో ప్రత్యేక కమిటీ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ అంశంలో పెద్దగా పురోగతి లేదు. తాజాగా, నీటి అంశాలపై సూచనలకు నిపుణుల కమిటీ వేయాలనే నిర్ణయం జరిగింది. అది సరైన రీతిలో ముందుకు సాగితేనే ప్రయోజనం. లేదంటే, ముఖ్యమంత్రులు మారినప్పుడల్లా 'చర్చల ద్వారానే జలవివాదాలకు పరిష్కారమ'నే ప్రకటనలు ప్రహసనంగా మారిపోతాయి. జల సమస్యలు రెండు రాష్ట్రాలకూ చాలా సున్నితమైన, భావోద్వేగాలతో కూడిన విషయం అయినందున సాంకేతిక నిపుణుల సలహాలు సంప్రదింపులతో రాజకీయ స్థూల ఏకాభిప్రాయసాధన కృషికీ ప్రాధాన్యత ఉంటుంది. ఇవి కేవలం అధికారంలో ఉన్న పార్టీ సమస్యలు కావు. యావన్మంది ప్రజల భవిష్యత్‌కు సంబంధించిన సమస్యలు. ముఖ్యమంత్రులు విశాల దృష్టితో వ్యవహరించాలి.

# బిసి రిజర్వేషన్లే 2028 ఎన్నికల ఎజెండా!



ఎస్.కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బౌలింగ్ చేస్తే బంతి సూటిగా తగిలి స్టంప్స్ కూలిపోతున్నాయి. ఇక బ్యాటింగ్ చేస్తే సిక్సర్ పక్కా. పాలనా సమయం 18 నెలలే కావచ్చు. తెలంగాణ రాజకీయాల్లో ఆయన రిజయాలు విశ్లేషకులు మతిపోతోంది. రేవంత్ రెడ్డి ఏ రోజుకా రోజు ఎజెండా ఫిక్స్ చేస్తున్నారు. 2028 అసెంబ్లీ, 2029 లోక్ సభ ఎన్నికల ఎజెండాను కూడా ఇప్పుడే ఖరారు చేయడంతో బిఆర్ఎస్, బిజెపి మైండ్ బ్లాంక్ అవుతోంది. వచ్చే ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల ప్రధాన ఎజెండా అని సిఎం తేల్చిపారేశారు. ప్రభుత్వ ఆర్డినెన్సు రాష్ట్ర గవర్నర్‌కు చేరింది. ఆయన ఆమోద ముద్రపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఆర్డినెన్సుకు ఆమోదం లభించగానే నోటిఫికేషన్ జారీ అవుతుంది. 'బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వారిని సాంఘిక బహిష్కరణ చెయ్యాలి. రిజర్వేషన్లపై ఎవరైనా కోర్టుకు వెళ్తే వాదించడానికి ఢిల్లీ నుంచి ఉద్దండులైన న్యాయవాదులను రప్పిస్తా. నాకు తోడుగా ఉండండి. రక్షణ కవచంలా ఉండి రిజర్వేషన్లను కాపాడుకోవాలి. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తాపత్రయం పడుతున్నది నేను. యాభై శాతానికి మించి రిజర్వేషన్లు పెంచొద్దని గత కెసిఆర్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం చేసింది. ఈ చట్టం చేసినప్పుడు మంత్రులుగా ఉన్న గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్‌లను కెసిఆర్ మాపై ఉసిగొల్పుతున్నాడు' అని ముఖ్యమంత్రి రేవంత్ ఇటీవల ఒక కార్యక్రమంలో అన్నారు.'రిజర్వేషన్ల కోసం ఇంకా ఏం చేయాలన్నా నేను సిద్ధం. ఏం చేయాలో చెప్పండి. అర్ధరాత్రి కూడా నా మంత్రి వర్గం సమావేశం ఏర్పాటు చేస్తా. రిజర్వేషన్ల విషయంలో నన్ను ప్రశ్నించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదు. నా నిబద్ధతను ప్రశ్నించలేరు' అని కూడా ఆయన చెప్పారు. పదేళ్లు తానే సిఎంగా ఉంటానని ముఖ్యమంత్రి ఇదివరకు కొన్ని సమావేశాల్లో చెబుతుండేవారు. తాజాగా ఆయన వ్యూహం మార్చారు. తిరుమలగిరి సభలో ఆ మాట ఆయన మాట్లాడలేదు. మళ్ళీ అధికారంలోకి రావడమే ప్రధాన ఎజండా కనుక రేవంత్ 'బిసి కార్డు'తో యుద్ధం చేయాలని నిర్ణయించుకున్నట్టు అర్థం చేసుకోవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి రిజర్వేషన్లు అమలయితే తెలంగాణ రాజకీయ ముఖచిత్రమే మారిపోనుంది. ఎస్సి, ఎస్టిలకు పార్లమెంటు, అసెంబ్లీతో పాటూ స్థానిక సంస్థల్లో కూడా రిజర్వేషన్లు ఉన్నాయి. వాటిని ఎవరూ టచ్ చేయలేరు. కానీ బిసిలకు స్థానిక సంస్థల్లోనే తప్ప పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో రిజర్వేషన్లు లేవు. ప్రతి స్థానిక ఎన్నికల ముందు ఆ రిజర్వేషన్లను ప్రభుత్వాలు మార్చడం, చాలామంది కోర్టులకు వెళ్ళడం,రిజర్వేషన్లు ఇవ్వడానికి ఆధారమైన కుల జనాభా లెక్కల గురించి కోర్టులు ప్రశ్నించడం ఒక తంతుగా నడుస్తోంది. దాంతో అది కేవలం ఎన్నికల హామీగానే మిగిలిపోతోంది. గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, మండల పరిషత్ చైర్మన్, జెడ్‌పిటిసి, జిల్లా పరిషత్ చైర్మన్, పట్టణ కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్, నగర కార్పొరేటర్, నగర్ మేయర్ వంటి పదవుల్లో బిసిల రిజర్వేషన్లు కనుక పెరిగితే బిసిల రాజకీయ ప్రాతినిధ్యం బాగా పెరుగుతుంది. ఈ రిజర్వేషన్ వల్ల ఆయా గ్రామాల, పట్టణాల రాజకీయ పరిస్థితులు, అధికార కేంద్రాలు అన్నీ మారిపోతాయి. తెలంగాణ పరిస్థితుల మేరకు అగ్రకులాలకు వెళ్ళే చాలా సీట్లలో బిసిలు అధికారంలోకి వస్తారు. అందుకే బిసి సంఘాలు ఈ రిజర్వేషన్ కోసం చాలా పట్టుదలగా పోరాడుతున్నవి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయిస్తాయి. అయితే ఆ రిజర్వేషన్లు నిర్ణయించేందుకు సరైన ప్రాతిపదిక, కులాలవారీగా జనాభా లెక్కలు గతంలో ప్రభుత్వం దగ్గర లేవు. జనాభా లెక్కలు తీసేటప్పుడు ఎస్సి, ఎస్టి జనాభాను మాత్రమే లెక్కిస్తారు. బిసి, ఒసి జనాభా లెక్కలు తీసుకోరు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణనతో ఆసమస్య తీరిపోయింది. దేశవ్యాప్తంగా రాజకీయ అలజడికి తెలంగాణలో జరిగిన కులగణన కారణం. 2018 నుంచి బిసి రిజర్వేషన్లపై పోరాటం జరుగుతోంది. తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు ఇస్తామని కెసిఆర్ అనేకసార్లు హామీ ఇచ్చారు కానీ, వాస్తవంలో జరిగింది వేరు. బిసి సంక్షేమ సంఘం కోర్టుకు వెళ్ళింది. కోర్టులో ఆ పిటిషన్‌పై కౌంటర్ వేయకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం ఆలస్యం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనకు అనుకూలం కనుక కౌంటర్ వేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు చాలా కీలకం. ఈ అంశంలో కెసిఆర్ ముద్దాయిగా నిలబడవలసి వస్తోంది. 1986లో ఎన్‌టి. రామారావు ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్లు ప్రారంభం అయ్యాయి. అప్పుడు అది 20 శాతంగా ఉండేది. తరువాత కోట్ల విజయ భాస్కర రెడ్డి హయాంలో 34 శాతానికి పెరగ్గా, 2019లో సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా కెసిఆర్ ప్రభుత్వం దాన్ని 23 శాతానికి తగ్గించింది. 2023 ఎన్నికల ముందు బిసి డిక్లరేషన్ పేరుతో కామారెడ్డిలో సభ పెట్టిన కాంగ్రెస్ పార్టీ, బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చింది. అంతకు ముందు అంటే 2018 ఎన్నికల్లో కూడా బిసి కులగణన చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించింది. దేశమంతా వివాదం చాలా కాలంగా నడుస్తోంది.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ఏ కులం వారు ఎందరున్నారో తేల్చాలని కాంగ్రెస్ పార్టీ కొన్ని సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూ వస్తోంది. అవకాశం దొరికిన ప్రతిసారీ రాహుల్ గాంధీ ఈ అంశం గురించి మాట్లాడుతున్నారు. బిజెపి మాత్రం కులగణనకు మొదట్లో అనుకూలంగా లేదు. కోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం బిసిల కులగణన చేపట్టి, జనాభాలో బిసిల శాతం ఎంతో తేల్చింది. స్థానిక సంస్థల పదవుల్లో బిసిల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. ఇది ప్రత్యక్షంగా స్థానిక రాజకీయాల మీద, పరోక్షంగా రాష్ట్ర రాజకీయాల మీద పెద్ద ప్రభావాన్ని చూపవచ్చు. జనాభాలో తమ వాటా ఆధారంగా అన్నింటా ప్రాతినిధ్యం కోసం బిసి సంఘాలు డిమాండ్ చేస్తున్నవి. బిసిలకు స్థానిక సంస్థల్లో 40 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్ ఇవ్వాలన్న సందర్భం వచ్చిన ప్రతిసారీ కోర్టుల్లో వివాదం అవుతోంది. డాటా లేకుండా రిజర్వేషన్లు ఎలా ఇస్తారని కోర్టులు ప్రశ్నిస్తున్న సంగతి తెలిసిందే. 2018లో ఈ అంశంపై ప్రస్తుత బిఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రవణ్ దాసోజు మొదట పిటిషన్ వేశారు. అప్పట్లో జస్టిస్ రామచంద్ర రావు తీర్పు కూడా వచ్చింది. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో చెప్పినట్టు బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని దాసోజు ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు.2014లో కెసిఆర్ అధికారంలోకి రాగానే 'సకల జనుల సర్వే' పేరుతో ఒక సమగ్ర సర్వే నిర్వహించారు. అందులో తెలంగాణ మొత్తం కులాల వారీ జనాభా వచ్చింది. అయితే ఆ సమాచారాన్ని కెసిఆర్ ప్రభుత్వం బయట పెట్టలేదు. ఇక ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తరహాలో రాష్ట్రంలో బిసిల కోసం మరో పోరాటం తప్పదని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ స్పష్టంచేశారు. స్థానిక ఎన్నికల్లో 42% బిసి రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్రంలో భూకంపమే సృష్టిస్తామని హెచ్చరించారు. పార్టీపరంగా రిజర్వేషన్లు అంగీకార యోగ్యం కానేకాదని,42% రిజర్వేషన్లు బిల్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. జనాభాలో బిసిల సంఖ్యను బట్టి చట్టసభల్లో, విద్యా, ఉద్యోగా ల్లో 42% రిజర్వేషన్లను కల్పించాలని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా బిసిలకు 42% రిజర్వేషన్లు కల్పించకపోతే, జరగబోయే పరిణామాల కు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు.42% బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ వైఖరి ఇలాగే కొనసాగితే, బిసిలంతా ఏకమయ్యే సమయం ఆసన్నమైందని బిఆర్ఎస్ ఎంపి రవిచంద్ర వద్దిరాజు అన్నారు. రాజకీయ రిజర్వేషన్ల పేరుతో జిఒ విడుదల చేసి మరోసారి మోసం చేయడానికి కుట్రలు చేస్తుందని మండిపడ్డారు.ఎన్నికల్లో స్వలాభం కోసం రాజకీయపార్టీలు హామీలివ్వడం,ఆ తర్వాత వాటిని అమలుచేయలేక చేతులెత్తేయడం ఇప్పటిది కాదు. తెలంగాణలో కులగణన నివేదిక ప్రకారం బిసిల జనాభా ఎంతన్నది అధికారికంగా తేలిపోయింది.రాష్ట్రంలో బిసిల జనాభా 56.33 శాతం ఉన్నట్లు ఆ నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్రంలో అనేక సామాజికవర్గాలుండగా ఒక్క బిసి సామాజికవర్గం మీద మాత్రమే ఎందుకు కేంద్రీకృతమైందంటే రాజకీయంగా కుంపట్లు రగిలించే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్న కారణంగానే.

స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణకు సామాజికన్యాయపరంగా రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకులు తొలగిపోయిన వి. తాజానివేదికలోని జనాభాశాతం ప్రకారమే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా సర్పంచ్, ఎంపిటిసి, జెడిపిటిసి, మున్సిపల్ వార్డులు, కార్పొరేటర్ డివిజన్లు, చైర్మన్లు, మేయర్ పోస్టులకు రిజర్వేషన్ నిర్ణయిస్తుంది.కులగణన సర్వే, డెడికేటెడ్ కమిషన్ కసరత్తు ప్రక్రియతో పోల్చుకుంటే ఎన్నికలకమీషన్ రిజర్వేషన్లు ఫైనల్ చేయటం కష్టమేమీకాదు. గ్రామపంచాయితీలు, మండలాలు, మున్సిపాలిటీల వారీగా జనాభా ఆధారంగా రిజర్వేషన్లను ఫైనల్ అయిపోతాయి. అవసరమైతే డోర్ టు డోర్ లక్కీ డిప్ కూడా తీసే అవకాశముంది. మొత్తం రిజర్వేషన్లు మాత్రం 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఉంది. సుప్రీంకోర్టు తీర్పును కాదని రేవంత్ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను ఎలా అమలుచేస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వనిర్ణయాన్ని ఎవరైనా కోర్టులో చాలెంజ్ చేస్తే వెంటనే కోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టేస్తుంది. తాము బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని అనుకున్నా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని ఎదురుదాడులకు ప్రభుత్వం దిగుతుంది. అధికారికంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు సాధ్యం కాదని బిసి సంఘాలు అనుమానిస్తున్నవి. పార్టీపరంగా బిసిలకు రిజర్వేషన్ కల్పించే ప్రత్యామ్నాయ మార్గాన్ని రేవంత్ ముందే ఆలోచించి పెట్టుకున్నారు. ప్రభుత్వపరంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించటం సాధ్యం కానపుడు పార్టీ పరంగా అమలుచేయటమే. స్థానిక సంస్థల్లో రాజ్యాంగ బద్దంగా నిర్ణయించిన రిజర్వేషన్లు పోను ఒసిలు పోటీచేసే సీట్లలో కూడా వీలైనన్ని సీట్లను బిసిలకు కేటాయించి ప్రతిపక్షాలను ఇరుకున పెట్టె వ్యూహాన్ని కూడా రేవంత్ రచించారు.

ఎపిలో 2019–24 మధ్య జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ సీట్లు పోను, ఒసిలకు దక్కిన సీట్లలో కూడా జగన్ చాలావరకు బిసిలకే కేటాయించారు. జగన్ లెక్కల ప్రకారం జిల్లా పరిషత్ చైర్లన్లు, మేయర్ పోస్టుల్లో 70 శాతం బిసిలకే దక్కాయి. అదేసూత్రాన్ని ఇపుడు తెలంగాణలో రేవంత్ ఫాలో అయితే మాత్రమే బిసిలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నట్లవుతుంది. బిసిలలో హీరోగా రేవంత్‌కు క్రేజ్ లభిస్తుంది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలుచేయటం సాధ్యం కాదని, రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని 2010లో సుప్రింకోర్టు తీర్పున్నట్లు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవి చెప్పారు. కెసిఆర్ హయాంలో బిసిల రిజర్వేషన్‌లను 34 నుంచి 23 శాతానికి తగ్గించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.రాజ్యాంగ బద్దంగా ఎస్‌సిలకు 18శాతం, ఎస్‌టిలకు 10 శాతం రిజర్వేషన్లు పోగా మిగిలింది 22 శాతమే అని చిరంజీవి అంటున్నారు. తెలంగాణ అసెంబ్లీ పంపిన తీర్మానాన్ని కేంద్రం పరిశీలించి క్యాబినెట్లో చర్చించి,పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి చర్చకు పెట్టి ఆమోదించవలసి ఉందని బిసి మేధావులు చెబుతున్నారు. బిసిలకు రాజ్యాంగ పరంగా చట్టబద్ధత లభించాల్సిందేనని బిఆర్ఎస్, బిజెపి మాట్లాడుతున్నాయి తప్ప, రాజకీయ విధానాన్ని మాత్రం ఆ పార్టీలు స్పష్టం చేయడం లేదు.ఆ రెండు ప్రతిపక్ష పార్టీల దాగుడుమూతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అస్త్రాలుగా భావించవచ్చు.

> సర్వే నివేదిక ప్రకారం రాష్ట్ర జనాభా 3.7 కోట్లు. సర్వేలో పాల్గొన్న కుటుంబాలు 3.54 కోట్లు బిసిలుగా. గుర్తించిన కుటుంబాలు 1.15 కోట్లు. సర్వేలో పాల్గొన్న కటుంబాలు 1.12 కోట్లు. సర్వే కు 3 లక్షల కుటుంబాల్లోని 16 లక్షలమంది దూరంగా ఉన్నారు.ఇంటికి తాళంవేసిన ఇళ్ళు సుమా రు 1 లక్ష. రిపోర్టు ప్రకారం ఎస్‌సిల జనాభా 61,84,319(17.43శాతం). ఎస్‌టిల జనాభా 37,05,929(10.45శాతం). ముస్లిమేతర బిసిల జనాభా 1.64 కోట్లు(46.25శాతం). ముస్లిం మైనారిటీల్లో బిసిలు 35,76,588(10.08శాతం). ముస్లిం మైనారిటీల్లో ఒసిల జనాభా 8,80,424 (2.48శాతం), ముస్లిం మైనారిటీల్లో టోటల్ అంటే బిసి+ఒసి జనాభా 44,57, 012(12.56శాతం). ఒసిల జనాభా 47,21,115(13.31శాతం), ఒసిల జనాభా జనరల్+ ముస్లింలు కలిసి 56,01,539(15.79శాతం) ఉందని మంత్రి వివరించారు. దీనిప్రకారమే అచ్చంగా బిసిల జనాభా శాతం 46.25 శాతం అని ముస్లిం మైనారిటీల్లోని బిసిలను కూడా కలుపుకుంటే బిసిల జనాభా శాతం 56.33 శాతంగా తేలింది.




# గిగ్ వర్కర్లుగా వ్యవసాయ కార్మికులు!



మారుతున్న కాలంలో సంప్రదాయ వ్యవసాయ విధానాలు అటకెక్కుతున్నాయి. సాగు పార్ట్‌టైమ్ వృత్తిగా మారింది. ఎక్కువ మంది వ్యవసాయ కార్మికులు ఖాళీ సమయాల్లో దొరికిన పని చేస్తూ, గిగ్ వర్కర్లుగా మారిపోతున్నారు. వ్యవసాయ రంగంలోనూ ఈ ధోరణి చొరబడడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో లాభదాయకమైన ఉపాధి లేకపోవడంతో, వారు వలస వెళ్లే పట్టణ కేంద్రాల్లో హామీతో కూడిన ఉపాధి లేకుండా, అందుబాటులో ఉన్న పనులు చేస్తున్నారు. దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదనడానికి ఇది ఒక నిదర్శనం. నిజానికి భారతదేశంలో గ్రామీణ జనాభాకు ఉపాధి కల్పించే అతిపెద్ద రంగాలలో వ్యవసాయం ఒకటి. ఉపాధిలో వ్యవసాయ రంగం వాటా క్రమంగా పెరుగుతోంది. 2017–18లో 44.1 శాతం నుండి 2023–24లో 46.1 శాతానికి పెరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశ మొత్తం శ్రామిక శక్తి 48.17 కోట్లు. ఇందులో 72 శాతం మంది గ్రామీణ నేపథ్యం నుండి వచ్చినవారే. సగానికి పైగా అంటే 54.6 శాతం లేదా 26.3 కోట్ల మంది కార్మికులు వ్యవసాయంలో నిమగ్నమై ఉన్నారు. వ్యవసాయ శ్రామిక శక్తిలో ప్రధానంగా సాగుదారులు, వ్యవసాయ కార్మికులు ఉంటారు. ఈ సమూహాల మధ్య ప్రాథమిక వ్యత్యాసం భూమి యాజమాన్య ఏర్పాట్లలో ఉంది, ప్రత్యేకంగా 'యాజమాన్య హక్కులు', 'లీజు హక్కు' లేదా 'భూమిపై ఒప్పందం' ఉండటం లేదా లేకపోవడం అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఒక సాగుదారుడికి భూమి ఉంటుంది. కనీసం ఆ భూమిలో పనిచేయడానికి లీజు లేదా ఒప్పందం అతని వద్ద ఉంటుంది. కానీ వ్యవసాయ కార్మికుల పరిస్థితి వేరు. వీరికి సొంతంగా వ్యవసాయ భూమి ఉండదు. కౌలు హక్కులు కూడా ఉండవు. కేవలం వ్యవసాయ క్షేత్రాల్లో పని చేస్తారు. అందుకు ప్రతిఫలం తీసుకుంటారు. నిన్నమొన్నటి వరకూ వ్యవసాయ కార్మికులే ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కానీ, సుమారు దశాబ్దకాలంగా పరిస్థితులు మారుతున్నాయి. సన్నకారు వ్యవసాయదారుడు కూడా కార్మికుడిగా మారిపోతున్నాడు. క్రమంగా వ్యవసాయం పూర్తిగా ధారపడదగిన వృత్తి స్థానం నుంచి కుటుంబ పోషణ కోసం.. అదనపు ఆదాయం కోసం ఇతరత్రా మార్గాలను అన్వేషించాల్సిన దుస్థితికి దిగజారింది. వ్యవసాయ ఉత్పత్తిలో నిమగ్నమైన గ్రామీణ శ్రామిక వర్గంలో వ్యవసాయ కార్మికులు ఒక ముఖ్యమైన విభాగం. కానీ, వారు గ్రామీణ భారతదేశంలో అత్యంత అణగారిన తరగతిగా మారుతున్నారు. అన్ని వనరులను కోల్పోతున్నారు. వారిలో ఎక్కువ మంది భూమిలేనివారు. ఉత్పత్తి సాధనాలు అందుబాటులో లేకపోవడంతో, జీవనోపాధి కోసం వారు శ్రమపై మాత్రమే ఆధారపడాల్సి వస్తుంది. తమ సామాజిక, ఆర్థిక స్థితి కారణంగా, వారు నిరంతరం దోపిడీకి గురవుతునే ఉన్నారు. భూస్వాములు నిర్దేశించిన వేతనాలను అంగీకరించక తప్పని పరిస్థితి. అత్యధిక ప్రాంతాల్లో, వారి ఆదాయం కనీస వేతనాల కంటే చాలా తక్కువ. వీరిలో చాలామందికి ఇళ్ళు లేవు. ఇది వారి అస్థిర పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తుంది. ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు గురయ్యే వాతావరణాన్ని సృష్టిస్తుంది. విస్తృత వివక్షను ఎదుర్కోవడం తప్పడం లేదు. ఇక మహిళా వ్యవసాయ కార్మికుల పరిస్థితి మరింత దారుణం. వారు లింగ వివక్ష, సామాజిక అణచివేతను ఎదుర్కొంటున్నారు. ఒకే రకమైన పనికి పురుషుల కంటే చాలా తక్కువ మొత్తాన్ని అంగీకరించక తప్పడం లేదు. ఇది ఒక రకమైన వ్యూహాత్మక అణచివేత. వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ సంస్థలు కట్టబెట్టే కుటిల యోజన. ఇప్పటికే సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులు గిగ్ వర్కర్లుగా మారిపోయారు. పరిస్థితులు మారకపోతే, వ్యవసాయం బడా వ్యాపారస్తుల చేతుల్లోకి వెళ్లడం ఖాయం.

# ‘దక్షిణ ఆఫ్రికా గాంధీ’ నెల్సన్ మండేలా

దక్షిణ ఆఫ్రికా జాతి వివక్ష వ్యతిరేక పోరాటయోధుడు, న్యాయవాది, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి) నాయకుడు, దాణశీలి, ప్రజాసేవకుడు, ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వంలో తొలి నల్లజాతి దేశాధ్యక్షుడు (1994–99), 27 ఏండ్ల పాటు జైలు జీవితం అనుభవించిన అవిశ్రాంత నల్లజాతి ప్రతినిధి అయిన నెల్సన్ మండేలా పుట్టిన రోజు (18 జులై 1918) సందర్భంగా ఐరాస చొరవతో ప్రతి ఏట 18 జులై రోజున అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం లేదా ఇంటర్నేషనల్ డే ఆఫ్ నెల్సన్ మండేలాను పాటించడం 18 జులై 2010 నుంచి ప్రారంభం అయ్యింది. దక్షిణ ఆఫ్రికాలోని మ్వ్యాజో గ్రామంలోని తెంబూ రాయల్ కుటుంబంలో జన్మించిన మండేలా వం శంలో తొలి విద్యావేత్తగా పోర్ట్‌హేర్, విట్‌వాటర్స్రాడ్ యూనివర్సిటీల్లో బిఏ, న్యాయ పట్టాలు పొంది ఉన్న త విద్యావేత్తగా పేరు తెచ్చుకొని, లాయర్‌లా పని చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు తన పేరు ముందు నెల్సన్‌ను చేర్చడంతో నెల్సన్ మండేలా అనే పేరు ఖ్యాతిలోకి వచ్చింది. 1943లో వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాలు ప్రారంభించిన మండేలా ఎఎన్‌సి పార్టీలో చేరి శ్వేతజాతి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు. వర్ణ వివక్ష పోరాటంలో చురుకుగా పాల్గొనడంతో అరెస్టు కూడా అయ్యారు. ఇదే క్రమంలో మర్క్సిజం వైపు ఆకర్షితులై దక్షిణ ఆఫ్రికా కమ్యూనిస్టు పార్టీలో చేరి రహస్యంగా ఉద్యమాలు చేశారు. శాంతియుతంగా పోరాటం చేస్తూ ఉమ్కోంటో వీ స్వి జ్వే అనే తీవ్రవాద సంస్థను స్థాపించారు. నాటి శ్వేత జాతి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ, 12 జూన్ 1963 రోజున యావజ్జీవ కారాగార శిక్షను విధించడంతో 27 ఏండ్ల పాటు సుదీర్ఘ జైలు జీవితం అనుభవిస్తూ అంతర్జాతీయ మానవాళి దృష్టిని ఆకర్షించారు. జాతీయ, అంతర్జాతీయ ఒత్తిడులకు లొంగిన నాటి ప్రభుత్వం 11 ఫిబ్రవరి 1990న విడుదల చేసింది. జైలులో 466 గదిలో బంధించబడి 63 (1963)లో విడుదల కావడంతో 46663ని మండే లా సంఖ్యగా పిలవబడం జరుగుతోంది. విడుదల అనంతరం నాటి శ్వేతజాతి ప్రభుత్వంతో జరిపిన చర్చల ఫలితంగా 1994లో నిర్వహించిన ఎన్నికల్లో ఎఎన్‌సి పార్టీ నేతృత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో నల్లజాతికి చెందిన తొలి అధ్యక్షుడిగా సేవలు అందించారు. వర్ణ వివక్షను రూపుమాపే కొత్త రాజ్యాంగాన్ని రూపొందించారు. భూసంస్కరణలు, పేదరిక నిర్మూలన, స్వపరిపాలనలకు పట్టం కట్టిన మండేలా నల్లజాతి ఉద్ధారకుడిగా చరిత్రలో నిలిచిపోయారు. 1998–99 మధ్య అలీనోద్యమం సెక్రెటరీ జనరల్‌గా విశిష్ట సేవలు అందించారు. రెండవ దఫా అధ్యక్షుడిగా సేవలు అందించడాన్ని ఇష్టపడకుండా తన పేరున ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి పేదరిక నిర్మూలన, హెచ్ఐవి – ఎయిడ్స్ వ్యతిరేక పోరాటాలు చేశారు.



నేడు అంతర్జాతీయ
నెల్సన్ మండేలా దినోత్సవం

అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం సందర్భంగా పేదరిక నిర్మూలన కేంద్రంగా అన్నదాన కార్యక్రమాలు, వృద్ధుల పట్ల ఆదరణ, యువతకు ప్రేరణాత్మక కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవలు, పరిసరాల పరిశుభ్రత లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. వర్ణ సమానత్వం, స్వేచ్ఛాయుత పౌర సమాజం, సమానావకాశాల కల్పన, సుహృద్భావ వాతావరణం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అందరికీ అందుబాటులో విద్య లాంటి కనీస అంశాలకు అంకితభావంతో సేవలు అందించిన నల్లజాతి వెలుగుల సూరీడు మండేలా నేటి యువతకు నిత్య ప్రేరణగా నిలుస్తూ, భవిష్యత్తుకు దారులు చూపే దారి దీపం అవుతున్నారు. ఏ లాంగ్ వాక్ టు ఫ్రీడం అనబడే పేరుతో ఆత్మకథను రాసిన మండేలాను దక్షిణ ఆఫ్రికా గాంధీగా పిలవడం సముచితంగా వుంది. మండేలా 67 ఏండ్ల జీవితాన్ని ప్రేరణగా తీసుకొని 67 నిమిషాలు ప్రజాహిత సేవలో అందరం గడిపి ఆయనకు అసలైన నివాళి అర్పించాలి. సామాజిక న్యాయమే ఊపిరిగా జీవించిన ప్రజాస్వామ్య జ్యోతి మండేలాను భారత రత్న, నోబెల్ శాంతి బహుమతి, దక్షిణాఫ్రికా జాతి పిత, జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ సయోధ్య పురస్కారం లాంటి 250కి పైగా పురస్కారాలు ఆయన్ని వరించి మురిసి పోయాయి. ప్రతిష్టాత్మక 'మడిబా' అనే బిరుదును పొందిన మండేలా 05 డిసెంబర్ 2013న తుది శ్వాస విడిచారు.

**– బిఎంఆర్, 9949700037**


# సైన్యం నుంచి పొలానికి..





డ్రోన్లను నేడు అనేకానేక విధాలుగా ఉపయోగిస్తున్నారు. యుద్ధ సమయంలో డ్రోన్లతో దాడుల వార్తలను నిత్యం వింటునే ఉన్నాం. ఇజ్రాయెల్–ఇరాన్, రష్యా–ఉక్రేన్ యుద్ధాల్లో డ్రోన్లను ఎక్కువగా ఉపయోగించడం చూస్తున్నాం. యుద్ధాలకే కాదు... వ్యవసాయానికీ ఈ డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో అనేక పనులను రైతులు డ్రోన్ల సాయంతో నిర్వర్తిస్తున్నారు. తేనెటీగ మాదిరిగా శబ్దం చేస్తూ ఎగురుతుంది కాబట్టి డ్రోన్ అని పేరు వచ్చింది. పైలట్ లేకుండా పనిచేసే స్వభావ కారణంగా మానవరహిత బుల్లి విహంగం అంటారు. 4 వందల అడుగుల ఎత్తు, 20 కిలో మీటర్ల పరిధిలో గంటపాటు నిరంతరాయంగా ఎగరగలుగుతుంది. మనుషులు అడుగు పెట్టిన ప్రాంతాలకి సైతం నిమిషాల్లో చేరి ఫోటోలు, దృశ్యామలను చిత్రీకరిస్తుంది. ఆహారం, మందులను జారవిడుస్తుంది. దశాబ్దం నర కాలం క్రితమే ఆధునిక సమాజానికి పరిచయమైన డ్రోన్లని మొదట్లో సైన్యం అవసరాల కోసం వాడేవారు. నెమ్మదినెమ్మదిగా సరికొత్త రూపు సంతరించుకొని, బహుళ సౌక్ ర్యాలతో నిఘా, విభాగం రక్షణ గోడలు దాటుకొని ఇప్పుడు పొలంలోకి అడుగు పెట్టింది. క్రాప్ డస్టింగ్ డ్రోన్లు అనేవి రెండునర దశాబ్దాల క్రితం నుంచే జపాన్లో వాడుకలో ఉన్నాయి. ప్రసుత్తం అమెరికా సహా అనేక దేశాల్లో వాడుతున్నారు. పెద్ద పెద్ద వ్యవసాయపొలాలలో పంట పరిస్థితి చీడపీడల గురించి తెలుసు కోవడానికి ఎక్కువగా రైతులు, వ్యవసాయ పారిశ్రామికవేత్తలు డ్రోన్ల మీదే ఆధారపడుతున్నారు. పెద్ద పెద్ద తోటలు, డెయిరీ ఫారాల్లో అడుగడుగునా నడవలేనిచోట డ్రోనిని వినియోగించి క్షణాల్లో వీడియో తీసీ ఆ దృశ్యాలని కంప్యూటర్లో చూసి పంటల స్థితిగతులు, చీడపీడల ప్రభావం అంచనావేసి తదనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు నిర్ధారించుకుంటున్నారు. అలాగే మట్టి నాణ్యత విశ్లేషణ, వాతావరణం, పంట దిగుబడి అంచనాలకి సైతం డ్రోన్లనే వాడుతున్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వాడకంలో జపాన్, చైనా ముందుండగా ఇటీవల కాలంలో ఇతర దేశాల్లోనూ ఈ సాంకేతిక యాంత్రిక యంత్రాలను విరివిగా వాడడం మొదలుపెట్టారు. వివిధ కంపెనీలు సైతం వ్యవసాయ రంగానికి అనుకులమైన డ్రోన్లని ప్రత్యేకంగా తయారు చేస్తున్నాయి.

**ఎలా పనిచేస్తుంది?** పైలట్ కంట్రోలర్, రెక్కలు, ఛార్జర్, బ్యాటరీలు, కెమెరాలు. నాజిల్స్, మెమొరీ కార్డులు, టాబ్లెట్, క్లౌడ్ ప్రాసెసింగ్ని సమాచారం పంపే సాఫ్ట్వేర్ ఇవీ ప్రాథమికంగా డ్రోన్ పరికరాలు మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్స్, చిన్నపాటి జీపీఎస్ మాడ్యూల్స్, అధిక శక్తి కలిగిన కంప్యూటర్ ప్రాసెసర్లు, చిన్నపాటి డిజిటల రేడియోస్ అన్నవి డ్రోన్లలోని నూతనత్వాలు. మన దేశంలో ఐదు రకాల పరిమానంలో డ్రోన్లు వడడానికి కేంద్రం మార్గదర్శకా లిచ్చింది. ఇవి నానో, మైక్రో, మిని, స్మాల్,లార్జ్, కనిష్ఠంగా 250 గ్రాములు, గరిష్ఠంగా 150 కిలిలో వరకు బరువుంటామి, డ్రోన్లు వినియోగించడానికి దేశంలో అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది 250 గ్రాములకంటే తక్కువ బరువున్న నానో డ్రోన్ల వాడకానికి ఎటువంటి లైసెన్సు అవసరం లేదు అయితే కేంద్ర ప్రభుత్వ డ్రోన్ల వాడకానికి సంబంధించిన నూతన విధానం తీసుకొస్తోంది. పరిమాణాన్ని బట్టి వాటిని వర్గీకరించి, డ్రోన్లకు విశిష్ట గుర్తింపు సంఖ్యలను, రేడియో ఫ్రిక్వెన్సీ ట్యాగ్లనూ తప్పని సరి చేయబోతుంది, ఇకడ్రోన్ పనిచేసే విషయానికి వస్తే పైలట్ కంట్రోలర్, మొబైల్ యాప్, స్మార్టు ఫోను లేదా కంప్యూటర్ ఆదేశాల ద్వారా పనిచేస్తుంది. వైమానికి ఇమేజింగ్ మ్యాపింగ్ ద్వారా నిర్దిష్ట ప్రాంతంలో నడిపించవచ్చు, డ్రోన్ ప్రత్యేకతలు, పని తనం రీత్యా రోజురోజుకి వీటి అవసరం, వినియోగం పెరుగుతోంది.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## గుమ్మడికాయలతో అసెంబ్లీ ఎదుట ప్రతిపక్ష ఎమ్మెల్యేల నిరసన

**ముంబయి :** మహారాష్ట్ర విధాన భవన్ మెట్లపై గురువారం ప్రతిపక్ష పార్టీలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా ప్రభుత్వం నుంచి ప్రజలకు ఏమీ లభించలేదని చెప్పేందుకు విపక్ష పార్టీల ఎమ్మెల్యేలు గుమ్మడికాయలతో విన్నూతంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. 'రైతులకు రుణమాఫీ–గుమ్మడికాయ', 'ప్రజలకు ఆరోగ్య సంరక్షణ– గుమ్మడికాయ', 'గిరిజనులకు హక్కులు – గుమ్మడికాయ', 'విద్యార్థులకు విద్య, కార్మికులకు ఉద్యోగాలు – గుమ్మడికాయ' వంటి నినాదాలు చేశారు. కాగా, శాసనసభ వర్షాకాల సమావేశాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై అధికార కూటమి విఫలమైందని వారు ఆరోపించారు. నిరసనకారుల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీలు సతేజ్ పాటిల్, అభిజీత్ వంజరి, శివసేన ఎమ్మెల్యేలు సిద్ధార్థ్ ఖరత్, వరుణ్ సర్దేశాయ్ ఉన్నారు.

# మొదట ప్రకటనే.. ఆలోచన తరువాత

## ఉపాధిహామీ పథకంలో సమస్యలపై కాంగ్రెస్ మండిపాటు





**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో సమస్యలకు సంబంధించి మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ విరుచుకుపడింది. పథకం అమలులో డిజిటల్ హాజరు, పనుల ధృవీకరణ కోసం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ అప్లికేషన్‌కు సంబంధించిన కార్యాచరణ సమస్యలుపై విమర్శలు చేసింది. ఉపయోగం లేని, ప్రతికూలమైన నమూనా వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ 'ఫాస్ట్' అనేది మోదీ ప్రభుత్వ స్వీయప్రకటిత నినాదమని, వాస్తవానికి అది 'మొదటి ప్రకటన.. రెండవ ఆలోచన' అని ఆయన అభివర్ణించారు. మే 2022లో మోదీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో హాజరు, పనుల డిజిటల్ ధృవీకరణ కోసం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) యాప్‌ను ప్రవేశపెట్టింది. నాటి నుంచి కాంగ్రెస్ ఎన్‌ఎంఎంఎస్ వల్ల కార్యాచరణ సమస్యలు, ఈ యాప్ పథకం స్ఫూర్తిని ఎలా దెబ్బతీస్తుందో అనే విషయాలను ప్రతిసారీ ఎత్తిచూపుతోంది. ఈనెల జారీ చేసిన నోటిఫికేషన్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ చివరకు ఎన్‌ఎంఎంఎస్‌తో ముడిపడి ఉన్న వివిధ సమస్యలను అంగీకరించింది. ఉపాధిహామీ పనులు చేసే ప్రదేశం నుంచి ఫొటోలను అప్‌లోడ్ చేయడం వల్ల కనెక్టివిటీ సమస్యల కారణంగా ఫోటోలను అప్‌లోడ్ చేయలేని నిజమైన కార్మికులకు అన్యాయం జరుగుతోందని మొదటి నుంచి తాము చెబుతున్నామని జైరామ్ రమేష్ పేర్కొన్నారు.కాగా, ఎన్‌ఎంఎంఎస్ మస్టర్ రోల్స్‌లో కనిపించే నకిలీ కార్మికులను ఆపలేకపోయిందని, వారు రోజుకు రెండాసార్లు ఫొటోలు తీయించుకుంటున్నారని, ఒక్క నిమిషం కూడా పని చేయకుండా జీతం పొందుతున్నారని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఉపాధిహామీ పథకం అమలులో కాంగ్రెస్ నిరంతరం అనేక కీలక మార్పులను డిమాండ్ చేస్తోందని, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కోసం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వీటిలో చాలా వాటిని ప్రతిధ్వనిస్తోందని, ఫోటో అప్‌లోడ్‌ల ఆధారంగా పనికిరాని, ప్రతికూలమైన ఎన్‌ఎంఎంఎస్ నమూనాను వెంటనే ఉపసంహరించుకోవడం, నరేగాలో టాస్క్‌ఆధారిత చెల్లింపులను తిరిగి ధృవీకరించడం వంటివి ఉన్నాయని రమేష్ వెల్లడించారు. దశల తరబడి నిలిచిపోయిన వేతనాల సంక్షోభం మధ్య, 2024 లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ న్యాయ్ పాత్రలో ఊహించినట్లుగా నరేగా వేతనాల పెరుగుదల కొత్త ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని ఆయన అన్నారు. వేతనాలు రోజుకు రూ.400కు పెరగాలన్నారు. చట్టబద్ధంగా 15 రోజుల వ్యవధి లోపు వేతనాలు చెల్లించాలని, చెల్లింపులో ఏదైనా జాప్యం జరిగితే పరిహారం చెల్లించాలి అని రమేష్ అన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పార్లమెంటులో ఒక నివేదికను సమర్పించింది. ఈ పథకం కింద పని దినాల సంఖ్యను ప్రస్తుత 100 నుండి 150కు పెంచాలని సిఫార్సు చేసింది. వేతనాలను రోజుకు కనీసం రూ. 400కు పెంచాలని కూడా సూచించింది.

## బిజెపి 'ఎన్నికల చోరీ శాఖ'గా ఇసి

### ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ



**న్యూఢిల్లీ :** బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్ పేరుతో ఓట్లను దొంగిలిస్తూ ఎన్నికల కమిషన్ 'రెడ్ హ్యాండెడ్‌గా' పట్టుబడిందని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పూర్తిగా బిజెపి 'ఎలక్షన్ చోరీ బ్రాంచ్'గా మారిందా అని ప్రశ్నించారు. 22 సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ సవరణ ద్వారా అనర్హుల ఓటర్ల జాబితాను క్లీన్ చేస్తామని, నకిలీ నకిలీ ఓటర్లు చేరకుండా చూస్తామని, చట్టం ప్రకారం ఓటు వేయడానికి అర్హులైన వారిని చేర్చుతామని ఇసి ఇప్పటికే పేర్కొంది. కాగా, బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్‌పై సిరీస్‌ను నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానెల్ అజిత్ అంజుమ్ చేసిన పోస్ట్‌ను గాంధీ పంచుకున్నారు. 'బిహార్‌లో ఎన్నికల కమిషన్ 'ఎస్ఐఆర్' పేరుతో ఓట్లను దొంగిలిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది. పని దొంగతనం మాత్రమే కానీ.. పేరు ఎస్ఐఆర్, దానిని బహిర్గతం చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయబడుతుంది అని రాహుల్‌గాంధీ గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇసి ఇప్పటికీ 'ఎన్నికల కమిషన్'గానే ఉందా లేక బిజెపి 'ఎన్నికల చోరీ శాఖ'గా మారిందా అని రాహుల్ నిలదీశారు. బెగుసరాయ్ జిల్లాలో స్థానిక అధికార యంత్రాంగం ద్వారా అంజుమ్ అనే వ్యక్తి మతపరమైన ఉద్రిక్తతలను వ్యాప్తి చేశాడని ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలను ఆయన త్రోసిపుచ్చారు. ఆతనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను స్క్రీన్‌షాట్ తీసు షేర్ చేశారు. ఓటర్ల సవరణ ప్రక్రియ పౌరసత్వ పత్రాల కొరత కారణంగా కోట్లాది మంది అర్హతగల భారతీయ పౌరులు ఓటు హక్కును కోల్పోతున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## నిమిషకు అన్ని రకాల సాయం అందించేందుకు సిద్ధం : ఎంఇఎ




**న్యూఢిల్లీ :** కేరళ నర్సు నిమిష ప్రియకు చెందిన కేసు చాలా సున్నితమైన అంశం అని, మరణశిక్షను తప్పించేందుకు ప్రభుత్వం వీలైనంత సాయం చేస్తోందని కేంద్ర విదేశాంగ గురువారం పేర్కొన్నది. యెమెన్ దేశస్థుడిని హత్య చేసిన కేసులో ఆ దేశం ఆమెకు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈనెల 16వ తేదీన నిమిష ప్రియను ఉరితీయాల్సి ఉంది. కానీ ఆ నిర్ణయాన్ని యెమెన్ దేశం వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ.. నిమిష ప్రియ కేసు కోసం కొన్ని స్నేహపూర్వక దేశాలతో టచ్‌లో ఉన్నట్లు తెలిపింది. చాలా క్లోజ్‌గా ఆ అంశాన్ని ఫాలో అవుతున్నామని, అన్ని రకాల సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్థాకి అధికారులతో నిత్యం టచ్‌లో ఉన్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. తలాల్ అబ్డో మెహదీని 2017లో హత్య చేసిన భారతీయ నర్సు నిమిష ప్రియకు క్షమాభిక్ష ప్రసాదించాలని లేదా నష్టపరిహారం తీసుకోవాలని(బ్లడ్ మనీ) వస్తున్న ప్రతిపాదనలను తమ కుటుంబం అంగీకరించే ప్రసక్తి లేదని బాధిత సోదరుడు అబ్దెల్ ఫత్తా మెహదీ స్పష్టం చేశారు. షరియా చట్టం ప్రకారం ప్రతీకార న్యాయం(కిసాస్) కావాలన్న తమ డిమాండును ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. చేసిన నేరానికి నిమిషను ఉరితీయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

## 19న ఢిల్లీలో ఇండియా కూటమి భేటీ



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో ఈనెల 19న ఇండియా కూటమి సమావేశం జరుగుతుందని ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ తెలిపారు. ఈ సమావేశంలో తమ పార్టీ కూడా చేరుతుందని శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో లేవనెత్తాల్సిన కీలక అంశాలపై ప్రతిపక్ష నాయకులు చర్చించే అవకాశం ఉంది. ఢిల్లీలో జరిగే ఇండియా కూట మి సమావేశాన్ని పాట్నాలో విలేకరుల సమావేశం లో తేజ్వస్వి యాదవ్ ధృవీకరించారు. అదే విధం గా ముంబయిలో విలేకరుల సమావేశంలో రౌత్ మాట్లాడుతూ 'ఇండియా కూటమి సమావేశం ఢిల్లీ లో జరగనుందని, బుధవారం కెసి వేణుగోపాల్ నుండి తనకు కాల్ వచ్చిందన్నారు. ఉద్ధవ్ థాక్రే కూడా ఇండియా కూటమి సమావేశం అవసరం చెప్పారని, అందుకు తాము ఈనెల 19తేదీని ఎంచుకున్నామన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 21 నుండి ప్రారంభమై ఆగస్టు 21 వరకు ఉభయ సభలు కొనసాగనున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం ఆదివారం జరిగే అవకాశం ఉంది. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సహా అధికార బిజెపి, ప్రతిపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం జరిగే అవకాశముంది. ఈ ఏడాది చివర్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఎన్నికల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు మధ్య తలెత్తే అవకాశం ఉన్న సమస్యలలో ఒకటిగా ఉంది. ఇప్పటికే పహల్గామ్ ఉగ్రవాద దాడి, బిహార్‌లో ఓటర్ల జాబితాల ఎస్ఆఐర్, జమ్ముకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరణ, దేశంలో మహిళలపై పెరుగుతున్న దురాగతాలు వంటి అంశాలను పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో లేవనెత్తాలని కాంగ్రెస్ అగ్ర నాయకత్వం నిర్ణయించింది. రైతుల సమస్యలు, పెరుగుతున్న నిరుద్యోగం, దేశ భద్రత, అహ్మదాబాద్ విమాన ప్రమాదం వంటి అంశాలను వర్షాకాల సమావేశాల్లో లేవనెత్తాలని ప్రతిపక్ష పార్టీ నిర్ణయించింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ మంగళవారం సాయంత్రం తన 10, జనపథ్ నివాసంలో పార్టీ పార్లమెంటరీ వ్యూహాత్మక బృందం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ఉప నాయకుడు ప్రమోద్ తివారీ, జైరామ్ రమేష్, కె సురేష్, మాణికం ఠాగూర్ వంటి అగ్ర పార్టీ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## రాబర్ట్ వాద్రాపై ఇడి చార్జిషీట్



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై శికోపూర్ ల్యాండ్స్ వ్యవహారానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసుకు సంబంధించి ఆయన్ను పలు మార్లు దర్యాప్తు సంస్థ విచారణకు పిలిపించి.. ప్రశ్నించింది. ఇడి తెలిపిన ప్రకారం.. వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గురుగ్రామ్‌లోని శికోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డిఎల్‌ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. ఈ డీల్‌పై మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఇడి విచారణ జరుపుతోంది. ఈ కేసుకు సంబంధించి 2018 సెప్టెంబర్‌లో వాద్రా పేరు ఎఫ్ఐఆర్‌లో నమోదైంది. ఆయనతోపాటు నాటి హర్యానా ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, రియల్ ఎస్టేట్ సంస్థ డిఎల్‌ఎఫ్, ఓ ప్రాపర్టీ డీలర్ పేరును దీనిలో ప్రస్తావించారు. అవినీతి, ఫోర్జరీ చీటింగ్ తదితర నేరాలు నమోదయ్యాయి. మరోవైపు వాద్రా కుటుంబం మాత్రం మొదటి నుంచి ఈ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని కొట్టిపారేస్తూ వచ్చింది. కేసును ధైర్యంగా ఎదుర్కొంటానని ఒక సందర్భంలో రాబర్ట్ వాద్రా స్వయంగా వెల్లడించారు. తాను గాంధీ కుటుంబంలో భాగం కావడం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారన్నారు.

# క్లీన్ సిటీగా 8వసారి ఇండోర్




**న్యూఢిల్లీ :** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరం పరిశుభ్రతలో మరోసారి సత్తా చాటింది. దేశంలోనే అత్యంత పరిశుభ్ర నగరాల జాబితాలో తొలి స్థానం దక్కించుకొంది. 2024–25 సంవత్సరానికి గానూ ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో వరుసగా ఎనిమిదోసారి కైవసం చేసుకుంది. గుజరాత్‌లోని సూరత్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాది ఇండోర్‌తో పాటు సూరత్ కూడా సంయుక్తంగా తొలి ర్యాంక్‌లో నిలిచిన సంగతి తెలిసిందే. మూడో స్థానంలో నవీ ముంబయి నిలిచింది. ఇక, ఈసారి తెలుగు రాష్ట్రాల నుంచి విజయవాడ సత్తా చాటింది. ఈ జాబితాలో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. 3–10 లక్షల జనాభా జాబితాలో నోయిడా నగరం తొలి స్థానంలో ఉంది. చండీగఢ్, మైసూర్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో గృహ, పట్టణ వ్యహారాల మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ మిషన్ కింద 4,500 నగరాలను పరిశీలిస్తారు. పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ, సేవల అందుబాటు వంటి పలు కొలమానాలను పరిగణనలోకి తీసుకుంటారు.

### సికింద్రాబాద్ కంటోన్మెంట్ నంబర్ వన్





క్లీనెస్ట్ కంటోన్మెంట్ బోర్డ్ కింద ఇచ్చిన అవార్డుల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ తొలిస్థానాన్ని సొంతం చేసుకుంది. వ్యర్థాల రహిత నగరం కేటగిరీలో తెలంగాణ రాజధాని హైదరాబాద్ 7స్టార్ రేటింగ్ సాధించింది. గతంలో 5 స్టార్ రేటింగ్ ఉండేది. ప్రామిసింగ్ స్వచ్ఛ షహర్ నగరాల జాబితాలో తెలంగాణ నుంచి హైదరాబాద్ చోటు దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రామిసింగ్ స్వచ్ఛ షహర్‌గా రాజమండ్రి నిలిచింది. కాగా, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఐదు అవార్డులకు ఆంధ్రప్రదేశ్‌లోని 5 నగరాలు ఎంపికయ్యాయి. గ్రేటర్ వైజాగ్ మున్సిపల్ కార్పొరేషన్, విజయవాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లకు అవార్డులు దక్కాయి. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డుల్లో 10లక్షల కంటే ఎక్కువ జనాభా కేటగిరీలో విజయవాడ, 310 లక్షల్లోపు కేటగిరీలో గుంటూరు, 50వేల నుంచి లక్ష లోపు జనాభా కేటగిరీలో తిరుపతి నగరపాలక సంస్థలు అవార్డులకు ఎంపికయ్యా యి. కార్పొరేషన్ల కమిషనర్లతో కలిసి మంత్రి నారాయణ.. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. కేంద్రమంత్రి మనోహర్ లాల్, ఎపి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభితో పాటు ఆయా కార్పొరేషన్ల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్వచ్ఛ అవార్డుల్లో మరోసారి జిహెచ్‌ఎంసి సత్తా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) స్వచ్ఛ ర్యాంకింగ్ అవార్డులలో తన ప్రత్యేకతను మరోసారి చాటుకుంది. స్వచ్ఛసర్వేక్షణ్ 2024 ర్యాంకింగ్స్‌లో 'ప్రామిసింగ్ స్వచ్ఛ షహర్ ఆఫ్ తెలంగాణ'గా రాష్ట్రస్థాయిలో తొలి ర్యాంకింగ్‌తో నిలిచింది. 10 లక్షల జనాభా మించిన నగరాల గార్బేజ్ ఫ్రీ సిటీస్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 44 నగరాల్లో 6వ ర్యాంక్ సాధించింది. గత సంవత్సరం 9వ ర్యాంక్ వచ్చింది. గతంలో ఉన్న 5 స్టార్ రేటింగ్‌ను దాటి ఈసారి 7 స్టార్ రేటింగ్‌కు పెరిగింది. వాటర్ ప్లస్ సిటీ హోదాను వరుసగా నాలుగో సంవత్సరం కూడా నిలబెట్టుకుంది. మొత్తం ఎనిమిది అంశాలకుగాను గ్రేటర్ హైదరాబాద్ ఏడు అంశాల్లో వందశాతం మార్కులు సాధించింది. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్, డంప్‌సైట్‌ల నివారణ, నివాసప్రాంతాల పరిశుభ్రత, మార్కెట్ ప్రాంతాల్లో పరిశుభ్రత, చెరువుల శుభ్రత, పబ్లిక్ టాయ్‌లెట్ల పరిశుభ్రత అంశాలు ఉన్నాయి. ఉత్పత్తిచోటే చెత్త వేరేచేసే ప్రక్రియలో మాత్రమే 93 శాతం మార్కులు వచ్చాయి. మొత్తం 12,500 మార్కులకుగాను జిహెచ్‌ఎంసి 11,805 మార్కులు సాధించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ కూడా కంటోన్మెంట్ బోర్డుల కేటగిరీలో మొదటి ర్యాంక్ సాధించడం విశేషం. గురువారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ చేతుల మీదుగా మునిసిపల్ శాఖ కార్యదర్శి డాక్టర్ కె.ఇలంబర్తి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అవార్డులు, ధృవీకరణ పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్(ఆరోగ్యం పారిశుద్ధ్యం) సిఎన్.రఘుప్రసాద్, ఘనవ్యర్థాల నిర్వహణ విభాగం ఎస్ఇ కోటేశ్వరరావు, ఇఇ శ్రీనివాస్‌రెడ్డి, ఎఎస్‌బిఎం యశశ్రీరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, పారిశుద్ధ్య కార్మికురాలు ఊర్మిళ పాల్గొన్నారు.

## జాన్కంపేట్‌లో 'చిరుత' కలకలం మేకపై దాడి



**ప్రజాపక్షం/ఎడపల్లి :** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారులో చిరుత పులి సంచారం స్థానికంగా కలకలం రేపింది. బుధవారం రాత్రి జాన్కంపేట్ గ్రామ శివారులో వెల్మల హన్మండ్లు అనే రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలోని పశువుల పాకలో చిరుత పులి భీభత్సం సృష్టించింది. పశువల పాకలో ఉన్న మేకలపై దాడికి పాల్పడిన చిరుత, ఒక మేకను నోట కరుచుకొని వెళ్లిపోయింది. గురువారం ఉదయం పశువుల పాక వద్దకు వెళ్లిన యజమాని హన్మండ్లు పరిస్థితిని చూసి ఆందోళన చెందారు. సిసి కెమెరాలను పరిశీలించగా రాత్రి సమయంలో చిరుత పులి పశువుల పాకలోకి ప్రవేశించి మేకను ఎత్తుకెళ్లిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఈ ఘటనపై యజమాని హన్మండ్లు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చిరుత పులి సంచారం నేపథ్యంలో పోచారం, జాన్కంపేట్ గ్రామ రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. ఈ ఘటనతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

## కారు–బైక్ ఢీకొని ఏడుగురు మృతి..ఇద్దరికి గాయాలు

**నాసిక్ :** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో కారు–మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు జంటలు, రెండేళ్ల బాలుడు మృతి చెందగా, ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని పోలీసులు గురువారం తెలిపారు. మృతులు బంధువులు అని, మరో బంధువు పుట్టినరోజు వేడుకలకు హాజరై కారులో సరసాలేకు తిరిగి వస్తుండగా బుధవారం రాత్రి దిండోరి పట్టణం సమీపంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

వాణి–దిండోరి రోడ్డులోని నర్సరీ సమీపంలో జరిగిన ఈ సంఘటన గురించి రాత్రి 11.57 గంటలకు పోలీసులకు సమాచారం అందిందని ఒక అధికారి తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి, రెండు వాహనాలు రోడ్డు పక్కన ఉన్న చిన్న కాలువలో పడిపోయినట్లు అధికారి తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తుల్లో ముగ్గురు పురుషులు, అనేక మంది మహిళలు, ఒక చిన్నారి మరణించగా, మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. నాసిక్ నుండి వాణికి వెళ్తుండగా కారు ముందు టైర్లలో ఒకటి పగిలిపోవడంతో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడిపోయిందని అధికారి తెలిపారు. కారులో ఉన్నవారు వాహనం నుండి బయటకు రాలేకపోవడంతో నీటిలో మునిగి అక్కడికక్కడే మరణించారని ఆయన చెప్పారు. గాయపడిన ఇద్దరు మోటార్ సైకిల్ రైడర్లను నాసిక్‌లోని జిల్లా ఆసుపత్రిలో చేర్చామని, వారి పరిస్థితి మెరుగుపడుతోందని అధికారి తెలిపారు.

మృతులను దేవిదాస్ పండిట్ గంగుర్దే (28), ఆయన భార్య మనీషా దేవిదాస్ గంగుర్దే (23), వారి కుమారుడు భవేష్ దేవిదాస్ గంగుర్దే (2), ఉత్తమ్ ఏక్‌నాథ్ జాదవ్ (42), ఆయన భార్య అల్కా ఉత్తమ్ జాదవ్ (38), దత్తాత్రాయ్ నామ్‌దేవ్ వాగ్మారే (45), ఆయన భార్య అనుసయ దత్తాత్రాయ్ వాగ్మారే (40)గా గుర్తించారు. వీరందరూ దిండోరి తాలూకాలోని వివిధ గ్రామాలకు చెందినవారని పోలీసులు తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు మోటార్ సైకిల్ రైడర్లు నాసిక్‌లోని సత్పూర్‌లోని పింపాల్ గావ్ నివాసితులు అని వారు తెలిపారు. ఈ ప్రమాదంపై దిండోరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భూఆక్రమణ కేసులో కుమారస్వామికి ఊరట

## కంటెంప్ట్‌లో పార్టీగా చేస్తూ జారీచేయబడిన ఉత్తర్వులపై 'సుప్రీం' స్టే



**న్యూఢిల్లీ :** కర్ణాటక గ్రామంలో పెద్దయెత్తున భూఆక్రమణకు పాల్పడినట్లు ఆరోపణ ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి, జెడిఎస్ నాయకుడు హెచ్‌డి.కుమారస్వామిని కోర్టు ధిక్కారణ కేసులో ఒక పార్టీగా చేస్తూ జారీచేయబడిన ఉత్తర్వులపై గురువారం సుప్రీంకోర్టు స్టే విధించింది.

ఏప్రిల్ 17న కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి.క ఉమారస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రశాంత్ భూషణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న 'సమాజ్ పరివర్తన్ సముదయ' అనే ఎన్‌జిఓకు ఒక నోటీస్ జారీచేయడాన్ని అత్యున్నత న్యాయస్థానం న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిథల్, ప్రసన్న బి.వరలేతో కూడిన డివిజన్ బెంచ్ పరిగణనలోనికి తీసుకుంది. బిడదిలోని కేతగహన హళ్లి అనే గ్రామంలో కుమారస్వామి, ఆయన కుటుంబ సభ్యులు పెద్ద యెత్తున భూ ఆక్రమణకు పాల్పడ్డారని ఎన్‌జిఓ ఆరోపించింది. 2020 జనవరి 14న డివిజన్ బెంచ్ జారీచేసిన ఉత్తర్వులను ఉల్లంఘించారనే ఆరోపణలపై హైకోర్టు ముందు ధిక్కార చర్యలు పెండింగ్‌లో ఉన్నాయని అత్యున్నత న్యాయస్థానం గుర్తించింది. '2014 ఆగస్టు 5న కర్నాటక లోకాయుక్త జారీచేసిన ఉత్తర్వులను ప్రభుత్వం మూడడు వారాలలోపు పాటిస్తుందని అడిషనల్ అడ్వకేట్ జనరల్ చేసిన ప్రకటన ఆధారంగా హైకోర్టు రిటిపిటిషన్‌లో పై ఉత్తర్వులను జారీచేసింది' అని డివిజన్ బెంచ్ తెలిపింది. ధర్మాసనం మాట్లాడుతూ లోకాయుక్త ఉత్తర్వు వివరణాత్మకమైన సంభాషణ స్వభావాన్ని కలిగి ఉందని, తర్వాత, లోకాయుక్త చివరికి 2021 మార్చి 3న ప్రొసీడింగ్స్‌ను ముగించిందని పేర్కొంది.

లోకాయుక్త మధ్యంతర ఉత్తర్వులపై అంబుడ్స్‌మన్ కేసు దాఖలు చేసిన తర్వాత కోర్టు ధిక్కార చర్యలు ఉండవని పేర్కొంటూ, కేంద్ర మంత్రి కుమారస్వామి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సిఏ.సుందరం వాదనలను సుప్రీం కోర్టు నమోదుచేసుకుంది. 'రెండవ సమర్పణ ఏమిటంటే సంబంధిత సమయంలో పిటిషనర్ ధిక్కార చర్యలలో పార్టీ కాదు కానీ వారిపై తొలగింపు చర్యలు కూడా తీసుకున్నారు. కాబట్టి ఈ కోర్టు 2025 మే 28 నాటి ఉత్తర్వు, పిటిషనర్ దాఖలు చేసిన ధిక్కార చర్యల నుంచి తాను తొలగించబడ్డానని హైకోర్టు దృష్టికి తీసుకురావడానికి స్వేచ్ఛతో పిటిషనర్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటీషన్(ఎస్.ఎల్.పి)ను కొట్టివేసింది' అని బెంచ్ రికార్డు చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కుమారస్వామి హైకోర్టులో అప్లికేషన్ దాఖలు చేశారని, కానీ ప్రస్తుతం కొనసాగుతున్న కోర్టు ధిక్కారణ కేసులో ఆయన్ను ప్రతివాదిగా చేర్చారని న్యాయవాది సుందరం చెప్పారు. 'అతను ఇంప్లీడ్‌మెంట్ కోసం దాఖలు చేయలేదు కానీ ఈ కోర్టు ఆదేశించిన విధంగా కోర్టు దృష్టికి తీసుకువచ్చాడు. నోటీస్ జారీచేయండి' అని ధర్మాసనం ఆదేశించింది. నాయకుడి విజ్ఞప్తిపై ఏదైనా ప్రతిస్పందన ఉంటే నాలుగు వారాలలోగా దాఖలు చేయాలని బెంచ్ ఆదేశించింది. 'ఈలోగా ఏప్రిల్ 17, 2025నాటి ఇంపంగ్డ్ ఆర్డర్ ప్రభావం, అమలు నిలిపివేయబడుతుంది' అని అత్యున్నత న్యాయస్థానం జోడించింది. అయితే మంత్రి కుమారస్వామి విజ్ఞప్తిపై కర్ణాటక ప్రభుత్వం సహా ఇతర పార్టీలకు ధర్మాసనం నోటీసులు జారీచేయలేదు. కాగా రాష్ట్ర ప్రభుత్వం తర్వాత, ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసింది. ఇది ఆరోపణలకు మద్దతు ఇచ్చే ప్రాథమిక ఆధారాలను కనుగొన్నది. 2025 మార్చి 28న కుమారస్వామి తన పిటిషన్‌ను రద్దు చేయాలని అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సుప్రీంకోర్టు అతడి పిటిషన్‌ను కొట్టివేసి ఈవిషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించింది.

## సూక్ష్మ సేద్యం పరికరాలు పంపిణీ



**ప్రజాపక్షం/దేవరకొండ** : పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ఏర్పాటు చేసిన సూక్ష్మ సేద్యం పరికరాలు (పైపులు, స్ప్రింకర్స్) పంపిణి కార్యక్రమంలో పాల్గొని, మంజూరు అయిన 18 మంది లబ్దిదారులకు 18 సెట్ల సూక్ష్మ సేద్యం పరికరాలు (పైపులు, స్ప్రింకర్స్) లను దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ పంపిణి చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత ప్రజా పాలనలో భాగంగా వ్యవసాయం, విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. రైతులు స్ప్రింకర్లను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లాలో దేవరకొండ నియోజకవర్గానికి 900సెట్లు పంపిణి చేయడం జరిగిందన్నారు.

## నేడు సాగర్‌కు డిప్యూటీ సిఎం భట్టి

### ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం నాగార్జునసాగర్ లో పర్యటించనున్నారు. ఉదయం 8.30 నిమిషాలకు బేగంపేట్ ప్రజా భవన్ నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి 11.30 నిమిషాలకు నాగార్జున సాగర్ చేరుకుని అక్కడ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి కాసేపు ముఖ్య నాయకులను అధికారులతో సమావేశమవుతారు.ఆ తరువాత 11.35నుండి 12.05 నిమిషాల వరకు నాగార్జున సాగర్ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి పరిశీలిస్తారు 12.05 నుండి 1.00 వరకు అక్కడ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి సంబంధించి ఏర్పాటుచేసి నపవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను తిలకించిన తర్వాత స్థానిక విజయ్ విహార్ అతిథి గృహం చేరుకుంటారు. అక్కడ కాసేపు విరామం తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ ప్రజా భవన్ కు బయలుదేరుతారు.



## అగ్నిమాపక కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో అగ్నిమాపక కేంద్ర కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ హనుమంత రావు ప్రారంభించారు. అగ్నిమాపక పోలీసులు అందజేసిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆ తర్వాత అగ్నిమాపక వాహనాలను, పనిముట్లు, పరికరాలు, మిషన్లను పరిశీలించారు. అనంతరం సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఎక్కడ ప్రమాదం జరిగిన విపత్తులు ఎదురైన మొదటగా స్పందించే శాఖ అగ్నిమాపక శాఖ, ఈ అగ్నిమాపక శాఖ ఉన్న పేరును 2009లో రాష్ట్ర విపత్తులు స్పందన, అగ్నిమాపక శాఖగా పేరు మార్చారు. ఇటువంటి ప్రముఖ పుణ్యక్షేత్రంలో ఇలాంటి భవనాన్ని డొనేట్ చేసిన పలు సంస్థలకు అభినందనలు తెలిపారు. తమ సంస్థ సంపాదించిన దాంట్లో విపత్తుల సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే వారికి ఇలాంటి భవనం నిర్మించి ఇవ్వడం సంతోషకరమన్నారు.

## త్వరితగతిన 'డబుల్' నిర్మాణం

### డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి** : 2బిహెచ్‌కె (డబల్ బెడ్ రూమ్) ఇళ్ల పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం భువనగిరి మండలంలోని సింగన్నగూడెంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పురోగతిలో ఉన్న పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పైప్ లైన్లు త్వరగా పూర్తిచేసి ప్రతి ఇంటికి కనెక్షన్లు ఇచ్చి నీటి సరఫరా అయ్యేలా చూడాలన్నారు. కరెంటు స్తంభాలకు కనెక్షన్లు ఇచ్చి ప్రతి ఇంటికి త్వరగా విద్యుత్ వచ్చేలా చూడాలన్నారు. డ్రైనేజీ, తదితర సంబంధించిన పనులను త్వరగా పూర్తిచేసి ఉపయోగంలోకి తేవాలన్నారు. అనంతరం ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేసే విధానాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టీచర్లు చెప్పేది అర్థమవుతుందా అని అడిగి, అర్థం కాకపోతే ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా లౌడ్ రీడ్‌తో బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## పురుగుల మందు డబ్బాతో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఓ బ్యాంక్ ఉద్యోగి తమ భూమిని ఆక్రమిస్తున్నాడంటూ బాధితులు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం పురుగుల మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల గ్రామ శివారులోని సర్వే నెం.158, 153లోని ప్రభుత్వ భూమిలో ఏండ్ల తరబడి తాము కబ్జాలో ఉన్నామని, ఆ భూమిపై గతంలో మాజీ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో తమకు పట్టాలు కూడా వచ్చాయన్నారు. కాగా తమ పక్కన ఉన్న భూమిని కొనుగోలు చేసిన బ్యాంక్ ఉద్యోగి రామకోటి తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ రాత్రివేళల్లో యంత్రాల సాయంతో సరిహద్దులు కబ్జా చేస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అడవిదేవులపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ కబ్జాదారునికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని, తమకు ఎలాంటి సమాచారం లేకుండా సర్వే చేసి రామకోటికి అనుకూలంగా రిపోర్ట్ ఇస్తున్నాడని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్ పూర్తి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఉత్సాహవంతులైన వారినే ఎన్నుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : వచ్చే కార్యవర్గ ఎన్నికల్లో సంఘ అభివృద్ధికి కృషి చేసే ఉత్సాహవంతులైన వారినే ఎన్నుకోవాలని రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా కార్యనిర్వాహక సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ మారిన బైలా ప్రకారం సంఘ ఆశయాలు,లక్ష్యాల సాధనకు కృషి చేయడం ప్రతి ప్రాథమిక సభ్యుని బాధ్యత అని గుర్తు చేశారు. హెల్త్ కార్డుల ద్వారా ఉచిత వైద్య సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.భవన కమిటీ అధ్యక్షులు గాయం నారాయణ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులోసంఘ పటిష్ట నిర్మాణానికి జిల్లాలోని సంఘ భాద్యులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి జె శ్రీశైలం కార్యదర్శి నివేది క కోశాధికారి మోహన్ రెడ్డి లు ఆర్థిక నివేదిక సమర్పించారు . ఈ సమావేశం లో జిల్లా అధ్యక్షులు జి. వెంకట్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు యన్. రంగయ్య,సహా అధ్యక్షులు మోహన్‌రావు,ఉపాధ్యక్షులుఆంజనేయులు,కృష్ణయ్య,కార్యదర్శులు నారాయణ రెడ్డి,హుస్సేన్ పిచ్చి రెడ్డి సంయుక్త కార్యదర్శులు సంతోష్ రెడ్డి,యాదగిరి,వెంకట్ రెడ్డి ప్రచార కార్యదర్శి మందడి శంకర్ రెడ్డి మరియు మండల అధ్యక్షు కార్యదర్శులు సత్యం,వాసుదేవ్ పాల్గొన్నారు.




## ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైతే ఉద్యోగం నుండి తొలగిస్తాం

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరిక

### ఇకపై సంక్షేమ వసతి గృహాలలో ఫేస్ రికగ్నేషన్ యాప్ అమలు



**ప్రజాపక్షం/నల్లగొండ** : ఇక పై జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో ఫేస్ రికగ్నిషన్ యాప్ ను అమలు చేస్తామని, వార్డెన్లు ఫేస్ రికగ్నైషన్ యాప్‌లో రానట్లయితే అలాంటి వారి జీతాన్ని నిలిపివేస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు.ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైతే సంబంధిత ఉద్యోగులను ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించేందుకు వెనకాడబోమని హెచ్చరించారు.గురువారం ఆమె ఉదయాదిత్య భవన్‌లో అన్ని సంక్షేమ శాఖల అధికారులు,ప్రిన్సిపాల్ లు, మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు.హాస్టళ్లలో విద్యార్థులు అనారోగ్యం పాలు కాకుండా వార్డెన్లు వారిని సొంత పిల్లలుగా చూడాలని ,ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో పేద పిల్లలే ఉంటారని, ధనవంతుల పిల్లలైన పేద పిల్లలైనా ఒకటే అనే భావనతో సంక్షేమ వసతి గృహాల అధికారుల పనిచేయాలన్నారు. వార్డెన్లు తప్పనిసరిగా జాబ్ చార్ట్ పాటించాలని ,ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఉదయం నుండి రాత్రి వరకు హాస్టల్ లో ఉండాలని, కార్య స్థానాలలో నివసించాలని, తప్పనిసరిగా మెనూ పాటించాలని, సంబంధిత రీజినల్ కోఆర్డినేటర్లు జిల్లాలో విస్తృతంగా పర్యటించి పాఠశాలలను, కళాశాలలను తనిఖీ చేయాలని ఫేస్ రికగ్నిషన్ యాప్ లో అందుబాటులో లేకుంటే తప్పనిసరిగా వారి జీవితాన్ని నిలిపివేస్తామని హెచ్చరించారు.ఈసమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్‌డిఓలు అశోక్ రెడ్డి, శ్రీదేవి ,రమణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఆయా సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, డీఈవో బిక్షపతి ,ఫుడ్ సేఫ్టీ అధికారి శివ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం

### కోదాడ ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్




**ప్రజాపక్షం/కోదాడ:** వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం ఉదయం కోదాడ పట్టణంలోని 30 పడకల ప్రభుత్వవైద్యశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఓపి రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గైనకాలజిస్టు పద్మావతి లేకపోవడంపై కలెక్టర్ అగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిని పరిశీలనకు వచ్చిన ప్రతిసారి గైనకాలజిస్టు విధులలో కనిపించడంలేదని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ దశరథను నివేదిక సమర్పించాల్సిందిగా కలెక్టర్ అదేశించారు. ఔషదాల స్టాక్ రిజిస్టర్న్‌ను పరిశీలించారు. అన్ని రకాల పెషెంట్లకు మందులు అందుతున్నాయా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రసూతి గదిలో సాధారణ ప్రసవాలు ఎన్ని జరిగాయని డ్యూటీ డాక్టర్ వైష్ణవిని అడిగి తెలుసుకున్నారు. అక్కడ సాధారణ ప్రసవం అయిన రెడ్లకుంట గ్రామానికి చెందిన ముత్యాల శీరిషతో కలెక్టర్ మాట్లాడారు. డాక్టర్లు వైద్యం సరిగా నిర్వహిస్తున్నారా, సకాలంలో మందులు అందజేశారా, పుట్టిన బాబుకు వ్యాక్సినేషన్ చేశారా లేదా అని శీరిషను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుండి కొత్తగా ఏర్పాటు చేసిన సిటిస్కాన్ రూమ్‌ను పరిశీలించారు. కొత్త బ్లాక్ కోసం జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు అదేశించారు. లేఅవుట్‌ను పరిశీలించి వారానికి ఒకసారి జరుగుతున్న పనుల నివేదికను సమర్పించాలని కలెక్టర్ అధికారులకు అదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, రోగులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ వాజీద్‌అలీ, డిసిహెచ్‌ఎస్ ఎస్.వెంకటేశ్వర్లు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రామాణిక పౌష్టికాహారం : ఆర్‌డిఒ

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పాఠశాల విద్యార్థులకు ప్రామాణిక పౌష్టికాహారాన్ని అందించాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. గురువారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలనలో భాగంగా పోచంపల్లి పట్టణంలోని సాయి నగర్ కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించిన ఆయన స్థానిక జిల్లా పరిషత్ బాలికల, బాలుర పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లోని బియ్యం వంట సరుకులు వంటగదిని వండిన ఆహారం కూరలను సాంబారును పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని విద్యార్థుల సంఖ్య కనుగుణంగా వండిన ఆహారాలను పరిశీలించారు. పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆహారం నాణ్యతలో పోషకాహారం విషయంలో బాధ్యతగా ఉండాలని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఉపాధ్యాయులను కోరారు. నిర్వాహకులు వడ్డిస్తున్న భోజనాన్ని స్వయంగా దగ్గరుండి పరిశీలించారు. కాగా అధికారులతో సమావేశాన్ని నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ళను ప్రభుత్వం విధించిన గడువు లోపల పూర్తిచేసి లబ్ధిదారులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకుమున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దారు నాగేశ్వరరావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి ప్రభాకర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆయన వెంట ఉన్నారు.

## పల్లె నర్సింహ్మను సన్మానించిన ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులుగా నియమించిన ప్రముఖ ప్రజా కళాకారుడు, రచయిత పల్లె నర్సింహాను గురువారం దేవరకొండలో ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ శాలువాతో సత్కరించారు. దేవరకొండ మండలం పటమటిపల్లి గ్రామానికి చెందిన పల్లె నర్సింహాను సాంస్కృతిక సలహా మండలి సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం సంతోషకరమని పల్లె నర్సింహాను అభినందించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహాను ప్రభుత్వం గుర్తించడం మంచి పరిణామం అని కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంఎల్ఏ బాలునాయక్ అన్నారు. అనంతరం పల్లె నర్సింహా మాట్లాడుతూ సలహా మండలి సభ్యులుగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వంకు దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్‌కు, సిపిఐ నాయకులు, ప్రజా సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా నాట్యమండలి కళాకారులు రాములు, భారీములు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు సన్మానం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మొదటిసారిగా యాదగిరిగుట్టలో ఫైర్ స్టేషన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా వారిని సిపిఐ జిల్లా నాయకులు మండల నాయకులు కలిసి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ చెక్క వెంకటేష్, జిల్లా సమితి సభ్యులు శ్రీధర్, మండల కార్యదర్శిలు కల్లెపెల్లి మహేందర్, సభ్యులు చిగుర్ల లింగం, అనెపు వెంకట్, గాదగాని మాణిక్యం, అనమైన వెంకటేష్, సలిగంజి వీరస్వామి, దాసరి లక్ష్మయ్య, ఎలగందుల అంజయ్య, బండి శ్రీశైలం, ఏఐవైఎఫ్ నాయకులు సునీల్ కుమార్, ఏఐటియుసి నాయకులు శ్యామల శోభన్ బాబు, ఒగ్గు కరుణాకర్, ఆరే పుష్ప, గోపగాని రాజు, ముక్కెర్ల పెంటయ్య, పాకాలపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## 23న విద్యాసంస్థల బంద్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు జూలై 23న ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు,జూనియర్ కళాశాల విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు ముదిగొండ మురళీకృష్ణ, పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ,పిడిఎస్‌యు,ఏఐఎఫ్‌డిఎస్ తదితర సంఘాల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యారంగ పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో పెనం లోంచి పోయిన పడ్డ చందంగా మారిందని ఎద్దేవా చేశారు. ఒకవైపు ప్రభుత్వ బడులలో సౌకర్యాల లేమి, మరోవైపు ప్రైవేటు విద్యాసంస్థల విచ్చలవిడి ఫీజుల దోపిడీతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి పవన్, ఏఐఎఫ్ డి ఎస్ జిల్లా కార్యదర్శి కాశి,ఏఐఎస్ఎఫ్ నాయకులు సూర్య తేజ, ఎండి సోయల్, లోకేష్, రాజు, ప్రభాస్, మధు, నవ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రతి గల్లీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రతిగల్లీ పరిశుభ్రంగా ఉండేలా మున్సిపాలిటి చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం 40వ వార్డులో 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆ వార్డులోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం, మౌళిక సదుపాయల మెరుగుదలపై అధికారులు సమగ్రంగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. వార్డు స్థాయిలోవచ్చే సూచనల, సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. వర్షకాల నేపథ్యంలో దోమల నియంత్రణ, వ్యర్థాల నివారణ, డ్రైనేజీ ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

**ప్రజాపక్షం/మునగాల:** కెజిబివి విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కలిగి ఉండాలని వ్యక్తిత్వ వికాస నిపుణురాలు యాదాస్వాతి అన్నారు. గురువారం కెజిబివి పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి తమ లక్ష్యంవైపు పయనించేలా బంగారు భవిష్యత్‌ను నిర్మాణం చేసుకునేందుకు మనలోని లోపాలను గుర్తించి మనస్సును జయించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకరావాలని కోరారు. మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు, ఎస్‌వో సునిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా కమిటీలో ముగ్గురికి చోటు




**ప్రజాపక్షం/చిట్యాల**: దేవరకొండ పట్టణంలో ఈనెల15న జరిగిన సిపిఐ 23వ జిల్లా మహాసభలో చిట్యాల మండలానికి చెందిన ముగ్గురికి జిల్లా కమిటీలో చోటు లభించింది. మండలంలోని గుండ్రాంపల్లికి చెందిన గీతా పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు, చిట్యాల పట్టణానికి చెందిన మండల కార్యదర్శి ఎండి అక్బర్‌లను జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కాగా గుండ్రాంపల్లికి చెందిన అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్యను ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్నుకోవడం జరిగినది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిట్యాల మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నేతృత్వంలో బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగ దరఖాస్తులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వ వైద్య కళాశాల, నల్లగొండ యందు డాక్టర్ విభాగంలో బోధన సిబ్బంది(ప్రొఫసర్ (04), అసోసియేట్ ప్రొఫసర్ (14), అసిస్టెంట్ ప్రొఫెసర్ (21) సీనియర్ రెసిడెంట్ (37)ట్యూటర్ (09), జూనియర్ రెసిడెంట్ (28) ,సివిల్ అసిస్టెంట్ సర్జన్ (06) (తాత్కాలికంగా) కాంట్రాక్ పద్ధతిపై మార్చి31,2026 కాల పరిమితి వరకు ఉంటుంది. ఈనెల 23న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు ఉదయం 10.00ల నుండి ప్రిన్సిపాల్ చాంబర్, ప్రభుత్వ వైద్య కళాశాల, సాగర్ రోడ్,ఎస్ఎల్‌బిసి నల్లగొండ కార్యాలయం నందు నిర్వహించబడును. అర్హత ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## తహసీల్దార్ ఆదేశాలు బేఖాతర్?

### గిరిజనుల ఫిర్యాదు బుట్ట దాఖలు?

### కేసు వాపస్ తీసుకోవాలని గిరిజనులపై సిఐ ఒత్తిడి?

**ప్రజాపక్షం/ఆలేరు :** తమ కుటుంబాలకు జరుగుతున్న అన్యాయంపై స్పందించిన ఆలేరు తహసీల్దారు సంబంధిత వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసి నేటికి 10 రోజులు గడుస్తున్నప్పటికీ తహసీల్దార్ ఆదేశాలు పోలీసు అధికారులు బేఖతర్ చేస్తున్నారని ఆలేరు మండలం బహదూర్ పేట గ్రామానికి చెందిన గిరిజన (ఎస్టి) ఎరుకల కుటుంబాలు ఆరోపిస్తున్నారు. గిరిజనులు ఎస్టీ (ఎరుకల) కుటుంబాల సభ్యులు తెలిపిన కథనం ప్రకారం ఆలేరు మున్సిపాలిటీ ఆరో వార్డు బహదూర్ పేట గ్రామంలో ఎస్టీ (ఎరుకల) కుటుంబాల ఇళ్లకు, సుమారు 200మంది రైతులు వారి వారి వ్యవసాయ పంట భూములకు నడిచే గత 100 సంవత్సరాలకు పైగా ఉన్న బహదూర్ పేట నుంచి చిన్నకందుకుర్ గ్రామాన్ని కలిపే లింక్ రోడ్డు ను బహదూర్ పేట గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దారిని గత 15 రోజుల క్రితం పూర్తిగా మూసి అడ్డుకున్నారు. దీంతో గ్రామ రైతులు, గిరిజన కుటుంబాలు జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జరిగిన గ్రీవెన్స్ లో అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు.

బహదూర్ పేట గ్రామానికి చెందిన ఎస్టి (ఎరుకల )గిరిజన మహిళ రాయపురం అనిత గ్రామానికి చెందిన కొంత మంది తమ ఇళ్ళ ముందు సీసీ కెమెరా ఏర్పాటు చేసి మహిళలమైన మమ్మల్ని ప్రతి రోజు రికార్డు చేస్తూ ఆయా వీడియో లు చూస్తూ తమ మనోభావాలు దెబ్బ తీసే విధంగా ప్రవర్తిస్తున్నారని వారిపై పై వెంటనే చర్యలు తీసుకొని.సీసీ కెమెరాలను వెంటనే తొలగించాలని ఈనెల 3న ఆలేరు పోలీస్ స్టేషన్ లో సిఐ కొండలరావుకు ప్రత్యక్ష సాక్షుల సంతకాలతో సహా తాము పిర్యాదు చేసినప్పటికీ అట్టి వ్యక్తిపై ఇప్పటి వరకు ఏలాంటి చర్య తీసుకోలేదని కనీసం సీసీ కెమెరా కూడా తొలగించ పోవడమే కాకుండా తిరిగి ఫిర్యాదును వాపస్ తీసుకోమని సీఐ కొండలరావు తమ కుటుంబ సభ్యులపై ఒత్తిడి చేస్తున్నట్లు గిరిజనులు వాపోయారు.

బహదూర్ పేట గ్రామానికి చెందిన ఎస్టి (ఎరుకల) గిరిజనులు ఈనెల 4 వ తేదీ న తమ ఇళ్లలోకి వెళ్లే దారిని గ్రామానికి చెందిన కొందరు కావాలని ఉద్దేశపూర్వకంగా మూసివేసి దారిని అడ్డుకున్నారని అట్టి వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి మాకు న్యాయం చేయాలని ఆలేరు తహసిల్దార్ ఆంజనేయులకు గిరిజనులైన రాయపురం లక్ష్మి, రాయపురం శోభ, రాయపురం అనిత, రాయపురం లా వణ్య, రాయపురం అనిత లు పిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఆలేరు తహసిల్దార్ అదే రోజు సంబంధిత గిరిజనుల ఫిర్యాదు పై వెంటనే చర్యలు తీసుకోవాలని కార్యాలయ లెటర్ నెంబర్ బి/461/2025 ద్వారా స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ వోను అదే రోజు ఆదేశించారు. అయినప్పటికీ నేటి వరకు బాట ఆక్రమించిన వారిపై ఎలాంటి చర్య తీసుకోలేదని గిరిజనులు ప్రజా పక్షంతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ విషయమై తహసీల్దారు ఆంజనేయులను ప్రజా పక్షం రిపోర్టర్ ఫోన్ లో వివరణ కోరగా ఇప్పటివరకు నాకు ఎలాంటి సమాచారం లేదని సంబంధిత పోలీసు అధికారిని తెలుసుకుని తెలుపుతామన్నారు.

**మూడుసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్య తీసుకోలేదు: రాయపురం శోభ**

మా ఇళ్లలోకి వెళ్లే దారిని కబ్జా చేసి దారిని అడ్డుకున్న విషయమై ఆలేరు సీఐ కొండల్ రావుకు ఇప్పటికి మూడుసార్లు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కింద ఫిర్యాదు చేసిన అట్టి వారిపై ఎలాంటి చర్య తీసుకోలేదు.

**ఫిర్యాదును వాపస్ తీసుకోమంటున్నారు: రాయపురం అనిత**

మా ఇళ్ళ ముందు సీసీ కెమెరా ఏర్పాటు చేసి మమ్మల్ని, మా పిల్లలను సీసీ కెమెరాలో రోజు రికార్డు చేస్తున్న విషయమై ఆలేరు పోలీస్ స్టేషన్లో ఈనెల 3 న ఫిర్యాదు చేశాం. అయినప్పటికీ ఇప్పటివరకు ఏలాంటి చర్య తీసుకోలేదు. పైగా ఫిర్యాదును వాపస్ తీసుకోమని సిఐ మా కుటుంబ సభ్యులపై వత్తిడి తెస్తున్నాడు.

## రూ.900 కోట్ల సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్:**సిద్దిపేట జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ 900 కోట్ల సిఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేసిందని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం నెంటూర్, వర్గల్ తదితర గ్రామాలలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ సిఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటుండగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేగాకుండా రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం అందిస్తుండగా, రోగుల ఆరోగ్య తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అప్పటికప్పుడే ఎల్ఓసిలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, నేతలు గోపాల్ రెడ్డి, పొన్నాల నర్సారెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు




**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ ప్రతినిధి:**మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలనిఎఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడలో హైస్కూల్, ప్రైమరి స్కూళ్లలో ఆయన సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మికుల బిల్లులు చెల్లించకపోవడం దురదృష్టకరమని అన్నారు. గడ్డు బిల్లలు వెంటనే కార్మికుల ఖాతాలో జమ చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం కార్మికులు సునీత పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన నిర్మల్ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సారంగాపూర్ :**సారంగాపూర్ మండలంలో గురువారం పలు అభివృద్ధి పనులను నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.మొదటగా స్వర్ణ ప్రాజెక్ట్ లైటింగ్ ఏర్పాటుకు 32 లక్షల నిధులతోశంకుస్థాపన చేశారు.అనంతరం రామ్ సింగ్ తండా,స్వర్ణ,కౌట్ల బి,మలక్ చించోలి గ్రామాలలో 20 లక్షల నిధులతో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులకి శంకుస్థాపనచేశారు.గ్రామంలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వారమే పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాల్వ నరేష్ సీనియర్ నాయకులు ,ప్రకాష్ జిల్లా కౌన్సిల్ మెంబర్,ప్రధాన కార్యదర్శులు ,ఉపాధ్యక్షుడు భీమలింగం,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణకు వాలీబాల్ టోర్నమెంట్



**ప్రజాపక్షం/కెరమెరి:** యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన పెంచే ఉద్దేశ్యంతో కెరమెరి మండలంలోని హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎఎస్పి చిత్తరంజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంభించాలని అన్నారు. చట్టవిరుద్ధ చర్యల్లో పాల్పడిన వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, డయల్ 100 లేదా 8712670551 నంబర్కు సమాచారం అందించాలని కోరారు. ఈ టోర్నమెంట్లో మండలానికి చెందిన 20 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అవగాహన పోస్టర్లను విడుదల చేసి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సిఐ సత్యనారాయణ, కెరమెరి ఎస్ఐ మధుకర్, ఎంఇఒ ప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చెన్నూరులో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ధ్వంసం



**ప్రజాపక్షం/ చెన్నూరు:**చెన్నూరు పట్టణ శివారులోని సర్వే నెంబర్ 863లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు అక్రమార్కులు మరోసారి ప్రయత్నించారు. ఈ ప్రాంతంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ ప్రతిపాదించిన భూమిలో ప్రస్తుతం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో శ్యాండ్ బజారు పనులు జరుగుతున్నాయి. గురువారం అక్రమార్కులు శ్యాండ్ బజారు పనులను ఆపివేసి, రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ధ్వంసం చేశారు. దాన్ని ప్రభుత్వ భూమిగా గుర్తించిన రెవెన్యూ అధికారులు ఇప్పటికే రెండు సార్లు హెచ్చరిక బోర్డులు పెట్టగా వాటిని తొలగించడం జరిగింది. స్థానికులు, జర్నలిస్టులు మాట్లాడుతూ సుమారు మూడు సార్లు ప్రభుత్వ స్థలంలో ఉన్న హెచ్చరిక బోర్డును తొలగించారు. ఒక్కసారి నామమాత్రంగా కేసు నమోదు చేసి వదిలేశారు. కనీసం హెచ్చరించలేదు. అక్రమార్కులపై ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనపై చెన్నూరు ఎంఆర్ఓ మల్లికార్జున్ను సంప్రదించగా, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మహిళలకు గృహాలక్ష్మీ పథకం వెంటనే అమలు చేయాలి

సిపిఐ పట్టణ కార్యదర్శి అనుసూజ యాదవ్




**ప్రజాపక్షం/ సదాశివపేట :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 18 నెలలు పూర్తి అవుతున్న తరుణంలో ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు పథకాలలో ఒకటైన మహాలక్ష్మి, పథకం నేటికి ఆచరణకు నోచుకోలేదని తక్షణమే అమలు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి అనుసూజ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పుడు ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన అనేక హామీలకు ఆకర్షితులైన మహిళలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అండగా నిలిచారన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బుజ్జమ్మ లడ్డు లక్ష్మి ,శివలీల ,తదితరులు పాల్గొన్నారు.

## రెండు పడకల గదుల ఇండ్లలో అన్ని వసతులు కల్పించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/కాగజ్నగర్:**కాగజ్నగర్ పట్టణంలోని బోరిగాం గ్రామ శివారులో నిర్మించిన రెండు పడకల గదుల ఇండ్లలో అన్ని వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. రెండు పడకల గదుల ఇండ్లలో విద్యుత్, త్రాగు నీరు, పెయింటింగ్, తలుపులు, కిటికీలు, అంతర్గత రహదారులు వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. 12 బ్లాకుల్లో మొత్తం 228 ఇండ్లు నిర్మించడం జరిగిందని, మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. త్వరలో మంత్రుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇండ్లను అందించేందుకు సిద్ధంగా ఉండాలని, నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఇ శేషరావు, హౌసింగ్ పిడి వేణుగోపాల్, తహసీల్దార్ మధుకర్, రోడ్లు భవనాల శాఖ అధికారులు, గుత్తేదారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో సమస్యల పరిష్కారమే లక్ష్యం

కలెక్టర్ అభిలాష అభినవ్ ..





**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :**జిల్లా అభివృద్ధిలో కీలక అంశాలపై శాఖల మధ్య సమన్వయం అవసరమని జిలా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.గురువారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాదకద్రవ్యాల నివారణ,నకిలీ విత్తనల అమ్మకాలు,స్కానింగ్ కేంద్రాల తనిఖీలు,రోడ్డు భద్రత తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని,విత్తన దుకాణాల్లో నిరంతరం తనిఖీలు జరపాలని,రైతులకు నష్టం జరగకుండా తక్షణ స్పందనతో వ్యవహరించాలని సూచించారు.ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా ఇప్పటివరకు 32 బాల కార్మికులు గుర్తించగా,19 కేసులు నమోదయ్యాయని చెప్పారు.చిన్నారులను ప్రభుత్వ వసతిగృహాల్లో చేర్చాలని,యజమానులపై కేసులు నమోదు చేసి వ్యాపార లైసెన్సులు రద్దు చేయాలన్నారు. బాల్యవివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ ఏడాది 12 బాల్యవివాహాలు అడ్డుకున్నామని తెలిపారు.పాఠశాలల్లోని 72,876 విద్యార్థినులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్,బాల్యవివాహాలపై అవగాహన కల్పించామని చెప్పారు.పిసిపిఎన్డిటి చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కేంద్రాలపై చర్యలు తీసుకోవాలన్నారు.ఆర్ఎంపిల చట్ట విరుద్ధ కార్యకలాపాలపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు చేసే వారిపై కేసులు నమోదు చేయాలనీ ఆదేశించారు. ,ఎస్సి,ఎస్టి చట్టం అమలులో ఇప్పటివరకు 51 కేసులు నమోదవగా,39 కేసులకు పరిహారం చెల్లించామని, 12 కేసులు వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.మాదక ద్రవ్యాల రహిత నిర్మల్ జిల్లా లక్ష్యంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇప్పటివరకు 73 కేసులు నమోదు కాగా,145 మంది అరెస్ట య్యారని,525 కేజీల 305 గ్రాముల గంజా సీజ్ చేశామనివెల్లడించారు.స్కూల్ ,కాలేజీల సమీపంలోని 400 మీటర్ల పరిధిలో గుట్కా,సిగరెట్లు విక్రయించడాన్ని నిషేధించనున్నట్లు తెలిపారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని,రోడ్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత శాఖలను కలెక్టర్ ఆదేశించారు.ప్రమాదాలు జరగకుండా నిరోధించేందుకు ఎస్.ఎచ్.ఐ,ఆర్ అండ్ బి శాఖల ద్వారా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.ముఖ్యంగా కడ్తాల,సోన్ గ్రామస్తులు,ఇతర గ్రామాల పరిధిలోని నేషనల్ హైవే రూట్లపై ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అవసరమైతే వేగ నియంత్రణ సూచికలు,హెచ్చరిక బోర్డులు,స్లో డౌన్ జోన్లను ఏర్పాటు చేయాలని,ప్రమాదకర ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రజలు కూడా రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ కోరారు.జిల్లాలోని పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో భిక్షాటన నిర్మూలన, ట్రాఫిక్ సమస్యలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.జిల్లా ఎస్పి జానకి షర్మిల మాట్లాడు తూ, చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు,ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని వెల్లడించా రు.ఈ సమావేశంలో డిఎల్ఎస్ఎ కార్యదర్శి రాధిక,అదనపు కలెక్టర్లు,ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్,అడిషనల్ ఎస్పి ,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధికి జర్నలిస్టుల కృషి అభినందనీయం

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం/బోధన్:**సమాజాభివృద్ధికి జర్నలిస్టుల కృషి ఎంతో అభినందనీయమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్ మండల ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైన సందర్భంగా ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షుడు రవి, ముఖ్య సలహాదారులు బలరామరాజు, అధ్యక్షుడుశ్రీనివాస్, కార్యదర్శి కృష్ణ, కోశాధికారి మహమ్మద్ అహ్మద్లతోపాటు కమిటీ ప్రతినిధులు, సభ్యులు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని గురువారం ఇరిగేషన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ప్రింట్ మీడియా నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర చాలా ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. జర్నలిస్టుల ఐక్యత కోసం యూనియన్లుగా ఏర్పడి సమాజాభివృద్ధికి జర్నలిస్టులు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పటికీ కట్టుబడి ఉందని, తనవంతు కృషిగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లింబారి లక్ష్మణ్, మునగరి రాజేష్, జగన్, శివ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉన్నత శిఖరాల అధిరోహించవచ్చు

విద్య సమాజాభివృద్ధికి మూలస్తంభం:ఎమ్మెల్యే ధన్పాల్



**ప్రజాపక్షం/నిజామాబాద్ప్రతినిధి:** విద్యతోనే ఉపాధి శిఖరాలను అధిరోహించవచ్చని విద్య సమాజాభివృద్ధికి మూలస్తంభమని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. గొర్తి ఈశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటగల్లీ ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథులుగా అర్బన్ ఎమ్మెల్యేధన్పాల్ సూర్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి నగదు పురస్కారాలు అందిస్తున్న గోర్తి ఈశ్వర ట్రస్ట్ ఫౌండర్ తిరుపతిరెడ్డికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. విద్యతోనే సమాజంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని విద్య సమాజాభివృద్ధికి మూలస్తంభంగా నిలుస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి 10వ తరగతి ఒక పునాది అని దానిని విద్యార్థులు బలంగా నిర్మించుకుంటేనే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్నారు. నగరంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చి న విద్యార్థినులు వైష్ణవికి 15 వేలు, ఆరాధ్యకు 10 వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలోదినేష్, ఎంఇఒ, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంస్కృతిక, సంప్రదాయాలకు, నిదర్శనం బోనాల పండగ

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, సిపి



**ప్రజాపక్షం/నిజామాబాద్ప్రతినిధి:**తెలంగాణలో సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బోనాల పండగ అని నవదుర్గ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల పండగ ఘ నంగా నిర్వహించడం గొప్ప విషయమని జిల్లా కలెక్టర్ వినయ్కృష్ణారెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, సిపి సాయి చైతన్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్లో అనవాయితీగా నిర్వహించే బోనాల ఉత్సవాలను నవదుర్గాదేవి ఆలయ కమిటీ చైర్మన్, టిజిఒ అధ్యక్షుడుఅలుక కిషన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి బోనాలు తీసి పూజలు నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అర్బన్ ఎమ్మెల్యే ధ న్పాల్ సూర్యనారాయణ, జిల్లా కలెక్టర్ వినయ్కృష్ణారెడ్డి, సిపి సాయిచైతన్య, రాష్ట్ర టిజిఒ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ హాజరై బోనాలు ఎత్తుకుని అ మ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అర్మన్ ఎమ్మెల్యే న వదుర్గాదేవి ఎంతో మహిమ గల అమ్మవారన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వినయ్కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రశాంతమైన వా తావరణంలో దైవ సన్నిధిలో కలెక్టర్ కార్యాలయం అప్పుడు ఉ ఒడటం ఎంతో గొప్ప విషయమన్నారు. అనంతరం సిపి మా ట్లాడుతూ ఉద్యోగులందరూ ఒక్కటిగా ఒకే కుటుంబంలా బో నాల పండగ జరుపుకోవడం సంతోషమనిపించిందని, ప్రతిఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమ ంలోటిజిఒ అధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ అలుక కిషన్, ప్రధాన కార్యదర్శి అమృత్కుమార్, కోశాధికారి ఉమాకిరణ్, ఉపాధ్యక్షులు చిట్టి నారాయణరెడ్డి, సలహాదారులు,సభ్యులు, జాయింట్ సెక్రటరీ,మహిళఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

## 12వేల ఎకరాలలో ఆయిల్పామ్ పంట సాగు



**ప్రజాపక్షం/గజ్వేల్:**జిల్లాలో ఈ సంవత్సరం 12 వేల ఎకరాలలో ఆయిల్పామ్ పంట సాగు ల క్ష్యంగా పెట్టుకున్నట్లు గజ్వేల్ డివిజన్ ఎడిఎ బా బు నాయక్ పేర్కొన్నారు. మెగా ప్లాంటేషన్ లో భా గంగా గురువారం మున్సిపల్ పరిధిలోని క్యాసారంలో రైతు వీరభద్రయ్య పొలంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, ఆత్మ క మిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డితో కలిసి ఆయి ల్పామ్ మొక్కలు నాటిన సందర్భంగా వారు మా ట్లాడారు. ఆయిల్పామ్ పంట సాగుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రోత్సహిస్తుండగా, సర్కార్ అందిస్తున్న వివిధ సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డివిజన్ పరిధిలో ఇప్పటికే వెయ్యి టన్నుల ఆయిల్పామ్ పంట దిగుబడి రా గా, అన్నదాతలు ఆర్థికంగా ప్రయోజనం పొందిన ట్లు చెప్పారు. అయితే ఆయిల్ పామ్ పంట సా గులో అంతర పంటలు కూడా సాగు చేసుకుని ఆ ర్థికంగా ప్రయోజనం పొందవచ్చని అన్నారు. ము ఖ్యంగా గజ్వేల్ కేంద్రంగా ఆయిల్ పామ్ పంట కలెక్షన్ సెంటర్కు శ్రీకారం చుడుతుండగా, ఆగ స్టు నెలలో నర్మెట్టలోని ఆయిల్పామ్ ఫ్యాక్టరీ ప్రార ంభం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి,ఎఎంసి, ఆత్మ డైరెక్టర్లు,ఎఇఒలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన సేవలు



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:**ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసిన సందర్భంగా అధికారులకు సూచించారు. ఆసుపత్రిలోని రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రతి ఒక్క రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం మునిపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సులో తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ చేసి ధ్రువీకరణ పూర్తి చేసి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా తాహసీల్దార్ కార్యాలయం ఆవరణలలో మొక్కలు నాటారు. తహసీల్దార్ , సంబందిత శాఖల అధికారులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాల్కొండలో రణరంగ రాజకీయం

వేల్పూర్లో తీవ్ర ఉద్రిక్తత
కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్





**ప్రజాపక్షం/భీమ్గల్:**బాల్కొండ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి .కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ నాయకుల సవాల్లతో మరింత వేడి పుట్టిస్తున్నాయి.గతంలో ఎన్నడూ లేనంతగా కాంగ్రెస్ బిఆర్ఎస్ల మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమనే స్థాయికి చేరుకుంది.గత కొన్ని రోజుల క్రితం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్రెడ్డి విసిరిన సవాల్ను స్వీకరిస్తున్నామంటూ మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రతి సవాల్ విసరడంతో రాజకీయం రక్తికట్టింది.గురువారం నాడు లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామనడంతో ఉదయం నుండి ఆయన ఇంటివద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.బిఆర్ఎస్ శ్రేణులు లబ్ధిచేకూరని వారితో సమావేశం నిర్వహిస్తామనడంతో ఎమ్మెల్యే స్వ గ్రామం వేల్పూర్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొ న్నాయి .ఆర్మూర్ రూరల్ సిఐ శ్రీధర్రెడ్డి అధ్వర్యంలో పోలీసులు సుమారు రెండు వందల మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి నుండి బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలో పోలీసులు బిఆర్ఎస్ నాయకులను గృహనిర్భందం చేయడం,పలువురు నాయకులను పోలీస్స్టేషన్లకు తరలించారు. పోలీసులు షాపులను మూసేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఇదే తరుణంలో పలువురు కాంగ్రెస్ నాయకులు,బిఆర్ఎస్ నాయకులు మధ్య కాసేపు తోపులాట నెలకొంది వీరి ఇరువురిని పోలీసులు అరెస్టులు చేసి స్టేషన్కు తరలించారు.కొద్దిసేపు గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.ఇదే సమయంలో కాంగ్రెస్ నాయకుడు ఎస్ఆర్ఐ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నంగి దేవేందర్ రెడ్డి అందరి కల్లు గప్పి ఎమ్మెల్యే ఇంట్లోకి చొరబడి సెల్ఫోన్లో లైవ్ విడియో చిత్రీకరిస్తుండటంతో గమనించిన బిఆర్ఎస్ నాయకలు ఆయనను అడ్డుకొని అతనికి దేహశుద్ధి చేశారు.పోలీసులు కలగజేసుకొని అతన్ని పోలీసు వాహనంలో స్టేషన్కు తరలించారు.పోలీసులు సైతం కాంగ్రెస్ నాయకులకు మద్దతు తెలుపుతున్నారని బిఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. పోలీస్స్టేషన్కు నంగి దేవేందర్రెడ్డిని తరలించారని తెలుసుకొని కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున స్టేషన్కు తరలివచ్చారు.దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూపోలీసులతో వాగ్వాదం చేశారు.అనంతరం దేవేందర్రెడ్డి ఫిర్యాదు చేయడంతో చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సంజీవ్ తెలిపారు.

**నేతల తీరుతో కాంగ్రెస్ కార్యకర్తల్లో తీవ్ర అసహనం..**

తమను పోలీసులు స్టేషన్కు తరలిస్తున్నారని నేతలకు తెలిపిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్రంగా మండిపడ్డారు.తమ ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితి నెలకోవడం సిగ్గుచేటంటూ తమ అసహనాన్ని వెల్లబుచ్చారు.

**ప్రజల కోసం ఎన్నిదాడులనైనా ఎదుర్కొంటాం...**

కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు అమలయ్యే వరకు ఎన్ని దాడులను చేసిన ఎదుర్కొంటాం అంటూబిఆర్ఎస్ పార్టీ నాయకుడు నాగంపేట్ శేఖర్ రెడ్డి అన్నారు.గురువారం నాడు భీమ్గల్ మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి నేతలతో కలిసి ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శేఖర్రెడ్డి మాట్లాడుతు ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ తరుపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుండటంతో మాపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయిస్తున్నారని దుయ్యబట్టారు.ఇచ్చిన హామీలన్నింటిని అమలయ్యే వరకు ప్రజల పక్షాన పోరాడతామని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు ,పలువురు నాయకలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి

### మున్సిపాల్ ఇంజనీర్ చిట్యాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/కోరుట్ల:** చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ మేనేజర్ చిట్యాల శ్రీనివాస్ ప్రజలను కోరారు. గురువారం కోరుట్ల మున్సిపాలిటీలోని16వ వార్డులో మున్సిపల్ కమిషనర్ రవీంధర్ ఆదేశాల మేరకు స్థానిక తాజా మాజీ కౌన్సిలర్ బలిజ పద్మరాజారెడ్డి ఆధ్వర్యంలో తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలందరు తడి పొడి చెత్తను వేరుచేసి వార్డులోకి వచ్చే చెత్త బండికి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్ జగదీశ్వర్, ఆర్‌పి పావని, బలిజ శివప్రసాద్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టియుడబ్ల్యుజె నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రావుకి సన్మానం



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** జగిత్యాల జిల్లా టియుడబ్ల్యుజె ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నూతనంగా ఎన్నికైన సందర్భంగా అధ్యక్షులు చీటి శ్రీనివాస్‌రావుకి జిల్లా తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వారు ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షులు శ్రీనివాస్‌రావుకి శాలువాతో సత్కారించారు. రాష్ట్ర కమిటీ బాధ్యులు గంద్ర రాజేంధర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అధ్యక్షులు గాలిపెల్లి ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చిట్యాల భూమయ్య, ఉపాధ్యక్షులురాలు అర్చన కుమారి, అసోసియేట్1 అధ్యక్షులు కట్ట విష్ణు, అసోసియేట్2 అధ్యక్షులు ధూస రాజశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజేంధర్‌రావు, క్యాషియర్ నరేంధర్, ప్రచారకార్యదర్శి పంగరాజేశం, నాయబ్ తహసీల్దార్ తిరుపతినాయక్, గిర్దవార్ వినయ్, సీనియర్ సహాయకులు భాస్కర్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం / చందుర్తి :** నకిలీ విత్తనాలు అమ్ముతూ రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫర్టిలైజర్ షాపుల యజమానులను హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారిని అఫ్జల్ భేగంతో గురువారం మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో శ్రీపవన కుమార ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని, కృత్రిమ కొరత సృష్టించవద్దని ఫర్టిలైజర్ షాపుల యజమానులకు సూచించారు. అలాగే మండలంలోని సనుగుల, చందుర్తి ఫ్యాక్స్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, గోదాం లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం కృషి చేస్తా

### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు హుజురాబాద్ నియోజవకర్గంలోని ఇల్లందకుంట మండల ఉద్యమకారుల కమిటీని ప్రకటించారు. ఈ మేరకు గురువారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి వారికి ఉత్తర్వులు జారీ చేశారు. హుజురాబాద్ నియోజకవర్గం కార్యదర్శిగా ఆరె రమేష్‌రెడ్డి, ఇల్లందకుంట మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్రా భూంరెడ్డి, ఇల్లందకుంట మండల ఉపాధ్యక్షులుగా రేణికుంట్ల పెద్ద లచ్చయ్య, కార్యదర్శిగా గురుకుంట్ల రాజీరును నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వారి సంక్షేమం, ఆత్మగౌరవం కోసం విశేష కృషి చేస్తుందన్నారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్రవ్యాప్తంగా బలోపేతమవుతుందని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఇల్లందకుంట మండల అధ్యక్షుడు రావుల రాజబాబు, జమ్మికుంట మండల కార్యదర్శి పాకాల మల్లారెడ్డి, గుడికందుల రాజయ్య, తాడెం దిలీప్, సంగె లింగయ్య తదితరులున్నారు.

## ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు పక్కాగా నమోదు

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విద్యా శాఖ పని తీరుపై అధికారులతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. భవిత కేంద్రాల అభివృద్ధి, టీచర్స్, విద్యార్థుల ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంలో హాజరు నమోదు, సుల్తానాబాద్ మండలంలో పైలట్‌గా చేపట్టిన మిడ్ డే మిల్స్ యాప్ తదితర అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిత సెంటర్‌లలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దివ్యాంగ విద్యార్థులకు అనుకూలంగా భవిత సెంటర్లను మనం తీర్చిదిద్దాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రిక్గానిగేషన్ సిస్టం) ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎంఈఓలు వారి మండలంలో 5 పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు సరిగ్గా నమోదు చేస్తున్నారా పరిశీలించి రి పోర్ట్ అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశా ఖ అధికారి డి.మా ధవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం :ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** తెలంగాణలో కోట్లాది మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం కురిక్యాల గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీ కింద 328 మహిళ సంఘాలకు రూ.38.20 కోట్లు, 5273 సంఘాలకు రూ.6.92 కోట్లు, ఆరుగురు సభ్యులకు ప్రమాద బీమా కింద రూ.60 లక్షలు, 54 మంది సభ్యులకు లోన్ బీమా కింద రూ.48.52 కోట్లు, స్టిచ్చింగ్ స్కూల్ యూనిఫామ్‌కు రూ.20.83 లక్షలు, ఐదు మండల సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులు రూ.1.54 కోట్ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక అభివృద్ది దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో చొప్పదండి, గంగాధర, రామడుగు, బోయినిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు కొత్తూరు మహేష్, జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మరవేణి తిరుమల తిరుపతి, బోయిని ఎల్లేష్, కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్‌రావు తదితరులున్నారు.

## ప్రజా సంగ్రామ యాత్రలో పేదల కన్నీళ్లు చూశా..

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్






**ప్రజాపక్షం / హుజురాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయాలనే ఆలోచనకు కారణం ప్రజాసంగ్రామయాత్రేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ప్రజా సంగ్రామ యాత్రలో కాళ్లకు చెప్పులు కూడా లేకుండా ఎంతో మంది పిల్లలు ఎండలో నడుస్తూ ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్న బాధాకరమైన దృశ్యాలను కళ్లారా చూ శానని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకునే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. హుజురాబాద్ ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదుకునే టెన్త్ విద్యార్థిని, విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ తన చేతుల మీదుగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి నిర్వహించిన సైకిల్‌ర్యాలీలో బండి సంజయ్ పాల్గొని కాసేపు సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి బండి సంజయ్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్, విద్యా శాఖ అధికారులు, బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతున్నంత సేపు సైకిళ్లను అందుకున్న బాలబాలికల ఆనందానికి అవధుల్లేవు. విజిల్స్ చప్పట్లు కొడుతూ నినాదాలు చేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. బండి సంజయ్ ప్రసంగిస్తూ విద్యార్థులు మొట్టమొదటి ఇష్టమైన ఆస్తి సైకిల్. ఆ ఆస్తిని నేను మీకు అందజేస్తున్నా ఇది ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ ఇస్తున్న గిఫ్ట్. సక్రమంగా వినియోగించుకోండి అని అన్నారు. త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కెజి నుండి 6వ తరగతి వరకు మోదీ కిట్స్‌ను పంపిణీ చేస్తామని అన్నారు. ఒక స్కూల్ బ్యాగ్‌తో పాటు వాటర్ బాటిల్, పెన్ను, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు, రబ్బర్‌ను మోదీ కిట్స్ పేరుతో అందిస్తానని అన్నారు. తప్పనిసరిగా వినియోగించుకుని బాగా చదువుకుని రాణించాలని అన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

### పిఆర్‌టియుటిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు బోయినపల్లి ఆనందరావు



**ప్రజా పక్షం / మెట్ పల్లి :** . ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ గురుకుల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పిఆర్ టియు టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బోయినపల్లి ఆనందరావు అన్నారు. గురువారం పిఆర్ టియు టిఎస్ సభ్యత్వ నమోదులో భాగంగా మెట్ పల్లి మండలంలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ గవర్నమెంట్ హై స్కూల్ వేంపేట్, ఆరపేట్ పాఠశాలలో సభ్యత నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని హెల్త్ స్కీల్ వర్తించే విధంగా గురుకుల పాఠశాల పని వేరేలా మార్పునకు ప్రభుత్వానికి ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి, ప్రాతినిధ్యం చేశారు. త్వరలోనే ఉత్తర్వులు వస్తాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షు ప్రధాన కార్యదర్ములు గంగా ప్రసాద్ , బాలకిషన్ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మద్దిరాల గణేష్. రాష్ట్ర కార్యదర్మి నాగరాజు, సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు నడిగడ్డ రాజు, తదితరలు పాల్గోన్నారు.

## సమస్యల సాధన కోసం పట్టు వీడవని విక్రమార్కుడిలా పనిచేస్తా

### పెద్దపెల్లి జిల్లా జెఎసిచైర్మన్ వెంకటేష్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యల సాధన కోసం పట్టు విడవని విక్రమార్కుడిలా పనిచేస్తారని నూతనంగా ఎన్నికైన పెద్దపెల్లి జిల్లా గ్రామపంచాయతీ ఉద్యోగుల జెఎసి చైర్మన్ జొన్నకోటి వెంకటేష్ అన్నారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల రంగనాయక స్వామి ఆలయం వద్ద పెద్దపెల్లి జిల్లా గ్రామపంచాయతీ ఉద్యోగుల వివిధ సంఘాల నాయకులు అందరి సమక్షంలో జిల్లా జెఎసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా నూతనంగా పెద్దపెల్లి జిల్లా జెఎసి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్దపెల్లి జిల్లా గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం చైర్మన్ గా జొన్నకోటి వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా కాసిపేట అశోక్, గౌరవ అధ్యక్షులుగా మామిడి కొమురయ్య వైస్ చైర్మన్‌గా పసునూటి సంతోష్, దొడ్డిపేట కనకయ్య, అమరగోని పురుషోత్తం, కోశాధికారి బర్ల భూమయ్య,సలహాదారులుగా ఆర్ సత్తన్న, కత్తిమల్ల రాజలింగయ్య,సహాయ కార్యదర్శిగా సత్యం, సుధాకర్ రెడ్డి, ఆసరి రమేష్, తుమ్మ మధుసూదన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి లుగా: మిట్ట శ్రీనివాస్ ,వేల్పుల రాజేష్, రాచకొండ భీమ్రాజ్, ప్రచార కార్యదర్శి: క్యాదాసి కుమార్, గుండ రమేష్ మెంబర్స్‌గా, ఎర్రం రామ్ రెడ్డి, విట్టం సంపత్, రాజమౌళి, మంగ సంతోష్, ఇరుగ రాళ్ల శంక,ర్, కిరణ్ ,వంగ భాస్కర్, రాజ్కుమార్, ప్రదీప్, వికాస్, సాగర్,అనురాధ లను జెఎసి కమిటీగా ఎన్నుకోన్నారు. నూతన జెఎసి చైర్మన్ జొన్నకోటి వెంకటేష్ మాట్లాడుతూ తన పై నమ్మకంతొ జెసి చైర్మన్‌గా ఎన్నుకున్న సహచర ఉద్యోగులకు, నాయకులకు, ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామపంచాయతీ కార్మికుల అభ్యున్నతికై నిరంతరం శ్రమిస్తానాని అన్నారు.

## గురుకులంలో విద్యార్థినులకు అస్వస్థత

### చిన్నారులకు ఎలాంటి అపాయం లేదు..

### జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీ పూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారన్న విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై డాక్టర్లతో మాట్లాడిన అనంతరం, చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ వారికి ఎలాంటి అపాయం లేదని, ఆరోగ్యంగా ఉన్నారని కలెక్టర్ తెలిపారు. పిల్లలు పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేయాలని వైద్య అధికారులకు సూచించారు. జగిత్యాల డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రమోద్ కుమార్, సూ పరిండెంట్‌డాక్టర్ కృష్ణమూర్తి,ఆర్ఎంఓ డాక్టర్ సుమన్‌రావు తదితరులు ఉన్నారు.

### గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి డా. ప్రమోద్ కుమార్

జగిత్యాల మండలంలో లక్ష్మి పూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల బాలికలు విద్యాలయంలో చిన్నారులు అస్వస్థతకు గురయ్యారని విషయం తెలుసుకొని జగిత్యాల జిల్లా వైద్యాధికారి డా. ప్రమోద్ కుమార్ గురువారం నాడు విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఆదేశాలనుసారం విద్యాలయంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను పరీక్షించి 40 మందికి చికిత్సలు అందించడం జరిగిందని తెలిపారు. సంఘటనకు గల కారణాలను విద్యార్థులను అడగగా విద్యార్థులు నిన్న పండిన చికెన్ లో కారం మసాలా ఎక్కువ అవడం వలన విద్యార్థులకు జీర్ణం అవ్వకపోగా కడుపునొప్పి అజీర్ణ సమస్యలు కొంతమందికి వాంతులు కావడం కూడా జరిగిందని తెలిపారు. అశ్వస్థకు గురైన ఐదుగురిలో సాత్విక , శ్రీనిక ఆరు తరగతి, పరిచయ తొమ్మిదవ తరగతి, లక్ష్మీ ప్రసన్న, శ్రీజ పదవ తరగతి పిల్లలను జగిత్యాలలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పిడియాట్రిక్ వార్డుకు రిఫర్ చేయడం జరిగిందనీ అక్కడ విద్యార్థులను పిల్లల వైద్యులు పరీక్షించే అడ్మిట్ చేసుకొని చికిత్సలు అందిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని జగిత్యాల జిల్లా వైద్యాధికారి డా. ప్రమోద్ కుమార్ తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ తో మాట్లాడి వాంతులు చేసే వారికి తగిన జాగ్రత్తల గురించి మరియు వైద్య విద్య గురించి వివరించారు. ఆర్.బి.ఎస్.కే టీంను విద్యాలయంలో ఆరోగ్య శిబిరం నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. విద్యాలయంలో తల్లిదండ్రులు అధైర్య పడవద్దని పిల్లల ఆరోగ్యం నిలకలగానే ఉందని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్, కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య, డిపిఓ రవీందర్ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి



**ప్రజాపక్షం / ధర్మపురి :** తెలంగాణ రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాల ప్రజల సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ఎస్‌హెచ్‌గార్డెన్‌లో గురువారం నిర్వహించిన అభినందన సభకు ముఖ్య అతిథులుగా మంత్రి అడ్లూరితో పాటు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ప్రభుత్వ విప్ ఆ ది శ్రీనివాస్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, తెలంగాణ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ భారత్ జూడో పాదయాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి 42శాతం బిసిలకు రిజర్వేషన్ అమలు చేయడం జరిగిందన్నారు. ప్రకటించిన రిజర్వేషన్లు స్థానిక ఎన్నికల్లో నూటికి నూరు శాతం అమలు చేస్తామన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మాత్రమే ఎస్‌సి రిజర్వేషన్, బిసి రిజర్వేషన్ కల్పించిందన్నారు. బిసిలకు రాజకీయ విద్య ఉద్యోగ కల్పనలో రిజర్వేషన్ అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా ఎస్‌సి, బిసి రిజర్వేషన్లు అమలు కావడం లేదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తనకు మంత్రి పదవీ తోపాటు వరంగల్, నల్గొండ జిల్లాల బాధ్యతలు పార్టీ అప్పజెప్పడం వల్ల నియోజకవర్గ ప్రజలకు శని ఆదివారాల్లో ఉండి సేవలందిస్తానన్నారు. ప్ర భుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి బిసి బిడ్డ కానప్పటికీ బిసిలకు రిజర్వేషన్ కల్పించాలనే సంకల్పంతో అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం గొప్ప విషయమని, ఆ సమయంలో బిసి బిడ్డగా తాను అసెంబ్లీలో ఉండి బిల్లును బలపరిచే అదృష్టం కలగడం పూర్వ జన్మ సుకృతమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలంతో పాటు బిసి, ఎస్‌సి రిజర్వేషన్ అమలు అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు ఎస్. దినేష్, శైలేందర్ రెడ్డి, నిశాంత్ రెడ్డి, బుర్రం రాములు గౌడ్, సుభాష్, ధర్మపురి ఎఎంసి చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, మండల ఉపాధ్యాక్షుడు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, చిలుముల లక్ష్మ ణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి 23న విద్యాసంస్థల బంద్

### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనీల్‌కుమార్




**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లా ప్రతినిధి:** రాజన్నసిరిసిల్లా జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యా కార్పొరేట్ సంస్థలు ఫీజులను నియంత్రించాలని ఈ నెల విద్యారంగ సమస్యలు పరిష్కారానికి 22న విద్యాసంస్థల బంద్‌కు ఎఐఎస్‌యఫ్ జిల్లా కార్యదర్శి మంద అనీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరుల ప్రకటన చేసి మాట్లాడారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సిఐఎస్‌యఫ్ జిల్లా కార్యదర్శి మంద అనీల్ కుమార్ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే బర్తీ చేయాలని ప్రభుత్వకళాశాలలో టీచింగ్,నాన్‌టీచింగ్ పోస్టులను, బర్తీ చేయాలని డిమాండ చేశారు. మధ్యహ్నాభోజన పథకాన్ని ప్రవేశనపెట్టాలని విద్యావ్యవస్థ ప్రారంభమై నెల గడుస్తున్నపటికి మౌలిక వసతుల కల్పన లేదని ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని విమర్శించారు. ఈ నెల 23న జరిగే వామపక్షాల బంద్‌కు అందరు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు నాయకులు సాయిరాం, వెన్నెల, అంకిత, వైష్ణవి తదితరులున్నారు.

## స్మార్ట్ సిటీలో అవినీతిపై విచారణ జరిపించాలి

### సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ నగరంలో స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి జరిగిందని, దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని, మాజీ మేయర్ సునీల్‌రావు అక్రమ ఆస్తులపై ఎసిబి అధికారులు విచారణ చేయాలని కోరుతూ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో కోట్ల రూపాయల నిధులతో జరిగిన స్మార్ట్ సిటీ పనుల్లో పూర్తిగా అవినీతి అక్రమాలు రాజ్యమేలాయన్నారు. దీనిని పట్టించుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మేయర్ సునీల్‌రావు కొందరు బినామీ కాంట్రాక్టర్లను ఏర్పరచుకుని ఇష్టం వచ్చిన రీతిలో స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి అక్రమాలు ప్రోత్సహించాడని, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దిగమింగాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుట్‌పాత్‌ల నిర్మాణం, జంక్షన్ల సుందరీకరణ, పార్కుల నిర్మాణం, రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలలో పూర్తిగా అవినీతి అక్రమాలు జరిగాయన్నారు. అధికారులు రాజకీయ నాయకులు ఒక్కటై కరీంనగర్ నగరాన్ని దోచుకున్నారని విమర్శించారు. సంవత్సరం కాకముందే ఫుట్‌పాత్‌లు టైల్స్ దెబ్బతిన్నాయన్నారు. రోడ్లు పగళ్లు వచ్చాయని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ పూర్తిగా నాణ్యత పాటించకపోవడం కాంట్రాక్టర్‌కు వత్తాసు పలకడం వల్ల అవినీతి రాజ్యమేలిందన్నారు. వెంటనే స్మార్ట్ సిటీ పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి వరకు మేయర్‌గా కొనసాగిన సునీల్‌రావు స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి జరిగిందని, మేయర్ పదవి పోయిన తర్వాత గుర్తుకు రావడం సిగ్గుచేటని సునీల్‌రావు మాటలు వింటుంటే దొంగే దొంగ అన్నట్లుగా వ్యవహరించడం సరైంది కాదని ఆరోపించారు. సునీల్‌రావుకు కరీంనగర్‌లో బహుళ అంతస్తుల భవనం, విదేశాల్లో భవంతులు ఏ విధంగా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఈ ధర్నాలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, మచ్చ రమేష్, ఆర్.వెంకటేష్, నగర కార్యవర్గ సభ్యులు గామినేని సత్యం, కసుబోజుల సంతోష్ చారి, చంచల మురళి, నగునూరి రమేష్, ఎలిశెట్టి భారతి, చారి, రాము, సాంబరాజు, బెక్కంటి రమేష్, లక్ష్మి , రజిత, సుజాత, రమ, సందీప్ రెడ్డి, రాజయ్య తదితరులున్నారు.

## విపత్తును ఎదుర్కోవడంలో ఆపదమిత్ర వలంటీర్లు ముందుండాలి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే విపత్తుల నుంచి ప్రజలను రక్షించేందుకు ఆపద మిత్ర వాలంటీర్లు ముందుండాలని జిల్లా కలెక్ట ర్ పమేలా సత్పతి అన్నారు. రెవెన్యూ శాఖ విపత్తుల ని ర్వహణ విభాగం ఆధ్వర్యంలో 142 మంది డిగ్రీ వి ద్యార్థులు, ఎన్‌సిసి వాలంటీర్లకు బిసి స్టడీ సర్కిల్‌లో 12రోజుల పాటు ఆపదమిత్ర శిక్షణ ఇచ్చారు. ఈ శి క్షణ ముగింపు కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆపదమిత్ర వాలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్ల నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రమాదాలు ఎదుర్కొనేందుకు గ్రామాల్లో, పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వరంగ ఉద్యోగులతో పాటు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వాలంటీర్లకు మొదటి విడతలో ఆపద మిత్ర శిక్షణ ఇచ్చామని తెలిపారు. రెండో విడతలో డిగ్రీ విద్యార్థులు, ఎన్‌సిసి వాలంటీర్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా ఫైర్, పోలీస్, పంచాయతీరాజ్, వైద్యశాఖ, పశుసంవర్ధక శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రతి విపత్తును ఎదుర్కొనే విధంగా శిక్షణ ఇచ్చామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, పాము కుక్కకాటు, అగ్నిప్రమాదం, సిపిఆర్, షాట్ సర్క్యూట్, వరదలు, రో డ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఆపదమిత్ర వాలంటీర్లు ముందుండి ప్రజల ప్రాణాలను రక్షించాలన్నారు. నైపుణ్యాలతో కూడిన ఆపదమిత్ర శి క్షణ వల్ల తమను రక్షించుకోవడంతో పాటు పది మంది ప్రాణాలు కాపాడగలరని పేర్కొన్నారు. శిక్షణకు హాజరైన వారు నేర్చుకున్న నైపుణ్యాలను, మెళకువలను మరో పదిమందికి నేర్పించాలని సూచించారు. జిల్లా అగ్నిమాపక అధికారి ఎం. శ్రీనివాస రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# క్రీడ

## గిల్, జడేజా కాదు.. నాలుగో టెస్ట్‌లో అతనే కీలకం






ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌లో టీమిండియా విజయం సాధించాలంటే తుది జట్టులో జస్‌ప్రీత్ బుమ్రా ఉండాలని మాజీ క్రికెటర్ దీప్ దాస్‌గుప్తా అన్నాడు. ఈ మ్యాచ్ గెలవడం భారత్‌కు కీలకమని, బుమ్రా లేకుండా బరిలోకి దిగడం సరైన నిర్ణయం కాదన్నాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్‌సచిన్ ట్రోఫీలో టీమిండియా 12తో వెనుకంజలో నిలిచింది. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్ట్‌లో టీమిండియా 22 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. టెయిలెండర్స్ సాయంతో ఆఖరి సెషన్ వరకు రవీంద్ర జడేజా చేసిన పోరాటం వృథా అయ్యింది. అయితే వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా మరో మ్యాచ్ మాత్రమే ఆడాల్సి ఉంది. ఈ సిరీస్‌కు ముందే బుమ్రా మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడుతానని చెప్పాడు. ఈ క్రమంలోనే అతను రెండో టెస్ట్‌కు దూరంగా ఉన్న బుమ్రా.. మూడో టెస్ట్‌తో రీఎంట్రీ ఇచ్చాడు. నాలుగో టెస్ట్‌కు బుమ్రా దూరమవుతాడనే ప్రచారం జరుగుతుంది. అయితే నాలుగో టెస్ట్‌లో బుమ్రా ఖచ్చితంగా ఆడించాలని దీప్ దాస్ గుప్తా సూచించాడు. నాలుగో టెస్ట్‌కు 8 రోజుల విశ్రాంతి లభించిందని, రికవరీ అయ్యేందుకు బుమ్రాకు ఈ విశ్రాంతి సరిపోతుందని చెప్పాడు. 'నాలుగో టెస్ట్‌లో జస్‌ప్రీత్ బుమ్రా ఆడాలంటే ఖచ్చితంగా ఆడాల్సిందే. బుమ్రాను టీమిండియా తొలి, మూడు, ఐదో టెస్ట్ ఆడించాలనే ప్లాన్ గురించి విన్నాను. కానీ ప్రస్తుతం భారత్ 12తో వెనుకంజలో నిలిచింది. నాలుగో టెస్ట్ చాలా కీలకం. కాబట్టి వరల్డ్ బెస్ట్ బౌలర్ అయిన బుమ్రాను బరిలోకి దించాల్సిందే. నాలుగో టెస్ట్‌కు ముందు 8 రోజుల విశ్రాంతి లభించింది. ఐదో టెస్ట్ కంటే నాలుగో టెస్ట్‌లో బుమ్రాను ఆడించాల్సిన అవసరం ఎక్కువగా ఉంది.'అని స్టార్ స్పోర్ట్స్‌తో దీప్ దాస్ గుప్తా చెప్పుకొచ్చాడు. భారత్, ఇంగ్లండ మధ్య నాలుగో టెస్ట్ జులై 23 నుంచి ప్రారంభం కానుంది.


## క్వార్టర్స్‌లో తెలంగాణ కెరటం..

### వరల్డ్ నంబర్ 1 ఆట కట్టించిన ప్రజ్ఞానంద..!



భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద విశ్వ వేదికపై మరోసారి సంచలన ఆటతో అదరగొట్టాడు. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌కు ముచ్చెమటలు పట్టించాడు. లాస్ వెగాస్‌లో జరుగుతున్న ఫ్రీస్టయిల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో మాగ్నస్‌ను సులువగా మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. తెలంగాణ కుర్రాడు అర్జున్ ఎరిగేసి కూడా అద్భుత విజయంతో క్వార్టర్స్ చేరుకున్నాడు. ఈమధ్యే భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ చేతిలో కార్ల్‌సన్ ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆ షాక్ నుంచి తేరుకొనేలోపే ఈసారి ప్రజ్ఞానంద అతడిని చావుదెబ్బ కొట్టాడు. తెల్ల పావులతో ఆడిన ఈ కేరళ కుర్రాడు ఆది నుంచి వ్యూహాత్మక దాడితో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఒకదశలో నార్వ దిగ్గజానికి పట్టు సాధించే అవకాశం వచ్చింది. కానీ, ప్రజ్ఞానంద అతడికి ఏమాత్రం పుంజుకునే అవకాశం ఇవ్వకుండా చెక్ పెట్టాడు. ఇదివరకే వెస్లే సో చేతిలో కంగుతిన్న కార్ల్‌సన్ మూడో స్థానం కోసం పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫ్రీస్టయిల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో వివిధ దేశాలకు చెందిన 16 మంది గ్రాండ్‌మాస్టర్లు పోటీ పడుతున్నారు. వీళ్లను రెండు గ్రూపులుగా విభజించి నిర్వహిస్తున్న ఈ టోర్నీలో .. రెండు గ్రూప్‌ల నుంచి టాప్4లో నిలిచిన వాళ్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. విజేతగా నిలిచిన వాళ్లకు 750,000 యూఎస్ డాలర్ల (భారతీయ కరెన్సీలో రూ.6.45 కోట్లు) ప్రైజ్ మనీ దక్కనుంది.

## క్రికెట్‌కు వెస్టిండీస్ బ్యాట్స్‌మన్ అండ్రి రస్సెల్ వీడ్కోలు




వెస్టిండిస్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. వెస్టిండీస్‌తో ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోని తొలి రెండు మ్యాచ్‌లు చివరి మ్యాచులు కానున్నాయి. 37 ఏళ్ల రస్సెల్ ఐదు మ్యాచ్‌ల సిరీస్ కోసం జట్టులో చోటు దక్కించుకున్నాడు. జమైకాలోని సబీనా పార్క్‌లోని హోంగ్రౌండ్‌లో జరిగే తొలి రెండు మ్యాచులు ఆడి ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలుకనున్నాడు. విండీస్ క్రికెట్ రిటైర్మెంట్‌ను ధ్రువీకరిస్తూ పోస్ట్ చేసింది. 'దాని అర్థాన్ని పదాలు వివరించలేవు. వెస్టిండీస్‌కు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో గర్వించదగ్గ విజయాలలో ఒకటి. నేను చిన్నప్పుడు ఈ స్థాయికి చేరుకుంటానని ఊహించలేదు. కానీ , మీరు క్రీడను ఎంత ఎక్కువగా ఆడటం, ప్రేమించడం ప్రారంభిస్తే మీరు ఏమి సాధించగలరో మీరు గ్రహిస్తారు. ఇది నన్ను మెరుగ్గా మారడానికి ప్రేరేపించింది ఎందుకంటే నేను మెరూన్ రంగులో ఒక ముద్ర వేయాలని, ఇతరులకు ప్రేరణగా మారాలని కోరుకున్నాను' అని రస్సెల్ పేర్కొన్నాడు. కరేబియన్ నుంచి వచ్చే తదుపరి తరం క్రికెటర్లకు రోల్ మోడల్‌గా ఉంటూనే నా అంతర్జాతీయ కెరీర్‌ను ఉన్నతంగా ముగించాలనుకుంటున్నాను' అని పేర్కొన్నారు. రస్సెల్ 2019 నుంచి టీ20 స్పెషలిస్ట్ ప్లేయర్‌గా నిలిచాడు. వెస్టిండిస్ తరఫున 84 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 22.00 సగటు, 163.08 స్ట్రైక్ రేట్‌తో 1,078 పరుగులు చేశాడు. ఇందులో మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యుత్తమ స్కోరు 71 పరుగులు. 30.59 సగటుతో 61 వికెట్లు తీసుకోగా.. అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు 3/19. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్‌కు ఏడు నెలల ముందు రస్సెల్ రిటైర్మెంట్ ప్రకటించాడు.

## ఫోకస్

# రైతు సమస్యల పరిష్కారానికి 'గ్రీవెన్స్ డే'





వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, తగిన పరిష్కాలు సూచించడానికి లేదా చర్యలు తీసుకోవడానికి తమిళనాడులో సుమారు రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన 'గ్రీవెన్స్ డే' నిర్వహణ ఇప్పుడు దేశమంతా విస్తరించాల్సిన అవసరం ఉంది. జులై మాసంలో మొదటి శుక్రవారం వ్యవసాయదారుల కోసం 'గ్రీవెన్స్ డే' నిర్వహించాలని అప్పట్లో తమిళనాడు సర్కారు నిర్ణయించింది. తిరునల్‌వెల్లి వంటి ప్రాంతాల్లో జులై మూడో శుక్రవారం (ఈ ఏడాది జులై 18న) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వ్యవసాయ దేశమైన భారత్‌లో రైతులకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణ ఎంతైనా అవసరం. దేశంలో సుమారు 60 శాతం మంది ప్రజలు నేరుగా లేదా పరోక్షంగా వ్యవసాయ రంగంపై ఆధారపడ్డారు. అయితే, రైతులు ఎన్నో సంక్షోభాలను, సమస్యలను ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాలు, నష్టపరిహారాల్లో జాప్యం, పంటలకు సరైన ధరలు లభించకపోవడం, భూమి సంబంధిత రికార్డుల్లో అవకతవకలు, రుణ భారం, మార్కెట్‌లో అనైతిక మధ్యవర్తిత్వం, బీమా వ్యవస్థలో లోపాలు వంటి అనేక సమస్యలు రైతులను తీవ్ర అసంతృప్తికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలు నేరుగా ప్రభుత్వాధికారులకు తెలియజేసి పరిష్కారం పొందేందుకు ఒక వేదిక అవసరమైంది. ఇదే 'అగ్రికల్చర్ గ్రీవెన్స్ డే' ఆవిర్భావానికి కారణమైంది. ఈ కార్యక్రమంలో రైతులు తమ వ్యవసాయ సంబంధిత సమస్యలను అధికారులకు నేరుగా తెలియజేస్తారు. తగిన చర్యలు తీసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తారు. ఇది ప్రతి జిల్లాలో, నెలలో ఒకసారి లేదా వారంలో ఒకసారి ఈ గ్రీవెన్స్ డేను నిర్వహిస్తారు.

### ఆవశ్యకత...

వ్యవసాయ గ్రీవెన్స్ డే నిర్వహణ ఆవశ్యకత రోజు రోజుకూ పెరుగుతున్నది. వ్యవసాయ రంగం క్రమంగా సంక్షోభంలో చిక్కుకోవడం దీని ఆవసరాన్ని పెంచుతున్నది. వారసత్వ భూముల తగాదాలు, భూ రికార్డుల అర్థం కాని మార్పులు, సాగునీటి కొరత, మార్కెట్ అస్థిరత వంటి అనేక వ్యవసాయ సమస్యలు వృద్ధి చెందుతున్నాయి. ఇక, రైతు ఆత్మహత్యలు ప్రధానంగా ఆర్థిక సమస్యల వల్ల జరుగుతున్నాయి. అయితే, ఈ సమస్యలు విన్నవించుకునే సరైన వేదిక లేకపోవడం కూడా ఒక ముఖ్యమైన కారణం. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని స్పందించే విధంగా పాలన ఉండాలనే దృష్టితో ప్రజల్ని పాలనా వ్యవస్థలో భాగస్వాములుగా చేయాలన్న ప్రయత్నమే గ్రీవెన్స్ డే.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) ద్వారా గ్రామస్థాయిలో రైతుల సమస్యలు నమోదు చేస్తారు. తెలంగాణ ప్రభుత్వం వద్ద కొనుగోలు కేంద్రాలు, పంటల బీమా సదస్సులు ద్వారా సమస్యలు చేర్చేందుకు అవకాశాలు కల్పిస్తుంది. రైతులు తమతమ ఫిర్యాదులతో కార్యాలయానికి హాజరవుతారు. సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా రైతులను కలుస్తారు. సమస్యలను నమోదు చేసి, పరిష్కారానికి నిర్ణీత సమయాన్ని నిర్ధారిస్తారు. తరువాతి సమావేశంలో పరిష్కార పురోగతిని తెలియజేస్తారు. నీటి పంపిణీ, ట్రాన్స్‌ఫార్మర్లు, సాగు రహదారులు వంటి మౌలిక సదుపాయాల కొరత, మద్దతు ధరల అమలు, కొనుగోలు కేంద్రాల్లో అవినీతి వంటి మార్కెట్ సమస్యలను అధికారుల దృష్టికి రైతులు తీసుకెళతారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ఇవన్నీ ప్రధాన అంశాలు కాబట్టి, గ్రీవెన్స్ డే అవసరం.

### ఉపయోగాలు..

గ్రీవెన్స్ డే నిర్వహణ వల్ల రైతు సమస్యలపై త్వరిత స్పందన లభిస్తుంది. ప్రభుత్వంపై వ్యవసాయదారులకు నమ్మకం పెరుగుతుంది. బాధితులతో అధికారులు నేరుగా కలుస్తారు కాబట్టి, వారి పని తీరు మెరుగుపడుతుంది. అవినీతి, మధ్యవర్తిత్వం తగ్గుతుంది. రైతుల సంతృప్తి, ఉత్సాహం పెరుగుతాయి. దీనికి ఓ ఘటనను ఉదాహరణగా పేర్కోవచ్చు. తమిళనాడు తంజావూరు జిల్లాలో ఒక రైతు ఐదేళ్లుగా ఏళ్లుగా భూమికి పట్టా మంజూరు కోసం ప్రయత్నిస్తున్నాడు. గ్రీవెన్స్ డే సమావేశంలో కలెక్టర్ ముందే వ్యవహారాన్ని లేవనెత్తాడు. రెండు వారాల్లో పట్టా జారీ అయింది. ఇది రైతు జీవితంలో మార్పును తీసుకువచ్చింది.

### ఎదురయ్యే సవాళ్లు..

గ్రీవెన్స్ డే వల్ల ఉపయోగాలేకాదు.. ఈ కార్యక్రమ నిర్వహణలో సమస్యలు ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదు. ఉదాహరణకు ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం లేకపోవడం ఒక ప్రధాన సమస్య. కొన్ని సమస్యలు వ్యవస్థాత్మకంగా ఉండటంతో పరిష్కారం ఆలస్యం అవుతుంది. చాలా ప్రాంతాల్లో రైతుల్లో అవగాహన కొరత కారణంగా ఈ కార్యక్రమం ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. అంతేగాక, ఈ సమావేశాల గురించి గ్రామాల్లో పూర్తిగా తెలిసిన రైతుల శాతం తక్కువే. ఇక ఆన్‌లైన్ ఫిర్యాదులలో తప్పులు, అప్రమత్తత లేకపోవడం వంటి సాంకేతిక లోపాలు కూడా ఉంటున్నాయి. ఒకసారి ఫిర్యాదు చేసిన రైతుకు తర్వాత పరిష్కారం జరిగిందా లేదా అన్న సమాచారం లేకపోవడం కూడా ప్రధాన సమస్యల్లో ఒకటి. ఇలాంటి ప్రతిబంధకాలను, సమస్యలను నివారిస్తే, ఉత్తమ ఫలితాలు ఉంటాయి. గ్రీవెన్స్ స్టేటస్ ట్రాకింగ్, నోటిఫికేషన్లతో రైతులకు సమాచారం అందించగల మొబైల్ యాప్‌లు అవసరం. గ్రామాల్లో రైతులకు ప్రభుత్వ వేదికలపై అవగాహన పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. గ్రీవెన్స్ నమోదు కోసం స్థానిక భాషలో పనిచేసే టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేయాలి. జిల్లాలో వచ్చిన సమస్యల సంఖ్య, పరిష్కార శాతం వంటి డేటాను ప్రజలకు చూపించగల డాష్‌బోర్డులు అభివృద్ధి చేయాలి. ఇలాంటి చర్యలతో రైతుల్లో అవగాహన పెంచడం, వారి సమస్యలు అర్థం చేసుకోవడం, పరిష్కరించడం సాధ్యమవుతుంది. ఏదిఏమైనా, రైతు సంతృప్తి లేకుండా దేశాభివృద్ధి అసాధ్యం అన్న మాట పూర్తిగా నిజం. అగ్రికల్చర్ గ్రీవెన్స్ డే ఒక ప్రజాస్వామ్య పద్ధతిలో రైతు సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అద్భుత వేదిక. ఈ వేదికను మరింత సమర్థవంతంగా, వ్యవస్థాపితంగా నిర్వహిస్తే, రైతుల జీవితాల్లో సానుకూలమైన మార్పు ఏర్పడుతుంది. ఇది కేవలం రైతు సంక్షేమమే కాదు, దేశ భద్రత, ఆహార భద్రతకు కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అన్నదాత సుఖీభవ అనేది నినాదం మాత్రమే కాకుండా రైతుల వాస్తవ అనుభూతిగా మారాలంటే అగ్రికల్చర్ గ్రీవెన్స్ డే వంటి వేదికలు నిరంతరం అభివృద్ధి చెందాలి, రైతులకు చేరువ కావాలి.

## 23న విద్యాసంస్థల బంద్

### వామపక్ష విద్యార్థి సంఘాలు నాయకుల పిలుపు




ప్రజాపక్షం/హనుమకొండ: ఈ నెల 23న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు నాయకుల పిలుపునిచ్చారు. వామపక్ష విద్యార్థి సంఘాలైన ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్ యూ, ఏఐపీఎస్, ఏఐఎస్బి ,ఏఐడిఎస్‌ఓ ,ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం బాలసముద్రం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర కన్వీనర్ మాస్ సావిత్రి, పిడిఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష, ఏఐఎస్బి హనుమకొండ జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడినీ అరికట్టాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలన్నారు. 18న అంబేద్కర్ జంక్షన్ లో ఉదయం 11 గంటలకి పోస్టర్ ఆవిష్కరణ, 19న కాళోజీ జంక్షన్ లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం, 21న జిల్లా వ్యాప్తంగా విద్య సంస్థలకు విద్యార్థి సంఘాల వినతి, 23న విద్యాసంస్థల బంధు నిర్వహిస్తూ భారీ, బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు జక్కుల భానుప్రసాద్, వేల్పుల చరణ్, బొజ్జ జ్యోతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్ చెన్నూరి సాయి కుమార్, మల్లేష్, బైరెడ్డి జశ్వంత్, రాహుల్ గణేష్. (ఏఐఎఫ్డిఎస్) జిల్లా నాయకులు పూల బోయిన రాజు, (పిడిఎస్‌యు) నాయకులు బాలకృష్ణ, వంశీ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 5, 6తేదీలలో సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలు



ప్రజాపక్షం/జడ్చర్ల:భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా 23వ మహసభలను జడ్చర్ల పట్టణ కేంద్రంలో ఆగస్టు 5,6 వ తేదిలలో గౌడ ఫంక్షన్ హాల్ నందు జరిగే మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ తెలిపారు. మాజీ శాసనసభ్యులు, సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి అతిథులుగా పాల్గొంటారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వివిధ జిల్లాలుగా ఏర్పడిన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధి కుంటుపడిందని ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ మాఫియా, ప్రభుత్వ భూములు, భూదాన్ భూములు, దేవాదాయ భూములు, గాంధీ ట్రస్టు భూములు అక్రమణల నుండి కాపాడాలని సిపిఐ పోరాటం నిర్వహిస్తుంది. సిపిఐ జిల్లా 23వ మహసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 5వ తేదీన చంద్రగార్డెన్ నుండి ఫంక్షన్ హాల్ చేరుకుని బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. ఆగస్టు 6న పార్టీ భవిష్యత్తు కార్యాచరణ నిర్వహించుకుని ప్రజా ఉద్యమాలకు సన్నద్ధం అయ్యేందుకు ప్రణాళిక నిర్వహిస్తామన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల్‌రెడ్డి, సిపిఐ పార్టీ జడ్చర్ల మండల కార్యదర్శి బాగి కృష్ణయ్య, మండల నాయకులు కలీం, మన్సూర్, చిన్నజంగయ్య, శ్రీశైలం, నాగరాజు, రహమతుల్లా, సుందర్, సూరి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం

### ఏఐటియుసి గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

### జూలై 9న సమ్మెను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు




ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణిలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9 న దేశ వ్యాప్త సమ్మె ను విజయవంతం చేసిన కార్మిక వర్గానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె 2.వ ఇంక్లైన్ లో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో జరిగిన గేట్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. అదే విధంగా ప్రజా ప్రతినిధులకు కొంతమంది జనరల్ మేనేజర్ లు చపరాసులుగావ్యవహరిస్తూకార్మికులసమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. సింగరేణి కి 36 వేల కోట్ల రూపాయల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి చెల్లించక పోవడం వల్ల కొత్త గనులు రావడం లేదని, సంస్థ లో యంత్రాలు, పనిముట్లు పాతబడి, చెడిపోయి, కొత్తవి కొనలేని పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు సంఘంగా ఏఐటియుసి గెలిచిన తరువాత కార్మికుల సమస్యలపై, సంక్షేమం పై సి అండ్ ఎండి మరియు డైరెక్టర్ పా స్థాయి సమావేశాల్లో అంగీకరించిన కార్మికుల సమస్యలను అమలుచేయాలనిఆయనడిమాండ్ చేశారు. అదేవిధంగా మారుపేర్లు, స్వంతఇంటి పథకం, పెర్క్సుపై ఆదాయపు పన్ను ను సింగరేణి అధికారులకు అమలు చేసినవిధంగా కార్మికుల కు అమలు కోసం, డిస్మిస్ కార్మికుల ను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకునేందుకు కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే అమలుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణిలో సీనియారిటీ ప్రకారం కార్మికులకు కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్స్ అలాట్‌మెంట్ చేయాలని, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు డిప్యూటేషన్లు ఇవ్వాలని, పైరవీకారి విధానం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ ను కాపాడుకునేందుకు ఏఐటియుసి పోరాటాలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, నాయకులు ఎస్ వెంకట్ రెడ్డి, మిట్ట శంకర్, సయ్యద్ సోహేల్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, పెద్దెల్లి శంకర్, భక్తి శ్రీనివాస్, ఎల్. రమేశ్, వెంకటేశ్వర్లు, ఏ.వి.ఎస్ ప్రకాష్, బుడిమె సమ్మయ్య, పడాల కనకరాజు, పర్లపెల్లి రామస్వామి, గంగారపు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాలకుల వైఖరిని యువత ఎండగట్టాలి

### ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర పిలుపు




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ...పెత్తందారుల చేతిలో ప్రభుత్వాలను కీలుబొమ్మలుగామార్చినపాలకుల వైఖరిని ప్రజాక్షేత్రంలో యువత ఎండగట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర పిలుపునిచ్చారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ముత్తగూడెం డివిజన్‌లోని సావిటి సెంటర్‌లో అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)13వ మండల మహాసభను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత అక్కడి పురవీధుల్లో డప్పు శబ్దాలతో ర్యాలీ సాగింది. అరుణపతాకాన్ని సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, యువజన సంఘం జెండాని ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధినేని కర్ణకుమార్ ఆవిష్కరించారు. ఘనపారపు ఉపేందర్, దేవరపల్లి వెంకటకృష్ణ, కళ్లెం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు...18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఓటు హక్కు, పలు హక్కులు ఏఐవైఎఫ్ చేసిన పోరాట ఫలితంగానే లభించాయన్నారు. కానీ ప్రభుత్వాలు యువత ఓట్లను అధికార పీఠాన్ని ఎక్కించే సాధకులుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. భారతదేశంలో 60శాతం ఉన్న యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదనవ్యక్తం చేశారు. ఆపరేషన్ కగర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అడవుల్లోని 36రకాల ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకే నక్సలైట్లనుహతమారుస్తున్నట్లు ఆరోపించారు. అంతేకాకుండా తమ అధికార వాంఛతో ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతూ..మతోన్మాదం సృష్టిసుందని దుయ్యబట్టారు. ప్రధాని మోడీ దేశానికి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా పరిగణించాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మతతత్వ రాజకీయాలపై ఏఐవైఎఫ్ యువకులు ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజాకోర్టులో శిక్షపడేలా చూడాల్సినబాధ్యత ఉందన్నారు. అనంతరం ఖమ్మం రూరల్‌మండలం, ఏదులాపురంమున్సిపాలిటీలను కలిపి 63మందితో 14వ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొహ్మద్ గౌస్‌పాషా, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ పాలేరునియోజకవర్గ అధ్యక్షుడు ఉసికల రవి, కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, అజ్మీరా రామ్మూర్తినాయక్, జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, యడ్లపల్లి శంకరయ్య, చెరుకుపల్లి భాస్కర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం చొరవచూపిరాష్ట్రంలో ఉన్న ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి, సిపిఎంజిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, జిల్లా నేత హలావత్ లింగ్య డిమాండ్ చేశారు. ఆర్టీసీకార్మికులు నాడు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని 50 రోజులపాటు ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తుంటే వారికి మద్దతుగా నిలిచిన వామపక్షనేతలు, కార్యకర్తలపై కేసు పెట్టినవిషయంతెలిసిందే. కేసులో భాగంగా గురువారం మహబూబాబాద్ జిల్లా కోర్టుకు సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి, సిపిఐ ఎంఎల్ నేతలు హలవత్ లింగ్య, జగ్గన్న, పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, సమ్మెట రాజమౌళి, నాగయ్య, రమాదేవి, శ్రీలత హాజరయ్యారు. బి. విజయ సారథి, సాధులశ్రీనివాస్,హలావత్ లింగ్య మాట్లాడుతూ నాడు ఆర్టీసీ కార్మికుల కోసం ఉద్యమం చేస్తుంటే నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అక్రమ కేసులు పెట్టారన్నారు. నాడు పెట్టిన అక్రమ కేసులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు.

### 19నుండి మధిరలో

# సిపిఐ మహాసభలు

### పెనుబల్లి మండల సిపిఐ నూతన కమిటీ ఎన్నిక

### సిపిఐ మండల కార్యదర్శిగా కొమ్మినేని సుధాకర్

ప్రజాపక్షం/పెనుబల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 9వ మండల మహాసభ లింగగూడెం గ్రామంలో జరిగింది. ఈ మహాసభకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ప్రజా సమస్యలపై మండల మహాసభలో చర్చించారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన మండల కార్యదర్శిగా కొమ్మినేని సుధాకర్ ను మరోసారి ఎన్నుకోవడం జరిగింది. సహాయ కార్యదర్శులుగా చిల్లి ముంత ముత్తారావు, సరియం నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా పొదిల భాస్కరరావు, లక్ష్మణరావు,పిఎసిఎస్ డైరెక్టర్ పద్దం జోగయ్య సవలం సునీత,వట్టం శ్రీను, పైదా వెంకటేష్ కమిటీ సభ్యులుగా మంచాల కుటుంబరావు పైదా కిరణ్, కారం రాములు, పద్దం లక్ష్మి పద్దం దేవి, పుల్లయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మినేని సుధాకర్ మాట్లాడుతూ సిపిఐ మండల కార్యదర్శిగా మరోసారి అవకాశం కల్పించినందుకు పార్టీ సభ్యులకు నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈనెల 19, 20 తేదీల్లో మధిరలో ఖమ్మం జిల్లా మహాసభలు జరగనున్నాయని,ఈ మహాసభల జయప్రదానికి ప్రతినిధులు తరలి వెళ్తారని జిల్లా స్థాయిలో సమస్యలపై ఈ మహాసభలో చర్చ జరుగుతుందని తెలియజేశారు. మహాసభలు విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## బస్సు ఏర్పాటు చేయాలని వినతి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మం జిల్లా బస్‌డిపో మేనేజర్‌కు కార్యాలయంలో ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వెంకటగిరి డివిజన్‌కు చెందిన ప్రజలు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా పరిషత్ పెద్ద వెంకటగిరి, అప్పర్‌ప్రైమరీ పాఠశాలకు కోటా నారాయణపురం, ఇందిరమ్మ ఫేస్1, ఇందిరమ్మ ఫేస్2, కోదాడక్రాస్‌రోడ్, టౌన్‌షిప్‌ల నుంచి వెళ్లేందుకు ప్రయాణానికి ఇబ్బందులు అవుతున్నట్లు పేర్కొన్నారు. కావున బస్సును ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని తల్లిదండ్రులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన సంఘం నాయకుడు కందుకూరి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు పంపిణీ

ప్రజాపక్షం/రఘునాథపాలెం : ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్దిదారులకు మంజూరైన పత్రాలను పంపిణీ చేశారు. గురువారం మండల పరిధిలోని రేగులచలక గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో భాగంగా 13 మంది లబ్దిదారులకు మంజూరైన ఇండ్ల పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు యండపల్లి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు అందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారీగా ఇండ్లు మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

### అంబేద్కర్ విగ్రహానికి వినతి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. గురువారం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం మయూరి సెంటర్ అమరవీరుల స్థూపం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ప్లకార్డులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టియుజెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం తొలి దశ ఉద్యమంలో 369 మంది తుపాకీ తూటాలకు బలయ్యారని, మలిదశలో 1200 మంది ఆత్మ బలిదానాలు చేసుకున్నారన్నారు. ఉద్యమకారులు శారీరకంగా, వృత్తిరీత్యా ఆర్థికపరంగా అన్నిరకాలుగా నష్టపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రీయాశీలకంగా పనిచేసిన కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబల రామారావు, జిల్లా అధ్యక్షులు పాలకుర్తి కృష్ణ, అంగిడి బిక్షం, ఎస్‌కె ఫకృద్దీన్, తునికి పాటి చారి, ఉల్లోజు వెంకన్న, వి. రాజేష్‌నాయక్, వడ్డేబోయిన వెంకటేశ్వర్లు, రమ, అరుణ, పలువురు ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మం, భద్రాద్రిలో కెటిఆర్ పర్యటన

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఈనెల 18న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారు. కేటిఆర్ శుక్రవారం ఉదయం 11 గంటలకు హెలికాప్టర్ ద్వారా ఖమ్మం చేరుకుని కవిరాజ్ నగర్‌లో దివంగత మాజీ ఎంఎల్‌ఎ బానోత్ మదన్ లాల్ నివాసానికి వెళ్లి ఆయనకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు కేటిఆర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం వెళ్లి పినపాక మాజీ ఎంఎల్‌ఎ రేగా కాంతారావు మాతృమూర్తి లక్ష్మి నర్సమ్మకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు పాల్గొనాలని ఎంపి వద్దిరాజు రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

## పెండింగ్ కేసుల పరిష్కారం కోసం కృషి

### జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు జూలై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు 90 రోజుల పాటు మధ్యవర్తిత్వ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్, కార్యదర్శి ఎం రాజేంధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంకోసం మీడియేషన్ అనే పేరుతో ఈ డ్రైవ్‌ను న్యూఢిల్లీ నల్సా, సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సలేషన్ ప్రాజెక్టు కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారుల డబ్బు, సమయం వృథా కాకుండా పరిష్కారం లభిస్తుందన్నారు. వివాహ బంధానికి చెందిన వివాదాలు, ప్రమాద బీమా కేసులు, గృహహింస కేసులు, చెక్బౌన్స్, సివిల్ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## డైరెక్టర్ (పా)గౌతమ్ పోట్రును మర్యాదపూర్వకంగా కలిసిన ఐఎన్టీయూసీ బృందం

ప్రజాపక్షం/సత్తుపల్లి : ఇటీవల సింగరేణి సంస్థలో డైరెక్టర్ (పర్సనల్ , అడ్మినిస్ట్రేషన్, వెల్ఫేర్)గా నియమింపబడి మొదటిసారి సత్తుపల్లి విచ్చేసిన గౌతమ్ పోట్రు(ఐఎఎస్)ని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఐఎన్టీయుసి బృందం గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పూల బొకే అందజేసింది. సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం సాధించుటకు ఐఎన్టీయూసీ యూనియన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపి,శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామారావు (ఫిట్ సెక్రటరీ, జే.వి.ఆర్ ఓసి), బాలాజీ (ఫిట్ సెక్రటరీ, కిష్టారం ఓసి), నాగేశ్వరరావు (ఫిట్ సెక్రటరీ , జే.వి.ఆర్ సి.హెచ్.పి) నాయకులు కిషన్ రావు, రఫీ, రషీద్, నాగేందర్, శ్రీనివాసరావు, నరేందర్, శ్రీధర్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో కులం, మతం, పార్టీ చూడం
మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ చేయూత



ప్రజాపక్షం/సత్తుపల్లి : ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో కులం, మతం, పార్టీ చూడమని ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్లు పక్కా మంజూరు చేస్తామన్నారు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. గురువారం పట్టణంలోని వేంసూరు రోడ్డులో గల రాణి ఈవెంట్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి సంబురాలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజలతో కలిసి సత్తుపల్లి నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళాశక్తి సంబరాలలో పాల్గొని వడ్డీలేని రుణాల చెక్కులు, లోన్ బీమా, ప్రమాద బీమా చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కదం తొక్కి, పెద్దఎత్తున మహిళలు సంబరాలకు వచ్చిన మీ అందరినీ చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. అందరి దీవెనలు, ఆశీస్సులతో ఇందిరమ్మ ప్రభుత్వం 18 నెలలు పూర్తి చేసుకుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అరకొర మంచి పనులను కొనసాగిస్తూ, ప్రజల కోరికలు తీరుస్తూ, ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మొదటి దశలో 4లక్షల 50వేల ఇందిరమ్మ ఇండ్లు రూ.22వేల 500కోట్లతో మంజూరు చేశామని, ప్రతి ఇంటికీ రూ.5లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పొందిన ఆడబిడ్డల కళ్ళల్లో ఆనందం చూస్తుంటే కొందరు ఓర్వలేక పోతున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు నిధులు విడుదల చేస్తుందని, ఎక్కడా కూడా నిధుల సమస్య లేదన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా ఉగాది నుండి 93లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యాన్ని రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, రూ.500 గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు 40శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్స్ చార్జీలను పెంచామని, మహిళల కోసం రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళినా ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. పేదవాడి ఆరోగ్యాన్ని కాపాడాలని, రాజీవ్ ఆరోగ్యశ్రీ లబ్ధిని రూ.10లక్షలకు పెంచామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు శివ వేణు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు దోమ ఆనంద్, బాగం నీరజ చౌదరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, చలగుళ్ళ, నరసింహారావు, ఇమ్మనేని ప్రసాద్, కమల్ పాషా, మానుకోట ప్రసాద్, తోట సుజలరాణి,దూదిపాళ్ళ రాంబాబు, అదనపు డిఆర్డీవో జయశ్రీ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ శాఖ అధికారి సునీల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, సత్తుపల్లి తహశీల్దార్ పున్నం సత్యనారాయణ, సత్తుపల్లి మునిసిపల్ కమీషనర్ నరసింహా, మండల సమాఖ్య సభ్యులు, ఎపిఎంలు, మహిళలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి పిఆర్ఒ శ్రీకాంత్‌కు జర్నలిజంలో డాక్టరేట్



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : సింగరేణి హైదరాబాద్ కార్యాలయంలో ప్రజా సంబంధాల అధికారి పిఆర్ఒగా పనిచేస్తున్న శ్రీరాముల శ్రీకాంత్ తాను సమర్పించిన పరిశోధన అధ్యయనానికి తెలంగాణ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్నారు. బుధవారం నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన రెండో స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ చన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మ నుండి డాక్టరేట్ సర్టిఫికెట్‌ను శ్రీరాముల శ్రీకాంత్ స్వీకరించారు. సాంఘిక, రాజకీయ ఉద్యమాల్లో సామాజిక మాధ్యమాల పాత్ర, తెలంగాణ ఉద్యమంపై కేసు స్టడీ" అనే అంశంపై తాను సమర్పించిన పరిశోధనాత్మక అధ్యయనానికి ఆయనకు ఈ డాక్టరేట్‌ను బహూకరించారు. ఉవ్వెత్తున సాగిన తెలంగాణ ఉద్యమంలో యువత అగ్రభాగంలో నిలిచారు. దీనికి ఉద్యమ ఆకాంక్షను విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లడంలో, సామాన్యుల భావ వ్యక్తీకరణకు సోషల్ మీడియా దోహదపడింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఈ విధంగా సోషల్ మీడియా కీలక భూమిక పోషించింది అని వివరిస్తూ శ్రీకాంత్ తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఇప్పటి వరకు సింగరేణి ఉద్యోగుల్లో పిహెచ్‌డి సాధించిన వారు అతి కొద్ది మంది మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉన్నత చదువుల పట్ల జిజ్ఞాసతో శ్రీకాంత్ పిహెచ్‌డి సాధించటంపై చైర్మన్ ఎండి ఎన్.బలరామ్ తన అభినందనలు తెలిపారు. వృత్తి బాధ్యతలను నిర్వర్తిస్తూ, ఉన్నత విద్యార్హతలు సాధించాలనుకునే వారికి ప్రేరణను ఇస్తుందన్నారు. తన పరిశోధన అనుభవంతో సింగరేణి ప్రజా సంబంధాల విభాగానికి కూడా మంచి పేరు తీసుకువస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇడి కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభాని, జీఎం మార్కెటింగ్ టి.శ్రీనివాస్, సింగరేణి భవన్ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలి




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉంటూ పిల్లలు వాటిని దుర్వినియోగం చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ భారతీరాణి తెలిపారు. గురువారం నగరంలోని త్రివేణి పాఠశాలలో బాల బాలికలకు సురక్షితమైన వ్యవస్థలపై స్కోప్ ఆర్ది చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు అంతర్జాలాన్ని వినియోగించడం తప్పని సరైందన్నారు. కానీ వాటిని పిల్లలు సరైన రీతిలో వినియోగించి చదువుకు, భవిష్యత్తుకు తోడ్పాడేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేయడం ద్వారా బాలలు నిరంతరం అంతర్జాలంలో వేధింపులకు గురై మానసిక క్షోభను అనుభవిస్తున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఒక వ్యక్తి కోసం రాజస్థాన్ నుంచి ఖమ్మం వచ్చిన బాలిక కేసును ఉదహరించారు. ఇలాంటివి జరగకుండా మన జిల్లాలో బాలందరిని సురక్షితంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సైబర్ సెల్ ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ నేరాలు రోజు రోజుకు రెట్టింపు సంఖ్యలో నమోదవుతున్నాయన్నారు. మన ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులను, మెసేజ్‌లను తెరవవద్దన్నారు. పొరపాటున తెరిస్తే మన వ్యక్తిగత వివరాలతో పాటు ఖాతాల్లో నగదు కూడా మాయమవుతుందన్నారు. సైబర్ నేరం జరిగినట్లు గుర్తిస్తే గంటలోపు 1930కు ఫోన్ చేయాలన్నారు. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా సాధ్యమైనంత త్వరగా తిరిగి డబ్బు పొందవచ్చునన్నారు. స్కోప్ ఆర్డీ డైరెక్టర్ ఎంఎల్ ప్రసాద్ మాట్లాడుతూ చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో అంతర్జాలంలో బాలలు సురక్షితంగా ఏవిధంగా ఉండాలో అవగాహన కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నామన్నారు. బాలల సమ్యలు ఏమైనా ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు.
ఈ కార్యక్రమంలో స్కోప్ ఆర్డి అసిస్టెంట్ డైరెక్టర్ ప్రమీల, కో ఆర్డినేటర్ లక్ష్మి సుజాత, త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్లు డా.గొల్లపూడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్‌వో కాట్రగడ్డ మురళికృష్ణ, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.




## రెండు అవార్డులు అందుకున్న కలెక్టర్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం తరపున జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బొంబాయ్‌లో రెండు ప్రతిష్టాత్మక అవార్డులను గురువారం అందుకున్నారు. ఐఐటి బాంబేలో నిర్వహించిన ఓపెన్ సోర్స్ జిఐఎస్ డేలో నేషనల్ జియోస్పెషియల్ ప్రాక్టీషనర్ అవార్డు ఒకటి కాగా, మరొకటి ఓపెన్ సోర్స్ జిఐఎస్ కో హార్ట్ అవార్డు. ఈ అవార్డులను ఐఎస్ఆర్ఓ మాజీ చైర్మన్ ఎఎస్ కిరణ్ కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.



## వడ్డీ లేని రుణాలు పంపిణీ

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : డిజెబులిటి గ్రూప్‌కు వడ్డీ లేని రుణాలను ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పంపిణీ చేశారు. ఇల్లందు క్రాస్ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారా బాలాజీ డిజెబులిటీ గ్రూప్ సభ్యులకు మంజూరైన వడ్డీలేని రుణాలను గురువారం కార్పోరేషన్ కార్యాలయం కమిషనర్ అభిషేక్ అగస్త్య లబ్ధిదారులకు అందజేశారు. స్వయం ఉపాధి స్వవలంబన దిశగా ముందుకెళ్లేందుకు ఇటువంటి రుణ సదుపాయం కల్పించినందుకు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎంసి సుజాత, సిఒ సల్మా, బాలాజీ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



ప్రజాపక్షం/పాల్వంచ : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటుగా వివిధ క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తూ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని రాణించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన టెన్నీస్ క్రీడలను శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు అన్ని ఆశ్రమ పాఠశాలల్లో కొత్తగా వ్యాస రచన, ఉపన్యాస పోటీలు, కుట్లు, అల్లికలతో పాటుగా కరాటే తదితర అంశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. గతంలో విద్యార్థులకు మంచి మార్కులు సాధించడమే కష్టంగా ఉండేదని, ప్రస్తుతం విద్యతో శారీరక, మానసిక దృఢత్వం, నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక తరగతులను తీసుకొంటున్నామని అన్నారు. జిల్లాలోని ఐదు ఆశ్రమ పాఠశాలల్లో హాకి, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాట్‌మెంటన్, రెజ్లింగ్ లతో కలిపి □లిపి టెన్నిస్ కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులు అనుకున్నది సాధించే వరకు కఠోర సాధన చేయాలని, అపుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పాఠశాల ఆవరణంలో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వంట చేసే సిబ్బంది పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటిడిఏ చంద్రమోహన్, క్రీడల అధికారి గోపాలరావు, అసిస్టెంట్ క్రీడల అధికారి వెంకటనారాయణ, హెచ్‌ఎం భద్రు, వార్డెన్ పవన్, టిడిఐ గోపాలరావు, పిఈటి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విప్పలమడకలో దొంగల హల్‌చల్

### రూ.3.50లక్షల సొత్తు అపహరణ





ప్రజాపక్షం/వైరా : వైరా మండలం విప్పలమడక గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు దోపిడికి పాల్పడ్డారు. గ్రామంలో ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి సుమారు రూ.3.5లక్షలు సొత్తు అపహరణకు గురైనట్లు సమాచారం. దొంగతనం విషయాన్ని తెలుసుకున్న వైరా పోలీసులు విప్పలమడక గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు ఆనుకొని ఉన్న యడ్లపల్లి మంగయ్య ఇంటికి చేరుకున్నారు. బుధవారం రాత్రి యడ్లపల్లి మంగయ్య అతని భార్య ఇంటి తలుపులకు గడియలు పెట్టి ఇంటి ముందు ఉన్న వరండాలో పడుకున్నారు. అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని వారు ఇంటి వెనుక ప్రహరీగోడకు ఆనుకొని ఉన్న పెండ దిబ్బపై నుంచి ఆ ప్రహరీ గోడను దూకి ఇంట్లోకి ప్రవేశించారు. వెనుక ఉన్న తలుపును తెరిచిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాను తెరిచి బీరువా లాకర్‌లోని సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలను, రూ.65వేల నగదును అపహరించారు. గురువారం ఉదయం 5గంటలకు నిద్రలేచిన మంగయ్య భార్య తన ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. వెంటనే ఖమ్మంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న తన కుమారుడు యడ్లపల్లి పుల్లారావుకు చోరీ జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులు వివరించారు. పుల్లారావు ద్వారా ఈ సమాచారాన్ని తెలుసుకున్న వైరా పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. వైరా పోలీసులు చోరీ జరిగిన విషయాన్ని క్లూస్ టీమ్‌కి సమాచారం అందించారు. క్లూస్ టీం సభ్యులు విచారణ ప్రారంభించారు.

### మణుగూరు మండల కేంద్రంలో..

# ఆదివాసుల రాస్తారోకో



ప్రజాపక్షం/మణుగూరు : మణుగూరు మండల కేంద్రంగా గురువారం ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజనులతో సురక్ష బస్టాండ్ నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు ప్రధాన రహదారిపై ఆదివాసీ సమస్యలపై రాస్తారోకో చేపట్టం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షులు దాట్ల నాగేశ్వరావు మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియా అయినా మణుగూరు మండలం లో సింగరేణి సంస్థ వారు పూర్తిగా ఆదివాసీ చట్టలకు వ్యతిరేకంగా భూసేకరణ చేస్తున్నారన్నారు. పీసా చట్టం ఉన్న ఇసుక గ్రామసభ అనుమతి లేకుండా భూసేకరణ చేయాలని రెవెన్యూ వారు సింగరేణి సంస్థ వారు చూస్తున్నారన్నారు.
ఏజెన్సీ ఏరియాలో 29 శాఖలను కలుపుతూ ఉన్న జీఓ ఎంఎస్ నెం. 03 స్థానంలో ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి మా ఆదివాసులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. మణుగూరు మున్సిపాలిటీ రద్దు చేసి ఆదివాసీ గ్రామాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి ఆదివాసుల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప అధ్యక్షులు సోయం కామరాజు , రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఈసాల సురేష్, రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, భద్రాద్రి జిల్లా అధ్యక్షులు వాగుబోయిన చంద్రయ్య దొర, జిల్లా కార్యదర్శి వాగుబోయిన శ్రీను, మహిళా కార్యదర్శి చింతం చంద్రకళ, ఖమ్మం జిల్లా కార్యదర్శి సాంబశివ రావు, మణుగూరు డివిజన్ తూర్రం రవి, సోలం వెంకటరమణ, మణుగూరు మండల అధ్యక్షులు సోలం హరి శంకర్, ప్రధాన కార్యదర్శి మడి రమేష్, ఉపా అధ్యక్షులు కొండ్రు నాగేందర్, తీర్లాపురం గ్రామస్తులు, పెద్దలు మహిళలు, యువకులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## జనగామ జిల్లాను అగ్రభాగంలో నిలిపిన కలెక్టర్‌కు సన్మానం

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్లో జనగామ జిల్లాను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌ను రీజనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ కమిటీ సభ్యులు చిలువేరు అభిగౌడ్ అభినందనలు తెలుపుతూ సన్మాణించారు. గురువారం జనగామలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఇందిర మహిళా శక్తి కార్యక్రమం సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి మాట్లాడారు. జనగామ జిల్లా కలెక్టర్‌గా రిజ్వాన్ బాష షేక్ అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నారని, ఇటీవల 10వ తరగతిలో రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిపారన్నారు. అభ్యసన సామర్థ్యాల పెంపులోనూ దేశంలో 50 జిల్లాలు అండగా తెలుగు రాష్ట్రాల నుండి ఒకే ఒక జిల్లా ఉండడం అభినందనీయమన్నారు. కలెక్టర్ సారథ్యంలో జనగామ జిల్లా మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

## వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌తో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూస్తాం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హనుమకొండ పట్టణంలో ప్రజల అవసరాలకు నీరు ప్రధానంగా ఉంటదని అధికారులు, సిబ్బంది సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం వర్ధన్నపేట శాసన సభ్యులు కే ఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, నగర కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అధికారులతో కలసి వడ్డేపల్లి ఫిల్టర్, కాజీపేట వాటర్ ట్యాంక్ లను పరిశీలించారు.ఫిల్టర్ బెడ్ లోపల నీటి శుద్ధి పద్ధతిని,నిల్వ సామర్థ్యం లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాల దృష్ట్యా ఫిల్టర్ బెడ్ మరమత్తులకు రూ.2.50 కోట్ల పై చిలుకు నిధులతో సుందరీకరణ పనులను చేస్తామని తెలిపారు.నూతనంగా 5 ఎమ్‌ఎల్‌డి కెపాసిటీగల ట్యాంక్ లను గోపాలపూర్, కాజీపేట,వడ్డేపల్లి లలో నిర్మించాలని, వాటికి కావాల్సిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫాలో అధికారులకు క్షేత్ర స్థాయి సిబ్బందికి సమన్వయ లోపం వలన ప్రజకు నీటి సమస్య కలుగుతుందని తెలిపారు.ఫిల్టర్ బెడ్ బయట లోపల నిఘానేత్రాలు ఉండేలా చూడాలని సూచించారు. నీటి రవాణా సక్రమంగా ఉండేలా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని,మరమత్తుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

## డిఆర్‌డిఒ నరేష్ సేవలు అభినందనీయం

కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** జిల్లాలో నరేష్ డిఆర్డిగా చేసిన సేవలు అభిందనీయమని విధుల నిర్వహణలో అమూల్యమైన సేవలు అందించాని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కొనియాడారు.ఇటీవల జరిగిన బదిలీలలో నరేష్ జగిత్యాల జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో నరేష్ ను జిల్లా కలెక్టర్ శాలువాతో సత్కరించి సన్మానించి అభినందించారు. నరేష్ డిఆర్‌డిఒగా విధులు నిర్వహించిన కాలంలో ఉపాధి హామీ పతకం పనులు,మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు,మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు.అలాగే సరస్వతీ పుష్కరాల నిర్వహణలో స్టాళ్ల ఏర్పాటు,గిరి వికాసం వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో తనదైన శైలిలో చురుకుగా వ్యవహరించారని అన్నారు. జిల్లా అభివృద్ధికి నరేష్ అందించిన సేవలకు గాను జిల్లా యంత్రాంగం తరుపున కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థ, డిఆర్డి బాలకృష్ణ,డిపిఆర్‌ఓ శ్రీనివాస్, డిఆర్డి ఎస్బిఎం కోఆర్డినేటర్ భాస్కర్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకరయ్య, స్వామి ,ఉదయ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.


## భద్రతపై మహిళలకు భరోసా కల్పించడం కోసమే షీ టీమ్

పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** నర్సంపేట డివిజన్ పరిధిలోని మహిళలు, విద్యార్థునులకు భద్రతపై భరోసా కల్పించడంలో భాగంగా నర్సంపేటలో ఏర్పాటు చేయడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. నర్సంపేట డివిజన్ పరిధిలో మహిళల భద్రత కోసం నర్సంపేట పట్టణ కేంద్రంలో పోలీస్ సిబ్బంది నివాస సముదాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన షీ టీం కార్యాలయాన్ని వరంగల్ లాంఛనంగా ప్రారంభించగా, నర్సంపేట షీ టీం విభాగం తొలి ఎస్.ఐగా నియమించబడిన స్వాతిని పోలీస్ కమిషనర్ మొక్కను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నర్సంపేట నూతనంగా ఏర్పాటు చేసిన షీ టీం విభాగం నిర్వహించాల్సిసన విధులపై షీ టీం ఏసిపి సదయ్య పోలీస్ కమిషనర్‌కు వివరించగా, మహిళ, కాలేజీ, పాఠశాల విద్యార్థునుల భద్రత కోసం షీ టీం తరుపున కాలేజీ విద్యార్థునులు అకతాయిల నుండి తమకు తాము రక్షించుకొనేందుగాను షీ టీం ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫేన్స్‌లో భాగం విద్యార్థునులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అందించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నర్సంపేట పట్టణంలో పదుల సంఖ్యల ఉన్నత విద్యకు సంబంధించిన కళాశాలతో పాటు, చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో వివిధ అవసరాల కోసం నర్సంపేట నగరానికి వచ్చి పోయే మహిళలతో పాటు స్థానిక మహిళలు, విద్యార్థునులకు భద్రత కల్పించడం కోసమే నర్సంపేటలో షీ టీం విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం మూడు షీ టీంలు పనిచేస్తున్నాయని, లెంగిక వేధింపులు గురిచేసిన తక్షణమే నర్సంపేట టీం విభాగం ఫోన్ నంబర్ 8712552326 సమాచారం అందించాల్సి వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమములో ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్ కుమార్, నర్సంపేట,షీ టీం ఏసిపిలు రవీందర్ రెడ్డి, సదయ్య, వరంగల్ పోలీస్ కమిషనరేట్ షీ టీం ఇన్స్‌స్పెక్టర్ సుజాత, ఇన్స్‌స్పెక్టర్ రఘు, సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సాయిరమణ, నర్సంపేట డివిజన్ ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గోన్నారు.

## 3,983 కొత్త రేషన్ కార్డులు మంజూరు



**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టాత్మకంగా ప్రజల అవసరాల దృశ్య 10 సంవత్సరాల పైన రాష్ట్ర ప్రజలు నిరుపేదలు ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డులకై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హత గల లబ్ధిదారుల కు కొత్త రేషన్ కార్డు ఇవ్వాలని ఉద్దేశంతో దరఖాస్తు స్వీకరించింది. ఆ దరఖాస్తులన అధికారులు పరిశీలించారు. అందులో భాగంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలం లోని 39 గ్రామపంచాయతీలలో 35 రేషన్ షాపులలో 3983 అర్హత గల వారి దరఖాస్తులను మొదటి విడతగా మంజూరు చేసి ఆమోదించింది. ఈ లబ్ధిదారులకు శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా ఇవ్వనున్నట్లు సమాచారం. మండలానికి మంజూరైన 3983 మంజూరి అయిన రేషన్ కార్డులను రేషన్ షాపుల వారిగా రెవెన్యూ అధికారులు ఏ రేషన్ షాపుకు ఎన్ని కొత్త రేషన్ కార్డులు మంజూరు అయినాయో ప్రభుత్వం పంపించిన కొత్త రేషన్ కార్డులను ఆయా షాపుల వారిగా వచ్చిన రేషన్ కార్డులను విభజిస్తున్నారు.

# మహిళల అభివృద్ధికీ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

పలు వ్యాపారాల్లో మహిళలు ఆర్థికంగా ఎదగాలి
మహిళల పేరు మీదే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
మహిళా సంఘాలలో నూతన సభ్యులను చేర్పించాలి
మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తుందని, మహిళలు ఆర్థికంగా లబ్ది పొందడానికి ప్రతి మహిళను సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావు, అదనపు సిఈఓ సేర్ప్ పి కట్యాయని దేవి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్‌లతో కలిసి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని వడ్డీ లేని రుణాలు చెక్కులు, లోన్ భీమా, ప్రమాద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలో వచ్చిన అనంతరం ఇందిరమ్మ కళతను నెరవేర్చడానికి పలు పథకాలను అమలు చేయడం జరుగుతుందని, మహిళా జీవితాల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుంటూ సంబరాలు చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నామని అనానరు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు దాదాపు రూ.26వేల కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజ్ రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు లక్షల కోట్లు కేటాయించడంతో పాటు వడ్డీ రుణమాఫీ చేసిన ఘనత తమదేనని, మహిళలు అన్ని రంగాలలో రాణించడానికి పలు సంక్షేమ ఫలాలను అమలు చేయడంతో పాటు పలు రంగాలలో రాణించడానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కన్నా ప్రయివేట్ రంగంలో పలు వ్యాపారంలో మహిళలు రాణించడానికి అవకాశం ఉందని, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ములుగు నియోజకవర్గంలో 9 మండల సమాఖ్యలు, 330 గ్రామ సమాఖ్యలు, 6వేల 904 స్వయం సహాయక సంఘాలు, 69,736 స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొంటున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా కృషి చేయడానికి బ్యాంక్ లింకేజిల ద్వారా 2024..25 ఆర్థిక సంవత్సరంలో 249.07 కోట్ల రుణాలను అందించడం జరిగిందని, 2025..26 ఆర్థిక సంవత్సరానికి గాను 618 స్వయం సహాయ సంఘాలకు 54.796 కోట్ల రుణాలను అందించడం జరిగిందని వివరించారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన 5109 స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు మహిళా 884.53 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించడం జరిగతిందని, 5212 స్వయం సహాయక సంఘాలలోని 52615 మంది సభ్యులకు 10 కోట్ల 74 లక్షల వడ్డీ లేని రుణాలను మహిళా శక్తి సంబరంలో అదించడం జరిగిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఇప్పటికే ఆర్‌టిసి బస్సులను అందజేయడంతో పాటు లోన్ బీమా పథకం, ప్రమాద బీమా పథకం ఏర్పాట్లు, కొత్త సంఘాల ప్రారంభం, స్త్రీ నిధి రుణాలు అందజేయడం, మైక్రో ఎంటర్ప్రైజెస్ పాడి గేదెల పెంపకం వంటి తదితర కార్యక్రమాలను మహిళా సంఘాలచే నిర్వహించడం జరుగుతుందని వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆ కుటుంబం ఎదగడానికి దోహదపడుతుందని ప్రతి మహిళ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, సంబంధిత అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, ఏపిఎంలు, మహిళలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక పంపిణీ



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టే లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపట్టే లబ్దిదారులు ఉచిత ఇసుక కోసం సంబంధిత పంచాయతీ సెక్రటరీల ద్వారా ఎంపిడిఓ కార్యాలయంలో బుక్ చేసుకోవాలని, ఒక ఇంటి నిర్మాణం కోసం 25 క్యూబిక్ మీటర్ల ఇసుకను ఉచితంగా పొందవచ్చని కలె క్టర్ తెలిపారు. ఇసుక తోలకాలకు సంబంధించి కొంత మంది ట్రాక్టర్ల యజమానులు రిజిస్ట్రేషన్‌ను చేసుకున్నారని వారి ద్వారా లేదా స్వంత ట్రాక్టర్ల ద్వారా ఇసుక తొలకాలు జరపాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వ్యక్తుల ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తే వాహనాన్ని సీజ్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ప్రతి మహిళ ఆర్థిక అభివృద్ధి సాధించాలని, వ్యాపార రంగాల్లో రాణించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆకాంక్షించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తేనే దేశం పురోభివృద్ధి చెందుతుందన్నారు. గురువారం జనగామ పట్టణంలోని సాయిరాం పంక్షన్‌హాల్‌లో ఇందిర మహిళ శక్తి పథకం ద్వారా నియోజకవర్గ మహిళలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేశారు. వ్యాపార రంగాల్లో రాణిస్తూ ఆర్థిక రంగాన్ని శాసించే స్థాయికి మహిళలు ఎదగాలన్నారు. మహిళలకు ఇందిర మహిళ క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామని కలెక్టరేట్, జనగామ మున్సిపాల్టీ, పాలకుర్తి, బచ్చన్నపేటలో ఏర్పాటు చేయగా విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. ఇదే స్ఫూర్తితో బస్‌ల కొనుగోలు, సోలాల్ యూనిట్ల ఏర్పాటు, పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుతో పాటు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రతి సెంటర్‌లో ఆగస్టు 15వ తేదీ లోపు 50 వనిత టీ స్టాల్స్ ఏర్పాటు చేపట్టాలన్నారు. పిల్లల్ని చదివించాలని, ఆడపిల్లలను తప్పక చదివించి ప్రయోజకుల్ని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, ఆర్‌టిఎ సభ్యులు అభిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, డిఆర్‌డిఓ నూరుద్దీన్, డిపిఎం నళిని నారాయణ పాల్గొన్నారు.

## మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రజా ప్రభుత్వం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి పనులలో భాగంగా గురువారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ గుండ్ల సింగారం, బంజారా కాలనీ, పోలీస్ కాలనీలో రూ.40 లక్షల రూపాయల సాధారణ నిధులతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైన్ నిర్మాణం పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన పలు గ్రామాల అభివృద్దే ధ్యేయంగా దశల వారిగా అంతర్గత రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టిన ప్రతి అభివృద్ధి కార్యక్రమం నిర్ణీత సమయంలోనే పూర్తిచేస్తామని, ప్రజలకు ప్రజా ప్రభుత్వం నిజమైన భరోసా ఇస్తుందని అన్నారు. నిత్యం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తూ ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తూ, అర్హులైన పేదలకు న్యాయం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో జరుగుతుందని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ను 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచామని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతీ పేదవారికి సంక్షేమ పథకాలు అందజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోస, సన్న వడ్లకు 500 బోనస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పరేటర్ లావుద్య రవి నాయక్, డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, పాక్స్ చైర్మన్ మెరుగు రాజేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన సింగులాల్, మాజీ ఎంపీపీ అనిల్ రెడ్డి, మండల అధ్యక్షుడు మదాసి అజయ్, తిరుపతి, డివిజన్, నాయకులు, మహిళలు, యూత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందిస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో ఆత్మకూరు,దామెర మండలాల పరిధిలోని పేద ప్రజలకు నూతన రేషన్ కార్డులను అధికారుల సమక్షంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ ఆత్మకూరు మండలానికి చెందిన 428 మంది లబ్ధిదారులకు, దామెర మండలానికి చెందిన 518 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజల సంక్షేమానికి తన మొదటి ప్రాధాన్యత అని, కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి పథకాలను మంజూరు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, రేషన్ కార్డు లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జనగామలో రైళ్లు నిలపాలని జిఎంకు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/జనగామప్రతినిధి:** జనగామ నుండి ముఖ్యమైన ప్రాంతాలకు వెళ్లెందుకు శాతవాహన, షిరిడీ, చార్మినార్, గోదావరి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని రైల్వే జనరల్ మేనేజర్‌కు సిపిఐ వినతిపత్రం సమర్పించారు. గురువారం రైల్వే జనరల్ మేనేజర్ జనగామ రైల్వే స్టేషన్ సందర్శించిన సందర్భంగా సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న ఆధ్వర్యంలో ఆయనను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆది సాయన్న మాట్లాడుతూ జనగామ చుట్టు 40 కిలో మీటర్ల నుండి వచ్చిన వారు రైల్ మార్గంలోనే ప్రయాణిస్తారన్నారు. జనగామ రైల్వే స్టేషన్‌లో శాతవాహన, షిరిడీ, చార్మినార్, గోదావరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపడం వలన ఇక్కడి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా ప్రాంతాలకు వెళ్లె అవకాశం ఉంటుందన్నారు. నాలుగు ట్రైన్లు నిలపవడం వలన రైల్వేకు సైతం ఆదాయం సమకూరుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం స్టేషన్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు సౌకర్యవంతంగా ఉండేటట్లు చూడాలని, కోతుల బెడద నివారించాలని, రైల్వే ఆర్చిని బ్రిడ్జి దగ్గర ఏర్పాటు చేస్తే అందరికి తెలిసే అవకావం ఉంటుందన్నారు. ప్రధానంగా రైళ్లు ఆపి ఇక్కడి ప్రజల ఇక్కట్లు తొలగించాలని కోరారు. జిఎంను కలిసి వినతిప్రతం ఇచ్చిన వారిలో జోగు పరశరాములు, సఖి, సుధాకర్, యాదలక్ష్మి, వెంకటాద్రి ఉన్నారు.

## యూరియా బస్తాల కోసం రైతులు అష్టకష్టాలు



**ప్రజాపక్షం/పరకాల :** రైతులు తమకు కావలసిన యూరియా బస్తాలను పొందడం కోసం తమకు బదులుగా చెప్పుల జోళ్లన్ని పెట్టి యూరియా బస్తాలు పొందడం కోసం ప్రయత్నం చేస్తున్న పరిస్థితి గురువారం పరకాలలో ఏర్పడింది. ఇక్కడ యూరియా బస్తాలు పొందడం కోసం రైతులు యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారు. వరుసలో లేనట్లయితే యూరియా బస్తాలు దక్కడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. వరుసలో లేకుంటే తమకు యూరియా బస్తాలు దక్కవనే ఆవేదనతో ఉదయం 6 గంటల నుండి వరుసలో నిలబడడం శిక్షగా మారిందని రైతులు అంటున్నారు. గత కొద్ది రోజులుగా పరకాల మండలంతో పాటు వివిధ మండలాలను రైతులు యూరియా బస్తాల కోసం పడుతున్న అగచాట్లు అంతా ఇంత కాదని నిట్టూర్పులు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలబడినందుకు ఈ కష్టాలు తప్పడం లేదని రైతులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.గత 15 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాదిరిగా రైతులు గురువారం పరకాల వ్యవసాయ మార్కెట్లో తమ చెప్పులను క్యూలో పెట్టి యూరియా బస్తాలు పొందాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలతో పాటుగా ఆధార్ కార్డు, జిరాక్స్ చేత పట్టుకొని మహిళా రైతులు మండుటెండలో పడుతున్న అకచాట్లను చూసి తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. ఓ పక్క పత్తి పంటను రక్షించుకోవడమే కాక వ్యవసాయ మార్కెట్లో బస్తాలను పొందడం కష్టంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం మూడు గంటల వరకు వరుసలో నిలబడినా బస్తాలను పొందడంపై నమ్మకంగా లేదనిఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా ఇతర ఎరువులను అందుబాటులో ఉంచే విధంగా చూడాలని స్థానిక ఎమ్మెల్యే ఎవరు ప్రకాశ్ రెడ్డి తో పాటుగా సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు.

## పార్టీలకు అతీతంగా ప్రజాపాలన

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
ఒకే రోజు రూ.2 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు నుంచే పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.గురువారం నాడు అంబేద్కర్ భవన్‌లో జరిగిన ప్రత్యేక చెక్కుల పంపిణి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 52 మంది లబ్ధిదారులకు 19,79,000 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు, హనుమకొండ మండలానికి చెందిన 202 మంది లబ్ధిదారులకు 2,22,02,432 విలువైన కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే నిజమైన ఇందిరమ్మ రాజ్యం సాధ్యమవుతుందని, పేద కుటుంబాల్లో కూతుళ్ల పెళ్లిళ్లు ఆర్థిక భారం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకాల ద్వారా గౌరవాన్ని కలిగిస్తోందని, ఆపదలో ఉన్న వారికి వైద్య ఖర్చుల భారం తట్టుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ఇది ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనం అని అన్నారు. ఇది పార్టీ పాలన కాదు – ప్రజా పాలన. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి మద్దతుగా నిలవడమే తమ కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు లబ్ధిదారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

**ప్రజాపక్షం/ఖానాపూర్:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పోలీస్ కమిషనర్ సత్ ప్రీత్ సింగ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని పోలీసులకు తెలిపారు. ఆయన వెంట ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, దుగ్గొండి సిఐ సాయి రమణ, ఎస్ఐ సిహెచ్ రఘుపతిలు ఉన్నారు.

# రీల్




## తెలిసిన పాత్రల చుట్టూ తిరిగే కథ

–రాణా దగ్గుబాటి

కొత్తపల్లిలో ఒకప్పుడు సినిమా ఈ నెల 18న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ప్రీమియర్ షో నిర్వహించారు . ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో చిత్ర సమర్పకులు

**రానా దగ్గుబాటి మాట్లాడుతూ**

ఈ సినిమా నేను ఫస్ట్ టైం చూసినప్పుడు పాత్రలన్నీ చాలా సజీవంగా కనిపించాయి. అన్ని మనకి తెలిసిన పాత్రలే మన చుట్టూ ఉన్న పాత్రలే అనిపించాయి. డైరెక్టర్ ప్రవీణ కార్డియాలజిస్ట్. తను ప్రాక్టీస్ చేస్తూనే ఈ సినిమా తీశారు. అలాగే మనోజ్ కూడా జాబ్ చేస్తున్నాడు. ఒక సినిమా చేయాలంటే అన్ని వదిలేసుకుని రావాలి అనే ఒక ఆలోచనకు భిన్నంగా వాళ్లు ఈ సినిమాని తీయడం జరిగింది. ఈ సినిమా జూలై 18న రిలీజ్ అవుతుంది అని అన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్రవీణ పరుచూరి , హీరో మనోజ్ చంద్ర , నటులు రవీంద్ర విజయ్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## 'అన్న అంటేనే' పాట విడుదల



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కింగ్‌డమ్'. సత్యదేవ్ మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్ పై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. జూలై 31న విడుదల కానున్న ఈ సినిమాలోని 'అన్న అంటేనే' పాటను విడుదల చేశారు. ఇది అన్నదమ్ముల అనుబంధాన్ని చాటి చెప్పే పాట. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందించారు. అన్నదమ్ముల బంధాలను గుర్తుచేసే పాట, మనసుని తాకే పాటగా నిలిచి పోతుందని నిర్మాత వంశీ అన్నారు. సోదరులుగా విజయ్ దేవరకొండ, సత్యదేవ్ కొత్తగా కనిపిస్తున్నారు. నిజ జీవితంలో అన్నదమ్ముల్లాగా తెరపై కనిపిస్తున్నారు. ఇద్దరూ తమదైన నటన, స్క్రీన్ ప్రెజెన్స్ తో పాటలోని భావోద్వేగాల లోతుని చక్కగా పండించారు. ఈ గీతం తోబుట్టువుల ప్రేమకు పరిపూర్ణమైన నివాళిలా ఉంటుందని చెప్పారు. జోమోన్ టి. జాన్, గిరీష్ గంగాధరన్ ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఈ చిత్ర ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నటుడు సాయి ధరమ్ తేజ్ గుళ్ళు గోపురాలు తిరుగుతున్నారు. తిరువనంతపురంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.



## 'జూనియర్' పైసా వసూల్ మూవీ : రాజమౌళి



ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ 'జూనియర్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో జెనిలియా కీలక పాత్ర పోషిస్తున్నారు. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు రాజమౌళి ఇది పైసా వసూల్ మూవి అని అన్నారు.హీరో కిరీటి మాట్లాడుతూ ఈ సినిమా కోసం మూడేళ్లు కష్టపడ్డాము. జూలై 18న సినిమా రాబోతోంది. కష్టపడి నిజాయితీగా ప్రయత్నిస్తే తెలుగు ప్రేక్షకులు సక్సెస్ చేస్తారనే నమ్మకం ఉందన్నారు. ఈనెల 18న సినిమా రిలీజ్ అవుతోందని చెప్పారు. హీరోయిన్ జెనీలియా మాట్లాడుతూనన్ను మళ్ళీ తెరపైకి తీసుకువచ్చిన టీమ్ అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పారు. హీరోయిన్ శ్రీ లీలా మాట్లాడుతూ జెనిలియా తో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ కళ్యాణ్ చక్రవర్తి ఈ సినిమాకి అద్భుతమైన మాటలు లిరిక్స్ రాశారు. శ్రీమణి కూడా ఇందు లో మరో అద్భుతమైన పాట రాశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఓపి సెంథిల్ కుమార్ , నటులు సందీప్ రాజ్ , వైవా హర్ష తదితరులు పాల్గొన్నారు.

## హరి హర వీరమల్లు'లో నటించడం అదృష్టం

– హీరోయిన్ నిధి అగర్వాల్



'హరి హర వీరమల్లు' లో పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. జూలై 24న విడుదల కానున్న నేపథ్యంలో నిధి అగర్వాల్ మీడియాతో చిట్ చాట్ చేశారు



**✻ సినిమాలో మీ పాత్ర ఎలా ఉండబోతుంది?**

హరి హర వీరమల్లు అనేది ఒక భారీ చిత్రం. ఇందులో నటించే అవకాశం రావడమే గొప్ప విషయం. అలాంటిది నాకు పంచమి అనే శక్తివంతమైన పాత్ర లభించింది. ఈ పాత్రలో ఎన్నో కోణాలున్నాయి. పవన్ కళ్యాణ్ కి, నాకు మధ్య సన్నివేశాలు బాగుంటాయి. అలాగే నా పాత్ర కనిపించే పాటల్లో కూడా వైవిధ్యం ఉంటుంది. పంచమి పాత్రకు తగ్గట్టుగా స్టైలిస్ట్ ఐశ్వర్య దుస్తులను, ఆభరణాలను అద్భుతంగా రూపొందించారు.

**✻ పవన్ కళ్యాణ్ తో కలిసి నటించడం ఎలా ఉంది?**

పవన్ కళ్యాణ్ తో కలిసి నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. పవన్ కళ్యాణ్ కు ఎంతో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆయన సినిమా అంటే ఖచ్చితంగా ఎక్కువమంది ప్రేక్షకులకు చేరువ అవుతుంది. వేరే వంద సినిమాలు చేసినా ఒకటే.. పవన్ కళ్యాణ్ తో ఒక్క సినిమా చేసినా ఒకటే. పవన్ కళ్యాణ్ నుంచి ఎంతో నేర్చుకున్నాను.

**✻ ఇద్దరు దర్శకులు క్రిష్ , జ్యోతి కృష్ణతో పని చేయడం ఎలా అనిపించింది?**

క్రిష్ నన్ను పంచమి పాత్రకు ఎంపిక చేశారు. అలాగే జ్యోతి కృష్ణ సరైన సమయానికి దర్శకత్వ బాధ్యతలు తీసుకొని సినిమాని పూర్తి చేశారు. ఇద్దరూ నాకు స్పెషల్. జ్యోతి కృష్ణ సాంకేతికంగా గొప్పగా ఆలోచిస్తారు. సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకొని.. ఈ తరానికి తగ్గట్టుగా పని చేస్తారు.

**✻ రాజాసాబ్‌లో ప్రభాస్‌తో నటించడం ఎలా ఉంది?**

ఎంత పెద్ద స్టార్స్ అయితే అంత హంబుల్ గా ఉంటారేమో అని వారిద్దరినీ చూస్తే అనిపించింది. పవన్ కళ్యాణ్ గొప్ప నటుడు. పాత్రలో సులభంగా ఒదిగిపోతారు. ప్రభాస్ చాలా మంచి మనిషి. అందరూ చెప్పినట్టుగానే ఆయన నిజంగానే డార్లింగ్.

**✻ హరి హర వీరమల్లులో మీకు ఛాలెంజింగ్ గా అనిపించిన సన్నివేశం?**

భరతనాట్యం నేపథ్యంలో ఒక సన్నివేశం ఉంటుంది. ఆ సన్నివేశం చిత్రీకరణ సమయం ఛాలెంజింగ్ గా అనిపించింది.

## ఆగస్టు 8న 'బకాసుర రెస్టారెంట్'




నటనతో, డైలాగ్ డెలివరితో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న క్యారెక్టర్ ఆర్టిస్ట్, కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్', ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్, ఇతర ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్ జే మూవీస్ పతాకంపై లక్ష్మ య్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఆగస్టు 8న విడుదలకు సిద్ధమవుతోంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రంలోని పాటలకు, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోందని దర్శకుడు శివ అన్నారు. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మీ హృదయాలను హత్తుకునే ఎమోషన్ ఉంటుందని చెప్పారు. ఇతర పాత్రల్లో శ్రీకాంత్ అయ్యంగార్, ఉప్పెన జయకృష్ణ, వివేక్ దండు, అమర్, రామ్‌పటాస్, రమ్య ప్రియ, ప్రాచీ ఠాకూర్, జబర్దస్త్ అప్పారావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బడిస, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వినయ్ కొట్టి, నిర్మాతలు: లక్ష్మ య్య ఆచారి, జనార్ధన్ ఆచారి, దర్శకత్వం: ఎస్‌జే శివ.

## పోస్ట్ ప్రొడక్షన్ లో 'శంబాల'

హీరో ఆది సాయి కుమార్ 'శంబాల 'ఎ మిస్టికల్ వరల్డ్ చిత్రంతో అందరినీ ఆకట్టుకునేందుకు రెడీ అవుతున్నారు. ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ టీజర్ అందరిలోనూ ఉత్కంఠను రేకెత్తిస్తోంది. తాజాగా నిర్వహించిన నార్త్ అమెరికా తెలుగు సొసైటీ కార్యక్రమంలో 'శంబాల' టీజర్ ఆవిష్కరించారు. అక్కడ 'శంబాల' టీజర్‌ను ప్రదర్శించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సుకుమార్, సమంత, శ్రీలీల వంటి టాప్ స్టార్లు హాజరయ్యారు. శంభాల టీజర్‌ను సంగీత దర్శకుడు ఎస్ థమన్ లైవ్ కచేరీలో ప్లే చేశారు.

ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ మూవీని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమాలో అర్చన అయ్యర్, స్వాసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ వంటి వారు నటించారు. ఈ మూవీకి సినిమాటోగ్రాఫర్‌గా ప్రవీణ్ కె. బంగారి అద్భుతమైన విజువల్స్ అందించగా.. శ్రీచరణ్ పాకాల నేపథ్య సంగీతం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ మూవీ రిలీజ్ డేట్‌ను త్వరలోనే మేకర్లు ప్రకటించనున్నారు.




# కాంగ్రెస్ మాటకు కట్టుబడి ఉండే పార్టీ

### కెసిఆర్ అప్పులు చేస్తే మేం కడుతున్నాం
### టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ అంటే మాటకు కట్టుబడి ఉండే పార్టీ అని, మెదక్ జిల్లా ఇందిరా గాంధీ జిల్లా..ఇది కాంగ్రెస్ పార్టీకి అడ్డా అని ఎన్నికలు ఏవైనా మెదక్ లో కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కెసిఆర్ అప్పులు చేస్తే మేం కడుతున్నామని, బనకచర్ల పై కెసిఆర్, హరీష్ రావు తప్పులు చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పై నిందలు వేస్తున్నారని, సంతకం పెట్టింది కేసీఆర్, హరీష్ రావు లు అని అబద్ధాలు చెప్పిన వారిని ప్రజలు ఇంటికే పరిమితం చేశారని దుయ్యబట్టారు. బనకచర్ల కోసం ఆంధ్ర, రాయలసీమ మీద ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడారని, అబద్ధాలు ఆడారన్నారు. బనకచర్ల నీటి బొట్టును కూడా వదిలిపెట్టమని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆధ్వర్యంలో లిలా గ్రూప్ స్వచ్ఛంద సంస్థ నాయకులు మోహన్ నాయక్,మెదక్ నియోజకవర్గ పరిధిలోని వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర మంత్రి డాక్టర్ వివేక్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పిసిసి నేత, మంత్రి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, మెదక్ జిల్లాను కేసీఆర్ ముంచారని, మెదక్ జిల్లా అభివృద్ధికి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని అన్నారు. మెదక్ అభివృద్ధి, సంక్షేమం కోసం ఇంఛార్జి మంత్రి వివేక్ ను నియమించామని పేర్కొన్నారు. నాడు రాష్ట్రంలో కెసిఆర్ ను అందలం ఎక్కిస్తే అప్పులపాలు చేశాడని, ఖజానా కొల్లగొట్టిండని, అందుకే ప్రజలు ఆయన్ను ఇంటికి వెల్లగొట్టారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీదే విజయమన్నారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లిన్ స్వీప్ చేస్తుందని తెలిపారు. మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వంను మెచ్చుకుంటున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల తో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ మెదక్‌లో 10 ఏండ్లలో జరగని అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, గ్రంథలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, నాయకులు ఆవుల రాజీ రెడ్డి,మ్యాడం బాలకృష్ణ, రాగి అశోక్, అరునార్తి వెంకట రమణ, బొజ్జ పవన్,శ్రీనివాస్ రెడ్డి, హరికృష్ణ, పరుశురాం గౌడ్,మాజీ కౌన్సిలర్లు,నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.







రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురైన సిపిఐ నేత చందు రాథోడ్ అంత్యక్రియలు గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆయన స్వగ్రామంలో జరిగాయి. చందు భౌతికకాయానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇ.టి. నరసింహ్మా, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, పుస్తకాల నర్సింగ్ రావు, శంకర్ నాయక్ తదితరులు నివాళి అర్పించారు.

## బిహార్‌లో 12 గంటల బంద్

**(మొదటి పేజీ తరువాయి)**

పట్టుకుని వీధుల్లోకి వచ్చారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నివాసం సమీపంలో భద్రతా సిబ్బంది, కాంగ్రెస్ మద్దతుదారుల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న నిరసనకారులలో ఒపిసిసి అధ్యక్షుడు భక్త చరణ్ దాస్, పార్టీ ఒడిశా ఇన్‌చార్జ్ అజయ్ కుమార్ లల్లు కూడా ఉన్నారని వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుండి ఒడిశాలో మహిళలు సురక్షితంగా లేనందున బంద్‌కు మద్దతు ఇవ్వాలని తాము ప్రజలను అభ్యర్థిస్తున్నామని కాంగ్రెస్ శాసనసభా పార్టీ (సిఎల్‌పి) నాయకుడు రామ చంద్ర కదమ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రతిరోజూ 15 మంది మహిళలు, బాలికలు అత్యాచారానికి గురవుతున్నారని, ప్రభుత్వం ఇలాంటి ఘటనలను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. భువనేశ్వర్‌తో సహా రాష్ట్రవ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా జరిగిందన్నారు. జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్లలో పికెటింగ్ నిర్వహించామన్నారు. అయితే బస్టాండ్‌లు, రైలు స్టేషన్‌లలో చిక్కుకున్న ప్రజలు ఎదుర్కొంటున్న అసౌకర్యం గురించి అడిగినప్పుడు, దాస్ మాట్లాడుతూ, తాము ప్రజలతో ఉన్నామని, వారు సహకరించాలని కోరారు. అత్యవసర అవసరాలు ఉన్నవారిని వెళ్లేందుకు అనుమతిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఒడిశా ఇన్‌చార్జ్ అజయ్ కుమార్ లల్లు, ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా రాష్ట్ర రాజధానిలో పార్టీ జెండాలను పట్టుకుని బంద్‌లో పాల్గొన్నారు. వ్యాపారవేత్తలు, ట్రేడ్ యూనియన్లు, పెట్రోల్ పంప్ కార్మికులు వంటి అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు మద్దతు తెలిపారని లల్లు పేర్కొన్నారు. కాలేజీ విద్యార్థినిది ఆత్మహత్య కాదని, సంస్థాగత హత్య అని, మాఝి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు మా పోరాటం కొనసాగుతుందని లల్లు అన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి సురేష్ పాణిగ్రాహి ఈ ఘటనపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం హయాంలో పరిస్థితులు చేయి దాటిపోతున్నందున తాము వీధుల్లోకి రావాల్సి వచ్చిందని, న్యాయం చేయాలని బాధితురాలు విజ్ఞప్తి చేసిననా పట్టించుకోలేదని, అందువల్ల ఇప్పుడు ఒడిశా ప్రజలు బంద్‌ను అమలు చేస్తున్నారు. బంద్‌కు మద్దతుగా, ఒడిశా పెట్రోలియం డీలర్ల సంఘం ముందుజాగ్రత్త చర్యగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఇంధన బంకులను ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మూసివేసింది. బంద్ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం భద్రతను కట్టుదిట్టం చేసింది.

## డెడ్ స్టోరేజీకి గణప సముద్రం..

**(మొదటి పేజీ తరువాయి)**



10 ఏళ్లుగా పడిపోయిన సందర్భాలు రాలేదు మునుపెన్నడు లేని విధంగా గణపురం చెరువు 14 అడుగుల నీటి నిలువలు పడిపోయాయి. చెరువులో నాలుగు కాలువల ద్వారా మత్తడి కాలువ 500, కొత్త కాలువ 900, ఊట కాలువ 1500, కోట కాలువ ద్వారా 500 గణపసముద్రం కింది గణపురం ఆయకట్టు సాగు అవుతుంది. దీంతో పాటుగానే సుమారు మోరంచ పరివాహక ప్రాంతం గణపురం మత్తడి పోయడంతో మోరంచ పరివాహక ప్రాంతాలైన మోరంచపల్లి, గొర్లవేడు, నేరేడుపల్లి, నైన్ పాక, చైన్ పాక వెంచరామి మోరంచ పరివాహక ప్రాంతాలు గణపురం,భూపాలపల్లి, చిట్యాల మూడు మండలాల కు సుమారు 25 నుండి 30 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. అదేవిధంగా మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ద్వారా గణపురం,రేగొండ,చిట్యాల, మొగుల్లపల్లి, టేగుల్లపల్లి ఐదు మండలాలకు త్రా గునీరు అందిస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో పడకపోవడంతో 14 అడుగుల కింద కు నీరు చేరుకొని ప్రమాదగంటికలు మోగిస్తున్నాయి. ఇప్పటికే మత్తడి కాలువ పంటల సాగు కు నీటిని వదలగా కొత్త కాలువ ఎత్తిపోయింది. ఊట కాలువ, కోట కాలువ ద్వారానే ఆయకట్టు రైతులకు నారు మడులు పోయడం కోసం నీరు బయటికి వదులుతున్నారు. ఇప్పటికే నీటితో నిం డిపోయి మత్తడిపడే సమయంలో నీటి నిల్వలు పడిపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జులై నెల మొత్తం వర్షం పడకుంటే రాబోయే రోజుల్లో మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా ఐదు మండలాలకు సైతం కనీసం త్రాగునీరు అందించని పరిస్థితులు కనిపించబోతున్నాయి. ఇప్పుడున్న నీటిమట్టంతో సుమారు నెల రోజులపాటు త్రాగునీరు అందించవచ్చు కానీ త ర్వాత పరిస్థితి చాలా దారుణంగా ఉంటుందని ఈ ప్రాంత ప్రజలు,రైతులు ఆందోళనలో ఉన్నా రు. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా ఈ ఐదు మండలాలకు 28 మిలియన్ లీటర్లు ప్రతిరోజు సరఫరా చేస్తున్నారు. నీటి నిల్వలు పూర్తిస్థాయిలో పడిపోతే ఐదు మండలాలకు తాగునీరుకు ఇబ్బంది కలుగుతుంది. ములుగు జిల్లా ఏటూరునాగారం కంతనపల్లి దేవాదుల లిఫ్ట్ ద్వారా రామప్ప చెరువు నుండి బుద్దారం వంగపల్లి చెరువు మత్తడి ద్వారా గణపసముద్రం చెరువును నింపడం కోసం జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక చొరవ చూపి దేవాదుల ద్వారా గణపురం చెరువును నింపే విధంగా ప్రభుత్వంతో ఇరిగేషన్ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి తో మాట్లాడి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని ప్రజలు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి : సిపిఐ**

గణపురం చెరువు నీటిమట్టం డెడ్ స్టోరేజ్‌కి పడిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి దే వాదుల ద్వారా రామప్ప నుండి గణపురం చెరు వును నింపే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి స్థా నిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సిపి ఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. చెరువు డెడ్ స్టోరేజీ నీటి నిల్వలను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురిజేపెల్లి సుధాకర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు మాతంగి రామచందర్ లు పరిశీలించారు. ఇప్పటికైనా గణపురం చెరువును రిజర్వాయర్ గా మార్చే విధంగా చర్యలు చేపట్టేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. నీటిని నింప డానికి ఏర్పాట్లు చేసి కరువు నుండి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని జిల్లా కమిటీ పక్షాన వారు విజ్ఞప్తి చేశారు.

## రూ.600 కోట్లు అవినీతి

**(మొదటి పేజీ తరువాయి)**

ఆర్థిక అవకతవకలపై 2017లో జస్టిస్ అనిల్ దవే కమిటీ సిఫార్సులు, రెండు ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికలతో పాటు 2023లో జస్టిస్ ఎల్ నాగేశ్వర్ రావు కమిటీ సిఫార్సుల కాపీలను సిఐడి, ఇడిలకు ఇచ్చామని తెలిపారు.నిధు.ల దుర్వినియోగంతో పాటు జట్టు ఎంపికలో కూడా భారీ మోసాలకు పల్పడ్డారని తెలిపారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి ఐపిఎల్ టిక్కెట్లను బ్లాక్ మార్కెటింగ్‌లో అమ్ముకున్నారని ఆరోపించారు. అనుమతి లేకుండా చట్టవిరుద్ధంగా చెక్కులపై సంతకం చేయడం ద్వారా హెచ్‌సిఎ బ్యాంకు ఖాతాను మోసం చేయడం, మౌలిక సదుపాయాల అభివృద్ధిని పక్కన పెట్టడం జరిగిందన్నారు. క్రికెట్ అభివృద్ధి కోసం బిసిసిఐ గ్రాంట్ల రూపంలో ఇచ్చిన హెచ్‌సిఎ నిధులను, అలాగే క్రికెట్ సంక్షేమం, వృద్ధి కోసం ఐపిఎల్ నుండి వాటా డబ్బును దోచుకోవడానికి వీరంతా కుట్ర పన్నారని తెలిపారు.

గత 10 సంవత్సరాలలో దాదాపు రూ.500 నుండి 600 కోట్ల వరకు హెచ్‌సిఎ ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చినప్పటికీ, హైదరాబాద్‌లో ఎక్కడా క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన ఆధారాలు లేవని తెలిపారు.ఈ నిధులను పక్కదారి పట్టించి హెచ్‌సిఎ నేతలు తమ సొంత ఆస్తులను కూడబెట్టారని ఆరోపించారు.ఐపిఎల్ టిక్కెట్ల అమ్మకాల కాంట్రాక్టును కెటిఆర్ తన బినామి కంపెనీలకు ఇచ్చారన్నారు. ఐపిఎల్ మ్యాచ్‌ల సమయంలో ఆహార కాంట్రాక్టును కవిత, కెటిఆర్‌ల బంధువులు, జగన్ మోహన్ రావు దగ్గరి బంధువు అయిన సురభి క్యాటరర్స్‌కు ఇచ్చారన్నారు., ట్రావెల్స్ కాంట్రాక్ట్, హోటల్ బుకింగ్లు కూడా అదే బ్యాచ్‌లకు ఇచ్చారన్నారు.

**హెచ్‌సిఎపై ఇడి కేసు నమోదు..**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)పై డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు గురువారం తాజాగా కేసు నమోదు చేశారు. ఇసిఐఆర్ కింద మొత్తం ఐదుగురిపై పిఎంఎల్‌ఎ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. బిసిసిఐ నిధుల విషయంలో మనీలాండరింగ్ ఆరోపణలు జరిపినట్లు ఆరోపణలు రావడంతో ఇడి కేసు నమోదు చేసింది.హెచ్‌సిఎ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు, నేతలు శ్రీనివాస రావు, రాజేంద్ర యాదవ్, సునీల్ కాంటే, జి.కవితపై ఈడీ కేసులు నమోదయ్యాయి.

**సిఐడి దర్యాప్తు లీక్ చేసిన సిఐ సస్పెండ్..**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అక్రమాల వ్యవహారంలో సిఐడి సోదాల సమాచారాన్ని లీక్ చేశారనే ఆరోపణ నేపథ్యంలో ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డిని విధుల నుంచి సస్పెండ చేశారు. హెచ్‌సిఎ సెక్రెటరీ దేవరాజ్ కు ఆయన సహకరించినట్టు శాఖాపరమైన విచారణలో వెల్లడయింది. దేవరాజ్ అరెస్ట్ కు కూడా సీఐడీ రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com